ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, ఆగస్టు 24, 2025 | సంపుటి - 21 | సంచిక 340 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



సహస్ర తల్లిదండ్రుల

## ఆందోళనతో ఉద్రిక్తత

- కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం
- హంతక బాలుడిని ఉరితీయాలని డిమాండ్

2

**హైదరాబాద్, నినాదం:**

కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో పదేళ్ల బాలిక సహస్ర హత్య కేసును పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. నిందితుడు మైనర్ అని చెప్పి కఠిన శిక్ష నుంచి తప్పించే ప్రయత్నం చేస్తు న్నారని మండిపడ్డారు. క్రికెట్ బ్యాట్ కోసం వచ్చి చంపాడని చెప్పడం సరికా దన్నారు. ఈ క్రమంలోనే బంధువులు, స్థానికులతో కలిసి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ముందు జాతీయ రహదారిపై బాలిక తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు.




బ్యాట్ దొంగతనం కోసం

## వెళ్లాడు..

అడ్డుకున్న సహస్రను చంపేసిన బాలుడు

వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

2

**హైదరాబాద్, నినాదం:**

ఓటీటీలో క్రైమ్ వెబ్ సిరీస్‌లు చూసి.. పక్కాగా ప్లాన్ చేసి.. ఎనిమిదేండ్ల సహస్రను పదో తరగతి విద్యార్థి అత్యంత దారుణంగా కత్తితో పొడిచి చంపిన సంగతి తెలిసిందే. ఒక్క బ్యాట్ కోసమే ఆ బాలికను చంపినట్లు- నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఇవాళ వెల్లడించారు. అయితే సహస్ర హత్యకు కారణమైన బ్యాట్‌ను పోలీసులు మీడియా ముందు ప్రదర్శించారు.




## హైడ్రా రాకతో తగ్గిన ఆక్రమణలు

- దేశంలో ఎక్కడా ఇలాంటి సంస్థ లేదు
- నాలాలను రక్షించంతో పాటు.. ఆక్రమణలు తొలగిస్తున్నాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

2

**హైదరాబాద్, నినాదం:**

హైదరాబాద్‌లో వరదలు, మురుగునీటి సమస్యలు, చెరువుల కబ్జాలు, పర్యావరణ సమస్యలు వంటి క్లిష్ట అంశాల పరిష్కారానికి ఒక ప్రత్యేక సంస్థ అవసరమని భావించిన ప్రభుత్వం, గత ఏడాది జూలైలో హైడ్రా అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు– చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ సంస్థ పనితీరు, భవిష్యత్ దిశపై కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు. ఇది కొత్త ప్రోగ్రామ్, కాబట్టి ఇంకా చాలా తెలుసుకోవాల్సి ఉంది. సిబ్బంది తక్కువ ఉన్నప్పటికీ, మేము బాగానే పనులు చేస్తున్నాం.



# 62,473

## మెట్రిక్ టన్నులు అందలేదు

- తక్షణం యూరియా సరఫరా చేయండి
- ఆర్ఎఫ్‌సిఎల్ సీఈఓ అలోక్ సింగాల్‌తో తుమ్మల

**హైదరాబాద్, నినాదం:**

రాష్ట్రానికి ఆర్ఎఫ్‌సిఎల్ నుండి రావలసిన యూరియా కోటాలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సరఫరా ఆలస్యమవ్వడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారని మంత్రి తెలిపారు. రైతుల పంటల పై ప్రతికూల ప్రభావం పడకముందే యూరియా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.





## సల్వాజుడుంపై తీర్పు నాది కాదు

అది సుప్రీం నిర్ణయం

దానిని హోంమంత్రి చదివితే బాగుంటుంది

ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్

2

**న్యూఢిల్లీ, నినాదం:**

సల్వా జుడుం తీర్పుపై కేంద్రహోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ అది తాను ఇచ్చినది కాదని, సుప్రీం కోర్టు తీర్పు అని స్పష్టం చేశారు.కేంద్ర హోంమంత్రితో ఈ విషయంపై నేరుగా చర్చకు దిగాలని అనుకోవడం లేదు.



# తగ్గేదే లేదు..

- భావితరాల కోసం 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతాం
- నీటి వనరుల పరిరక్షణలో రోల్ మోడల్ గా తెలంగాణ
- ఆర్థిక భవిష్యత్‌కు పట్టణ ప్రణాళికే పునాది
- ఐటీపీఐ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు




2

'సాధారణంగానే ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారు. మూసీ విషయంలోనూ ఇదే జరుగుతోంది. భావి తరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతాం. వెనక్కి తగ్గేదే లేదు. నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్ గా నిలుపుతాం' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

**హైదరాబాద్, ఆగస్ట్23 నినాదం:**

ఇన్స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా(ఐటీపీఐ) తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్ లోని పార్క్ హయాత్ హోటల్ లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు.

## విషపు గురువు

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

తాగే నీటిలో పాయిజన్



2

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):**

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే ప్రాణాలతో చెలగాట మాడుతూ తాగు నీటిలో పాయిజన్ కలిపి విద్యార్థుల పాలిట యములుగా మారారు. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పాయిజన్ కలిపిన తాగునీటిని తాగిన విద్యార్థు లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. అసలు విషయాలను విద్యార్థులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నీటిలో మోనో మందు కలపడంతో కలుషిత నీరు తాగి అస్వస్థకు గురైనట్లు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు గత కొన్ని రోజులుగా తమని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నరని ఎమ్మెల్యేకు తెలిపారు. సైన్స్ టీచర్ రాజేందర్ తాగునీటిలో మోనో(పురుగుల మందు) కలపాడని అనుమానం రాకుండా దుప్పట్లలో దాచిపెట్టిన మందు బాటిల్ తమకు దొరికిందని విద్యార్థులు తెలిపారు.

## యూరియాపై ఆందోళన వద్దు

- రాష్ట్రానికి సరఫరా పెంచేందుకు అన్ని రకాల చర్యలు
- ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి పునరుద్ధరణపై మార్గనిర్దేశం
- సచివాలయంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు సమీక్ష



రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

సిరిసిల్ల కార్మికులను

## ఆదుకోండి

రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలు మాఫీ చేయండి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్, నినాదం:**

సిరిసిల్లలోని పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవర్ లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు.

2





యూరియా కోసం

## రైతుల అగచాట్లు

క్యూలైన్లలో పడుతున్న తిప్పలు

పాలమూరులో సొమ్మసిల్లిన రైతు

**హైదరాబాద్, నినాదం:**

దుక్కి దున్నినప్పటి నుంచి పంట ఇంటికొచ్చేంత వరకు రైతన్నల పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ప్రకృతి సహకరిస్తే ప్రభుత్వం సహకరించకపోవడం పట్ల అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు.

2

## నిత్యపెళ్లి కొడుకు ఆ కానిస్టేబుల్

- వరుసగా ఐదు పెళ్లిళ్లు చేసుకున్న ఘనుడు
- ఓ మైనర్ బాలిక ఉండడంతో బయటపడ్డ వ్యవహారం
- పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర



వైసీపీ భూతాన్ని

## భూస్థాపితం చేయాలి

- రాష్ట్రం అభివృద్ధికి జగన్ అడ్డగింతలు
- ప్రతిపక్ష పాత్ర దక్కకపోవడంతో విషం చిమ్ముతున్నారు
- స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలి
- పెద్దాపురంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు

**కాకినాడ, నినాదం:**

5

వదల బొమ్మాళీ అంటున్న వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రం బాగు కోసం కూడా పది తరాల ముందు ఆలోచించాలన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానం దక్కకపోవడంతో, అందుకే బయట విషం చిమ్ముతున్నారు. కారు కింద సొంత కార్యకర్త పడినా పట్టించుకోరు. నెల్లూరు వెళ్లి మార్ఫింగ్ ఫొటోలతో ప్రచారం చేశారు. అమరావతి మునిగిపోయిందని వైకాపా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

మీకు సమస్య ఉంటే

## మా ఉత్పత్తులు కొనకండి

ట్రంప్ సుంకాలపై జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు

పాక్, అమెరికాల బంధంపైనా కామెంట్స్

- ఢిల్లీలో జరిగిన సదస్సులో పాల్గొన్న జైశంకర్
- అమెరికా సుంకాల వ్యవహారం
- పోస్టల్ శాఖపై తీవ్ర ప్రభావం
- అమెరికాకు పోస్టల్ కన్‌సైన్‌మెంట్ల నిలిపివేత

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఘాటుగా స్పందించారు. భారత్ నుంచి చమురు, రిఫైన్డ్ ఉత్పత్తులు కొనుగోలుపై ఏదైనా సమస్యలు ఉంటే ఇక్కడి ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అన్నారు.



వివరాలు 2




## సహస్ర తల్లిదండ్రుల ఆందోళనతో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

తమ కుమార్తెను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అతడిని ఎన్‌కౌంటర్ చేయాలని నినాదాలు చేశారు. బాధితుల ఆందోళనతో కూకట్‌పల్లి పీఎస్ వద్ద ఉద్రిక్తత చోటు– చేసుకుంది. సహస్ర తల్లి రేణుక స్టేషన్ ఎదుట గుండెలవిసేలా రోదించారు. కూతుర్ని హత్య చేసినట్లు– ఆ అబ్బాయిని హత్య చేయాలి. నా మీద, నా భర్త మీద ఎన్నో ఆరోపణలు చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతుర్ని మేము చంపుకున్నామని నా మీద విమర్శలు చేశారు. నా కొడుకు ఆలోచన తీరు మారింది. ఒక్క బ్యాట్ కోసం ఇంత దారుణానికి ఒడిగడతాడా. మొబైల్ తీసుకొచ్చినప్పుడే తల్లిదండ్రులు పరిశీలించి ఉంటే ఈ రోజు నా కూతురికిలా అయ్యేది కాదు. అక్కను చంపిన వాడిని నేను చంపుతాను అంటూ నా కొడుకు మాట్లాడుతున్నాడు. ఈ విషయంలో మైనర్ అబ్బాయి తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. మాకు న్యాయం జరగాలి.. నిందితుడిని మా ముందుకు తీసుకురావాలని సహస్ర తల్లి వాపోయింది. ఆందోళన తీవ్రతరం కావడంతో సహస్ర తల్లిదండ్రులని, కుటుంబ సభ్యుల్ని పోలీసులు మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. నిరసనతో మూసాపేట్ నుంచి జేఎన్టీయూ వరకు భారీగా ట్రాఫిక్ జాం అయింది. సహస్ర తల్లిదండ్రులు, ఆందోళనకారులతో పోలీసులు చర్చిస్తున్నారు. కచ్చితంగా న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో సహస్ర కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

## 62,473 మెట్రిక్ టన్నుల యూరియా అందలేదు

మొదటిపేజీ తరువాయి



రావాల్సిన యూరియా కోటా మొత్తాన్ని పూర్తిగా సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముందుగా కనీసం 50 శాతం యూరియాను ఈ వారంలోనే పంపేలా చూడాలని ఆయన సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా ఎరువుల పంపిణీ తక్షణమే జరగాలని మంత్రి స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ఎఈఱ ఎండి, రాష్ట్రా(ని)కి కావలసిన యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల అవసరాలను తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం 42 వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, ఈ రోజు మరో 6543 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రి తెలిపారు. అలాగే ఈ నెల చివరి వరకు వివిధ తేదీలలో మరో 37,877 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని తుమ్మల అన్నారు. యూరియా సరఫరా కోసం ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పేర్కొన్నారు. సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్ఎఫ్‌సిఎల్ సీఈఓ అలోక్ సింగాల్ మరియు ఎన్ఎఫ్సిఎల్ తెలంగాణసేల్స్ మేనేజర్, రాజేశ్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి యూరియా కొతపై వారితో చర్చించారు.

## సల్వాజుడుంపై తీర్పు నాది కాదు

మొదటిపేజీ తరువాయి

గతంలో ఆ తీర్పు నేనే రాశాను. కానీ, అది నా తీర్పు కాదు.. సుప్రీం కోర్టు ఇచ్చినది. 40 పేజీల ఆ తీర్పును అమిత్ షా చదవాలని ఆశిస్తున్నా. ఒకవేళ అది చదివి ఉంటే ఆ వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదు. ఇదే నేను చెప్పదలచుకున్నా. ఇంతటితో ఈ చర్చను ఆపేద్దాం అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో లోటు కనిపిస్తోందని, రాజ్యాంగం కూడా సవాళ్లు ఎదుర్కొంటోందని ఇండియా కూటమి తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఎంపిక చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కులగణన అవసరమని ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయ పడ్డారు. తెలంగాణలో కులగణనకు సంబంధించి ఆయన చొరవ తీసుకున్నారు. కుల గణనపై మాట్లాడుతూ.. సామాజిక ఆర్థిక విధానాల రూపకల్పన కోసం దీనిని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఏకగ్రీవంగా ఎంపికచేయడం గౌరవంగా భావిస్తున్నా. ఇది 64శాతం ప్రజల ప్రాతినిధ్యాన్ని సూచిస్తోంది. ఉప రాష్ట్రపతి ఎన్నిక అనేది ఇద్దరి అభ్యర్థుల మధ్య పోటీ కాదు, రెండు భావజాలాల మధ్య పోటీ–. ప్రజాస్వామ్యం అంటే పరస్పర చర్చ మాత్రమే. వ్యక్తులు, వారి ఆలోచనల మధ్య సంఘర్షణ కాదు. జాతీయ అంశాలపై గతంలో అధికార, విపక్ష పార్టీలు సమన్వయం చేసుకునేవి. దురదృష్టవశాత్తు ఇప్పుడది కనిపించడం లేదు. పార్లమెంటు కార్యకలాపాలకు సభ్యులు అప్పుడప్పుడు 'అంతరాయం' కలిగించడం కూడా ఒక విధమైన నిరసన మాత్రమే. అయితే, ప్రజాస్వామ్య ప్రక్రియలో అది అంతర్భాగంగా మారకూడదు. ఒకప్పుడు లోటు– ఆర్థిక వ్యవస్థ గురించి చర్చ జరిగేది. కానీ, ఇప్పుడు మాత్రం ప్రజాస్వామ్యంలో లోటు– గురించి మాట్లాడుకుంటున్నాం. భారత్ ప్రజాస్వామ్య దేశం కాదని అనడం లేదు. ఇప్పటికీ మనది రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యమే. అయితే, ప్రస్తుతం అది ఒత్తిడికి గురవుతోందని భావిస్తున్నా అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

## హైడ్రా రాకతో తగ్గిన ఆక్రమణలు

మొదటిపేజీ తరువాయి

తప్పులు జరిగితే వాటిని సమీక్షించుకుంటాం అన్నారు. హైడ్రా ఏర్పాటు– తర్వాత ప్రభుత్వమే జిహెచ్ఎంసి యాక్ట్‌లో మార్పులు చేసి సంబంధిత అధికారాలు కల్పించిందని కమిషనర్ తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరిస్తున్నారని చెప్పారు. వరదల్లో మురుగు నీరు సమస్యలను పరిష్కరించడం, అకాల వర్షాల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ, చెరువులు–నాలాలను రక్షించడం హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ చెప్పారు. నాలాల్లో వేలాది ట్రక్కుల పూడికతీత పనులు చేశాం. సిబ్బంది చేతనే మ్యాన్‌హోల్స్, నాలాలు క్లీన్ చేయించాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో కొన్ని ఫోర్కాస్ట్ ఇబ్బందులు ఉన్నా, ఇప్పుడే చేస్తున్న పనులు వచ్చే 100 ఏళ్లకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 65 శాతం చెరువులు మాయం అయ్యాయి. పొల్యూషన్ వల్ల అనేక సమస్యలు వచ్చాయి. వాటిని అడ్డుకోవాలి. ఈూ పేరుతో చెరువులు కొట్టేయాలని చూస్తే ఊరుకోం. చెరువుల మాదిరిగా నాలాలను కూడా నోటిఫై చేసి కబ్జాలను నిరోధిస్తాం అని హెచ్చరించారు. అలాగే, బతుకమ్మ కుంట, కూకట్పల్లి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత స్థానికులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. హైడ్రా ఏర్పడి సంవత్సరం పూర్తయిందని, ఈ కాలంలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని కమిషనర్ తెలిపారు. తక్కువ మ్యాన్‌పవర్‌తో ఎక్కువ ప్రొడక్టివిటీ– సాధించాం. ఇప్పటి వరకు 500 ఎకరాలను కాపాడగలిగామని గర్వంగా చెప్పారు.

# యూరియా'పై ఆందోళన వద్దు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సీజన్ లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ ను ప్రశ్నించారు. మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదని, రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్ ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్సీఎల్ మాతృ సంస్థ ఎన్ఎఫ్ఎల్ కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్ఎఫ్సీఎల్ రామగుండం యూనిట్ హెడ్, జీఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## వెనక్కి తగ్గేదే లేదు..



భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి – ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ – న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీపీఐ ప్రెసిడెంట్ ఎన్ కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో–ఆర్డినేటర్(టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీపీఐ – తెలంగాణ రీజినల్ ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురలీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల కార్మికులను ఆదుకోండి

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. సిరిసిల్ల ప్రాంతం పవర్ లూమ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ సుమారు 25 వేల పవర్ లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో కేటీ–ఆర్ వివరించారు. మారిన మార్కెట్ పరిస్థితులతో బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు తమ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని దొరకడంతో పాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం పవర్ లూమ్ యూనిట్లు– ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీ–ఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుటీర పరిశ్రమల కేటగిరీ కింద 50 శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు–, అవగాహన లోపంతో ఎస్ఎస్ఐ యూనిట్లుగా మారడంతో ఇండస్ట్రీ– `ర3 కేటగిరీ కిందకు వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు, అలాగే 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ.35.48 కోట్లు– బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, ఫలితంగా వారికి పవర్ లూమ్స్ నడపడం కష్టంగా మారిందన్నారు. పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో, సిరిసిల్ల కో–ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని కేటీఆర్ తెలిపారు. టీ–జీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా చెల్లించలేకపోతున్నదని వివరించారు. నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీ–ఆర్ కోరారు. బకాయిలను మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# మీకు సమస్య ఉంటే మా ఉత్పత్తులు కొనకండి

**న్యూఢిల్లీ, నినాదం:**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఘాటుగా స్పందించారు. భారత్ నుంచి చమురు, రిఫైన్డ్ ఉత్పత్తులు కొనుగోలుపై ఏదైనా సమస్యలు ఉంటే ఇక్కడి ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నాలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడిలా విదేశాంగ విధానాన్ని ఇంత బహిరంగంగా నిర్వహించిన ఏ అధ్యక్షుడిని గతంలో చూడలేదన్నారు. వాణిజ్య అంశాలతో పాటు– వాణిజ్యేతర వ్యవహారాలకు టారిఫ్‌లు వినియోగిస్తుండటం కొత్తగా ఉందని ఉన్నారు. ఒక్క భారత్‌తోనే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాలతో ఆయన డీల్ చేస్తున్న విధానం ఇలాగే ఉందన్నారు. వాణిజ్య సుంకాలను 50 శాతానికి పెంచుతున్నట్టు– ట్రంప్ ప్రకటించడానికి ముందు రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తామెలాంటి చర్చలు జరపలేదని ఎకనామిక్ –టైమ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో జైశంకర్ తెలిపారు. భారత్–అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. భారత్‌తో ఘర్షణపూరిత వాతావరణాన్ని కొనసాగిస్తున్న వేళ.. పాకిస్థాన్–అమెరికా మధ్య స్నేహం ఇటీవల పెరుగుతున్నట్లు– కనిపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రెండు దేశాల సంబంధాలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాలకూ ఓ చరిత్ర ఉందని, గతాన్ని విస్మరించిన చరిత్ర కూడా వారిదేనన్నారు. ఈ సందర్భంగా ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన ఘటనను ఉటంకిస్తూ.. అమెరికా సైన్యం అబోటాబాద్‌లో జరిపిన ఆపరేషన్‌ను గుర్తుచేశారు. ఆ రెండు దేశాలకు పరస్పర చరిత్ర ఉంది. అంతేకాదు.. గతాన్ని విస్మరించిన చరిత్ర కూడా వారిదే. ఇటువంటివి మనం చూడటం కొత్తమీ కాదు.

### పోస్టల్ శాఖపై తీవ్ర ప్రభావం

అమెరికాకు అన్నిరకాల పోస్టల్ సేవలను భారత్ నిలిపివేసింది. అయితే ఇది తాత్కాలికమేనని పోస్టల్ విభాగం వెల్లడిరచింది. కొన్ని మినహాయింపులతో భారత్ అమెరికాకు తమ పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. భారత్‌పై పలు రకాల సుంకాల విధింపుల ఆదేశాలను అమెరికా ఈ నెల 29వ తేదీ నుంచి అమలులోకి తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే 800 డాలర్ల వరకూ విలువ చేసే సరుకులపై ఇప్పుడు ఉన్న డ్యూటీ–ఫ్రీ మినిమ్స్ రద్దుకు కూడా అమెరికా నిర్ణయించింది. ఈ క్రమంలో పోస్టల్ సర్వీసెస్‌ను భారతదేశం నిలిపివేసింది. ఈ మేరకు భారత పోస్టల్ విభాగం శనివారం అధికారిక ప్రకటన వెలువరించింది.

# నిత్యపెళ్లి కొడుకు ఆ కానిస్టేబుల్

**సూర్యాపేట, నినాదం:**

సూర్యాపేట జిల్లాలో నిత్య పెళ్లికొడుకుగా చలామణి అవుతున్న కానిస్టేబుల్ కృష్ణంరాజుపై సూర్యాపేట గ్రామీణ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నడిగూడెం పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అతడు వరుసగా నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నాడని, అందులో మూడో వివాహం ఏడాది క్రితం సూర్యాపేట మండలానికి చెందిన పదోతరగతి బాలికతో జరిగినట్లు– ఇటీ–వల వెలుగు చూసింది. ఈ విషయంపై జిల్లా ఎస్పీ నరసింహ స్పందించి వారం రోజుల క్రితం కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అతడి వృత్తి కానిస్టేబుల్ కానీ, మరోవైపు అతడో నిత్య పెళ్లి కొడుకు. ఓ మైనర్ అమ్మాయితో పాటు– నలుగురిని పెళ్లి చేసుకున్న అతను మరో పెళ్లికి సిద్ధమయ్యాడు. దీంతో అతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లాలోని నడిగూడెం పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కృష్ణంరాజు (40)ని ఇటీవల సస్పెండ్ చేశారు. ఇప్పటివరకూ అతను ముగ్గురు మహిళలుతో పాటు– మైనర్ బాలికను కూడా వివాహం చేసుకున్నాడని.. ఐదో పెళ్లికి సిద్ధమయ్యాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నట్లు– విచారణలో తేలింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పి నరసింహ వెంటనే కృష్ణంరాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. మైనర్‌ను వివాహం చేసుకున్న ఘటనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. కానిస్టేబుల్ వివాహం చేసుకున్న బాలిక వయసు 13ఏళ్లు కావడంతో ఆమె తల్లి నుంచి ఫిర్యాదు తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు– గ్రామీణ ఎస్సై బాలునాయక్ తెలిపారు. చివ్వెంల మండలానికి చెందిన కృష్ణంరాజు గతంలో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన సమయంలో ఇసుక వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు– ఆరోపణలు రావడంతో సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత నడిగూడెం ఠాణాలో నియమించగా ప్రస్తుతం సూర్యాపేట కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.



# విషపు గురువు

మొదటిపేజీ తరువాయి

ఈ విషయం ఎవరికైనా తెలిస్తే కొడతానంటూ హెచ్చరించాడని విద్యార్థులు తెలిపారు. ఎవరికి అనుమానం రాకుండా అస్వస్థతకు గురైన విద్యార్థులతోనే టీచర్ కూడా హాస్పటల్లో చేరి చికిత్స పొందుతున్నాడని విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో 34 మంది 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. అయితే ముగ్గురు ఉపాధ్యాయుల మధ్య తరచూ జరుగుతున్న గొడవలే ఇందుకు కారణమని విద్యార్థులు వాపోయారు. సంఘటనకు బాధ్యులైన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఎంక్వయిరీ చేసి మంచినీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో ఉపాధ్యాయుడు రాజేందర్ తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మనిషి రాజేశ్వరిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బాధ్యులైన వారిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేపడుతున్నారు.

## యూరియా కోసం రైతుల అగచాట్లు

మొదటిపేజీ తరువాయి

రైతులు పంటను కాపాడుకునేందుకు అవసరమయ్యే ఎరువులకోసం పడిగాపులు కాస్తున్నారు. పలు జిల్లాల్లో రైతులు నానా యాతన పడుతున్నారు. ముఖ్యంగా యూరియా ఎరువుల కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పంపిణీ కేంద్రాల వద్ద నిద్రాహారాలు మాని క్యూలైన్లో రోజంతా నిలబడుతున్నారు. అయినా యూరియా దొరుకుతుందన్న నమ్మకం రైతులకు కలగడం లేదు. మహిళా రైతుల సైతం పనులన్నీ మానుకొని యూరియా కోసం గంటల తరబడి వేచి చూడడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చూస్తున్నామని వాపోతున్నారు. ఇకపోతే యూరియాపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం రైతుల ప్రాణాల మీదకు తెస్తున్నది. రాత్రనక, పొద్దనక యూరియా సోకం ఆగ్రో సెంటర్ల వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న అన్నదాతలు అనారోగ్యానికి గురవుతున్నారు. శనివారం ఉదయం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం వద్దకు యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఓ రైతుకు ఫిట్స్ రావడంతో పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. స్వయంగా ఆ రైతును అంబులోకి ఎక్కించారు.

## అధికార లాంఛనాలతో సురవరం అంత్యక్రియలు

అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్ : సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరపాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వెంటనే ఈ ఆదేశాలను అమలు చేయాలని దానికి సంబంధించిన ఏర్పాట్లు– చేయాలని సిఎస్‌ను సిఎం రేవంత్ ఆదేశించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. నేడు మధ్యాహ్నం సురవరం భౌతికకాయానికి అధికారం లాంఛనాలతో గౌరవ సూచకంగా అధికారులు నివాళ్లు అర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డితో పాటు– మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిసింది.

# బ్యాట్ దొంగతనం కోసం వెళ్లి.. చంపేశాడు..

మొదటిపేజీ తరువాయి






ఇక ఆ బ్యాట్‌పై రెడ్ కలర్ గుర్తులో ఎంఆర్ఎఫ్ అని రాసి ఉంచారు. సహస్ర తమ్ముడు రెగ్యులర్‌గా ఈ బ్యాట్‌తో క్రికెట్ ఆడేవాడని, దాన్ని చోరీ చేయాలనే ఉద్దేశంతోనే సహస్ర ఇంటికి చోరీకి వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలిందని సైబరాబాద్ సీపీ తెలిపారు. కిచెన్‌లో ఉన్న బ్యాట్‌ను చోరీ చేసే క్రమంలో చిన్న అలజడి రేగడంతో.. సహస్ర అప్రమత్తమై ఎదురించింది. దీంతో ఆమెను బెడ్‌రూంలోకి తోసేసి కత్తితో 18 సార్లు పొడిచి చంపినట్లు– నిందితుడు ఒప్పుకున్నాడు. అయితే ఈ నేరాన్ని అంగీకరించేందుకు నిందితుడు.. రకరకాల కట్టుకథలు సృష్టించినట్లు– పోలీసులు తెలిపారు. చివరకు అతని ఇంట్లో ఉన్న రక్తపు మరకలతో కూడిన బట్టలు, కత్తి అతన్ని పట్టించాయన్నారు. మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన కూకట్‌పల్లి సహస హత్య కేసు మిస్టరీ వీడిరది. హత్య కేసు మిస్టరీని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడిరచారు. సహస్రను చంపింది పక్కింటి పదో తరగతి బాలుడు అని తెలిపారు. సహస్ర హత్యకు గురైన రోజే తమకు అనుమానం వచ్చి బాలుడిని విచారించామని.. కానీ తనకేమీ తెలియదని అబద్ధం చెప్పాడన్నారు. నాలుగు రోజుల పాటు– అనేక మందిని విచారించామని.. అయితే ఓ పిల్లోడు క్లూ ఇచ్చాడని.. హత్య జరిగిన రోజు ఆగస్టు 18న ఉదయం 8:30–8:40 గంటల సమయంలో సహస్ర ఇంటి సమీపంలో నిందితుడు తచ్చాడుతూ కనిపించినట్లుగా పిల్లోడు సమాచారం ఇచ్చాడని.. దీంతో తమ అనుమానం బలపడిరదన్నారు. అనంతరం బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్ల నుంచి నిందితుడు సరిగ్గా స్కూల్‌కు వెళ్లడం లేదని.. ఓటీ–టీ–లో –క్రై–మ్ సినిమాలు, మిస్టరీ సీన్లు చూద్దాం. యూట్యూబ్‌లో క్రైమ్ థ్రిల్లర్ మూవీలు చూద్దాం అలవాటు– చేసుకున్నాడని.. ఎప్పుడూ స్కూల్ ఎగ్గొట్టి క్రికెట్ ఆడుతుంటాడని తెలిపారు. హత్య జరిగిన రోజు నిందితుడి ఇంట్లో తల్లి తప్ప అందరూ ఉన్నారని.. అదే రోజు తల్లి అడిగితే తనకేమీ తెలియదని అబద్ధం చెప్పాడన్నారు. చివరికి తనకేమీ తెలియదని ఒట్టు కూడా వేశాడని ఆమె తెలియజేసినట్లుగా పేర్కొన్నారు. అయితే రెండు నెలల క్రితం చేతిలో మొబైల్ చూసి.. ఇదెక్కడిది అని అడిగితే సమాధానం ఇవ్వలేదని తల్లి చెప్పినట్లుగా పోలీసులు తెలిపారు. ఇక హత్య చేసిన తర్వాత ఇంటి బయట కత్తి కడిగి.. లోపలికి వెళ్లి ప్యాంట్, టీ షర్ట్‌తోనే స్నానం చేసి అనంతరం ఆ బట్టలను వాషింగ్ మిషన్‌లో వేసేశాడని వివరించారు. అయితే తమకు అనుమానం ఇచ్చి నిందితుడి ఇల్లు తనిఖీ చేయగా ఒక లెటర్ దొరికిందని.. అది ఈ హత్య కోసం కాదని చెప్పారు. ఇక అదే రోజు కుందేల్ కూడా చనిపోయిందని.. దాని స్టోరీ కూడా తమకు చెప్పాడని పేర్కొన్నారు. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లినా కుందేల్ బతకలేదని చెప్పినట్లుగా తెలిపారు. కేవలం సహస్ర తమ్ముడి బ్యాట్ నచ్చడంతో.. దాన్ని దొంగిలించాలని స్కెచ్ వేశాడని.. చోరీ చేస్తుండగా సహస్ర చూడడంతో చంపేశాడని పోలీసులు వివరించారు.

## జానపదాలకు ఘన సన్మానం

### డా. తలారి డాకన్నా, డా. ఆశీర్వాదంను సన్మానించిన తెలుగు విశ్వవిద్యాలయ పెద్దలు



**చేవెళ్ళ ఆగస్టు 23( నినాదం):** ప్రపంచ జానపద దినోత్సవ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అనిల్ ఆర్ట్స్ క్రియేషన్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జానపద కళాకారులను ఘనంగా సన్మానించారు. చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పెట్ మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామానికి చెందిన డా. తలారీ ఆశీర్వారం డా. తలారీ ధాకన్నను ఘనంగా సన్మానించారు. సాంకేతికత పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో కూడా మరుగున పడుతున్న జానపద కళలను కాపాడుతూ... యాక్షగానాలను ఆడుతూ... ఆడిస్తూ... ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దుతూ.. కళలను కాపాడుతున్నందుకు జానపద యాక్షగానాలపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నందుకు ఇద్దరు అన్నదమ్ములను సన్మానించి యూనివర్సిటీ పెద్దలు అభినందనలు తెలిపినారు. జానపద కళలు మనుషులకు ఎదురైనా కష్టాల్లోంచి పుట్టినయని, కళలకు ఉద్యమాలకు ఊపిరి పోసే ఘన చరిత్ర ఉందని వేదికపై వర్సిటీ పెద్దలు అన్నారు. మానవ సమాజం విజ్ఞానానికి ఎంత చేరువైన విలువలు పంచిన మూలాలు మరువొద్దన్నారు. ఆ మూలాలు గ్రామీణ ప్రాంతంలో అక్కడక్కడ సజీవంగా ఉన్నాయనిడానికి అక్నాపూర్ గ్రామమే నిలువెత్తు నిదర్శనం అన్నారు. అనంతరం డాక్టర్ డాకన్న ఆశీర్వాదం మాట్లాడుతూ... కళా రంగంలో రాణించేందుకు గ్రామీణ ప్రాంత పెద్దలే ఆదర్శమని గ్రామీణ ప్రాంతంలో అన్న పదాలు పడుతూ... గ్రామీణ నేపథ్యంలో పుట్టి పెరిగామని రైతు కూలీలు కష్టాల మారుస్తరని చెప్పారు.

### బీసీ దళపతి ఆర్ కృష్ణయ్య

## సత్యాగ్రహ దీక్షకు బీసీ శ్రేణులు తరలిరండి.!

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్



**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఆగస్టు 23 ( నినాదం) :** బీసీ దళపతి ఆర్ కృష్ణయ్య చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 25న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టే సత్యాగ్రహ దీక్షకు బీసీలు భారీగా తరలి రావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాగర్ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్ పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్థానిక సంస్థల ఎన్నికలో కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చినటువంటి హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు మొత్తం బీసీలకే కేటాయించాలని చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ల సాధనకై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈనెల 25 తారీకున హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సత్యాగారగ్రహ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ఉన్నటువంటి బీసీ సామాజిక వర్గానికి చెందిన బిసి ప్రజాప్రతినిధులు బీసీ సంఘం నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోయే బీసీ నాయకులు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చి బీసీ వాదాన్ని బలపలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్ల నిరంజన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా నాయకులు రవీందర్ గౌడ్ పబ్బతి శ్రీనివాసులు నేష లక్ష్మయ్య సుధాకర్ గౌడ్ సదుర్ల తిరుపతయ్య నిరంజన్ యాదవ్ శ్రీపురం శీను గొడుగు రాజు. శంకర్ కాళ్ల చైతన్య పాల్గొన్నారు.

### కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం

## తీరని లోటు

### సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్



**కల్వకుర్తి, ఆగష్టు 23 (నినాదం) :** మాజీ పార్లమెంట్ సభ్యుడు, సీపీఐ పార్టీ జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్ లు అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్ నగర్ చౌరస్తాలో విప్లవోద్యమ నాయకుడు,నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యుడు, సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సీపీఐ పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య,కేశవులుగౌడ్, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి జీవితాంతం ప్రజల హక్కులతో పాటు కార్మిక,రైతు,కూలీల కోసం నిరంతర పోరాటం చేశారని గుర్తు చేశారు. కామ్రేడ్స్ సురవరం సుధాకర్ రెడ్డి సాధారణ కుటుంబంలో పుట్టి ఉన్నత విద్యను పూర్తి చేసి కమ్యూనిస్టు సిద్ధాంతాలపై విశ్వాసం పెంచుకొని ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు.నల్లగొండ పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రజలతో మమేకమై వారి సంక్షేమ అభివృద్ధి కోసం శ్రమించారని పేర్కొన్నారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చూపిన మార్గంలో నేడు యువత,పార్టీ కార్యకర్తలు నడవాలని కులం,మతం అనే భేదాలు లేని సమాన హక్కుల సమాజం కోసం కలలు కన్నారని కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి కలలను నిజం చేయడం అందరి బాధ్యత అని వారు అన్నారు.ప్రజల హక్కుల కోసం,ఆర్థిక, సామాజిక సమానత్వం సాధన కోసం పోరాడుతూనే ప్రతి ఒక్కరు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకథనం మార్గదర్శకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా నాయకులు శంకర్ గౌడ్, రవీందర్,పులిజాల పరశురాములు,నాయకులు దార దాసు,మస్క బిక్షం,శేఖర్, మస్తాన్,రవి,తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

**ఏర్పాట్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**ఉత్సవ కమిటీలు, వివిధ శాఖల సమన్వయంతో సహకారం వేడుకలు**

**రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు**



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,ఆగస్టు23,(నినాదం):** త్వరలో ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు, అధికారులతో సిపి ఆఫీసు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు, దిశానిర్దేశం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుపుకొనే అతిపెద్ద ఉత్సవాల్లో ఒకటైన వినాయక చవితి వేడుకలు ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడా అవాంఛిత సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన వాతవరణంలో నిమజ్జనం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వాహకులతో, అధికారులు ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. గణేష్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలని, ఆయా ప్రాంతాల్లోని పౌరవిభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రానున్న గణేష్ నవ రాత్రోత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన రాచకొండ పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్యశాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా సజావుగా జరుపుకునేలా చూడాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వారితో మర్యాదగా ఉండాలని, శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సీపీ సూచించారు. ఇన్ స్పెక్టర్లు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. డయల్ 100 కాల్స్ కు సత్వరమే స్పందించాలని, సీసీటీవీలను విస్తృతంగా వినియోగించాలని, విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండపాల్లో డిజే ఏర్పాటుకు అనుమతి లేదని మండపం నిర్వహకులు, కమిటీలకు అధికారులు వివరించి చెప్పాలని సూచించారు. భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకుని మండపాలలో క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల్లో షార్ట్ సర్క్యూట్ జరగకుండా చొరవ తీసుకొవాలని, కరెంట్ షాక్ కొట్టకుండా మండపాల వద్ద ప్లాస్టిక్ పరదాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న గణేష్ మండపం నిర్వాహకుల కమిటీ వివరాలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, సరఫరాలో అంతరాయం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొవాలని ఆదేశించారు. రౌడీ షీటర్, సంఘ విద్రోహశక్తులమిద మీద నిఘా ఉంచాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర ఎటువంటి సమస్యలు, ఘర్షణలు లేకుండా చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాలు వుంటే బందోబస్తును పెంచాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలందరూ గణేశ ఉత్సవాలను ఘనంగా, శాంతియుతంగా జరుపుకోవాలని, గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు, నిమజ్జనోత్సవానికి అవసరమైన పోలీస్ బందోబస్తు, స్విమ్మర్స్, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పరిస్థితిని పర్యవేక్షించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ముందుగానే చెరువులు, ఇతర నిమజ్జన నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లను, బారికేడ్లను నిర్మించాలని, మంచి నీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. ప్రజలు, భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతు పనులు, శానిటైజేషన్ పనులను చేపట్టాలన్నారు. గణేష్ వేడుకలను నిర్విఘ్నంగా, ఘనంగా, గౌరవప్రదంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. భద్రతాపరంగా పోలీసులు పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో డీసీపీ ఎస్బి జి నరసింహ రెడ్డి, డిసిపి క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎస్బి, సీసీఆర్బి ఏసిపిలు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

### మనం పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు

## సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాలి

**• పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** ప్రజలంతా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి తరుణంలో మనం పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాలని, ప్రతి పండగ వెనకా ఓ మహోన్నత లక్ష్యం కనిపిస్తుందని ప్రకృతిలో మమేకమవుతూ నేలా – నీరు, చెట్టూ – పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటినీ ఆరాధించడం అనాదిగా మన సంస్కృతిలో భాగంగా కొనసాగుతూ వస్తోంది కనుక మనమందరం మట్టి వినాయకుడిని పూజించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దాంమని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. శనివారం వినాయకచవితి పర్వదినంను పురస్కరించుకుని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6,000 మట్టి వినాయకుల ప్రతిమలను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాధ్యత తీసుకోవాలని , హోప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో 6000 మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేయడం చాలా అభినందనీయమని అన్నారు. గత 10 సంవత్సారాలుగా హోప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మట్టి వినాయకుల పంపిణి చేపడుతూ పర్యావరణ విషయంలో తమదైన పాత్ర పోషించడం పట్ల ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ని ప్రత్యేకంగా అభినందించారు. వినాయక ప్రతిమలను చేసేది మట్టితో అలకరించేది ఆకులతో, పూజించేది పూలతో, నిమజ్జనం చేసేది నీటితో గణపతి అంటే ఆకృతి కాదు, ప్రకృతి మన సనాతన సంస్కృతి అని అన్నారు. మట్టి వినాయకులను పూజించి మన యొక్క పర్యావరణాన్ని కాపాడుకుందామని, చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరకు మట్టి వినాయకులను మన స్వగృహం ప్రాంగణంలోనే నిమర్జనం చేసుకుందామని అన్నారు. తమ ఫౌండేషన్ ఆద్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం 6 వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్, నాయకులు సంజీవ రెడ్డి, మంత్రి ప్రగడ సత్యనారాయణ, ఎండీ. ఇబ్రహీం, పురెందర్ రెడ్డి, అష్రాఫ్, శోభన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సురవరం మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు

**• జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్**



**జవహర్ నగర్, ఆగస్టు 23 (నినాదం):** సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ఉద్యమాలకు తీ రని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రావి నారాయణరెడ్డి నగర్లో అమరవీరుడు సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి జవహర్ నగర్ లోని సిపిఐ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించు కొంటూ మాట్లాడుతూ డెంటల్ కాలేజీ భూ పోరాటంలో సుధాకర్ రెడ్డి భాగస్వామ్యం ఉందని వారు అంచలంచెలుగా ఎదుగుకుంటూ ఎంపీగా రాష్ట్ర కార్యదర్శిగా జాతీయ కార్యదర్శిగా ఈ దేశ తాడిత పీడత ప్రజల హక్కుల కోసం పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి ఎన్నో త్యాగాలు చేసిన ఘన చరిత్ర సురవరం సుధాకర్ రెడ్డికే దక్కుతుందన్నారు. సౌమ్యుడు మృదుస్వభావి అందరితో కలిసి మెలిసి ఉంటూ నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాంతం పనిచేసిన నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. జాతీయ పార్టీకి నాయకత్వం వహించిన తెలుగు వ్యక్తి ఉన్నత స్థానానికి ఎదిగి గుర్తింపు పొందన సౌమ్యుడిగా అందరితో కలిసి మెలిసి ఉండేవారని ఆయన గొప్ప మేధావని అభివర్ణించారు. వారి మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పని చేసిన గొప్ప వ్యక్తి అని సమాజం కోసం పేద బడుగు బలహీన వర్గాల కోసం ఎప్పుడు ఆరాటపడే వారిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల నరసింహులు, గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి స్వరూప నాయక్, కీసర మండల కార్యదర్శి వి. రవి నాయక్, గిరి ప్రసాద్ నగర్ మాజీ సహాయ కార్యదర్శి సురేష్, సిపిఐ నాయకులు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కేవీలో ఘనంగా ముగిసిన

## 54వ జాతీయ క్రీడోత్సవాలు



**అల్వాల్, ఆగష్టు 23 ( నినాదం)** బొల్లారం కేవీలో గత ఐదు రోజుల నుండి నిర్వహిస్తున్న 54వ జాతీయక్రీడోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీణా అనిల్ కుమార్ రోటే మాట్లాడుతూ సికింద్రాబాద్ బోలారం లోని పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ లో ఈనెల19 నుండి23 వ తేదీ వరకు 54వ జాతీయక్రీడోత్సవాలు. 14,17, 19 వయస్సులోపు బాలికలఆర్చరీ, విలువిద్య ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. పి.ఎమ్.శ్రీ కేంద్రీయవిద్యాలయ, బోలారంలో ఈ ఐదు రోజులు ఆవాస వ్యవస్థ కల్పించబడినది. ఈ కార్యక్రమంలో 20 రీజియన్లు నుండి 150 విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ క్రీడలకు శనివారంతో ముగింపు ఉత్సవము ను ఘనంగా నిర్వహించాము. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా అంతర్జాతీయ హెప్టాథ్లన్అథ్లెట్ కుమారి అగసరనందిని విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ప్రధమ బహుమతి చెన్నై రీజియన్ దక్కించుకున్నది అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలలో గెలవడం ముఖ్యం కాదు, పాల్గోవటం ముఖ్యమని గెలవడానికి ప్రయత్నం చేయాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పి.జి.టి.జీవశాస్త్రం శ్రీరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ ఫార్మర్లులో రాగి దొంగిలించిన ఆరుగురు అరెస్టు



**ఖమ్మం, ఆగష్టు 23(నినాదం):** ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘు నాథ పాలెం మండలం, అర్బన్ పోలీసు స్టేషన్ లో పలు దొంగతనాల్లో నిందితులుగా ఉన్న ఆరు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. రైతుల పంట పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్లను దొంగిలించి అందులో ఉన్న కాపర్ ని తీసి అమ్ముతున్న ఈ ముఠా సభ్యులు. వారి వద్ద నుండి 100 కేజీల రాగి, 20, 000 స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో రఘు నాథ పాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ ఎస్సై నరేష్, ఎసై తేజేశ్వర్ రెడ్డి సిబ్బంది రాజు, సంజీవ్ పాల్గొన్నారు

### సమస్యలపై ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

## సుడిగాలి పర్యటన




**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న కొన్ని ముఖ్యమైన సమస్యలపై శనివారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ,కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ లతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. అనంతరం స్థానిక కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ రానున్న వినాయక చవితిని దృష్టిలో పెట్టుకొని తయారు చేయించిన మట్టి గణేశులను ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. రామ్ నరేష్ నగర్ అసోసియేషన్ సభ్యులు ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు కట్టుకొని కుటుంబాలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నేపథ్యంలో వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి రిజిస్ట్రేషన్స్ నిలిపివేయడం విడ్డూరం అని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ హాయంలో ఇప్పుడన్నటువంటి ప్రభుత్వ హయాంలో ప్రజలకు మిగిలింది నిరాశయనని ఎద్దేవ చేశారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

**మట్టి వినాయకుడిని పూజిద్దాం..**



మట్టి వినాయకుడిని పూజించి, పర్యావరణాన్ని కాపాడుదామని ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజించడం అంటే మన ప్రకృతిని పూజించడంతో సమానమన్నారు. మనకు జీవాన్ని, జీవితాన్ని, మనుగడని ఇస్తున్న ప్రకృతిని పూజించే అవకాశం మనకు వినాయకచవితి ద్వారా లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్రావు, అరుణ్ కుమార్, కృష్ణంరాజు, సునీల్ రెడ్డి, సీతారామరాజు, రాధాకృష్ణ యాదవ్ అంబాదాస్, వీరాచారి, కృష్ణ, శేషయ్య, బాలాజీ, నర్సింగ్ యాదవ్, నరసింహ చారి, దుర్గాప్రసాద్, గోపాల్ రావు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యా వెంకట్‌ను పరామర్శించిన గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సీనియర్ పాత్రికేయులు విద్యా వెంకట్ తీవ్రంగా గాయపడి కూకట్‌పల్లి రాందేవ్ రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి హాస్పిటల్ కి వెళ్లి విద్యా వెంకట్ ని పరామర్శించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుతం జరుగుతున్న చికిత్స విధానం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలను వినియోగించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వెంకట్ త్వరగా కోలుకునేలా చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యోబ్, నాయకులు పురెందర్ రెడ్డి, ఆనంద్, పాత్రికేయ మిత్రులు రాహుల్, హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీలో లోపాలను సహించం

**ఎరువుల విక్రయాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**రైతులు మోతాదులోనే ఎరువులు వాడాలి**

**యూరియా స్టాక్ పరిశీలన, రిజిస్టర్ల తనిఖీ నిర్వహించిన**

**నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్‌కర్నూల్, ప్రతినిధి ఆగస్టు 23 (నినాదం) :** యూరియా పంపిణీలో ఇలాంటి లోపాలను సహించేదిలేదని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. రైతులు రసాయన ఎరువులు అధికంగా వాడితే అనర్థమేనని, వ్యవసాయ శాఖాధికారుల సూచనలను పరిగణంలోకి తీసుకొని తమ పంట పొలాల్లో ఎరువులను మోతాదులోనే వాడాలని కలెక్టర్ రైతులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలను రైతులకు అవసరమైన మేరకు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు యూరియా తీసుకున్న రైతుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేశారా లేదా అని చూశారు . ఎన్ని ఎకరాలు ఉన్న రైతు.. ఎన్ని బస్తాల యూరియా తీసుకున్నారు, వారి వివరాలను నమోదు చేసారా లేదా అని రిజిస్టర్ లను చెక్ చేసారు.అలాగే గోదాం లో ఉన్న స్టాక్ ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు రసాయన ఎరువులను అధికంగా వాడితే పంట దిగుబడులు తగ్గుతాయని, నేల దెబ్బతింటుందని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పరిగణలోకి తీసుకుని, భూమి స్వభావం, పంట అవసరాలకు తగ్గట్టుగానే ఎరువులను మోతాదులో వాడాలని అని రైతులకు సూచించారు. సరిపడా యూరియా ఉన్నప్పటికీ... కొరత సృష్టించాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు ఎక్కువ సేపు వేచియుండకుండా చేపించకుండా యూరియా అమ్మకాలు త్వరగా కావాలన్నారు.రైతులకు అవసరమైన మేరకు జిల్లాలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు తమ పంట పొలాలకు అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఆక్రమించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదాన స్థలాన్ని తిరిగి అప్పగించాలి

**ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంఘన మోని బంగారు బాబు**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఆగస్టు 23 (నినాదం):** ఆక్రమించిన ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలకు సంబంధించిన మైదాన స్థలాన్ని తిరిగి కళాశాలకు అప్పగించాలి సి సి రోడ్డును నిర్మించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంఘన మోని బంగారు బాబు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాల శనివారం సందర్శించడాని వచ్చిన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కి ఏబీవీపీ ఆధ్వర్యంలో వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు ఏబీవీపీ నాయకులు డిగ్రీ కళాశాలకు సంబంధించిన మైదాన స్థలాన్ని తిరిగి కళాశాలకు అప్పగించేలా చూడాలని కళాశాలకు సీసీ రోడ్డు 30 మీటర్ల వెడల్పు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన మైదాన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించు కోవడం జరిగిందని, కళాశాలకు మైదానం లేక విద్యార్థులు క్రీడలు ఆడటానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, కళాశాలకు వెళ్లే దారి మట్టి దారి కావడంతో వర్షం పడి గుంతల మయంగా మారి విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, జిల్లాలో భారత్ కన్వీనర్ రమేష్ ,నగర సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, కళాశాల ప్రెసిడెంట్ శివ, భరత్, నిశాంత్, మున్నా, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్ష యువజన పథకంపై అవగాహన



**వైరా ఆగస్టు 23 (నినాదం):** వైరా మున్సిపాలిటీ ఒకటో వార్డులో ప్రధానమంత్రి సురక్ష క్యాంపెయిన్ ఎస్బిఐ ఖమ్మం రీజియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎస్బిఐ రాజశేఖర్, మరియు ఆర్థిక సమ్మేళనం మేనేజర్ సురేష్ కుమార్ రావడం జరిగింది, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఎస్బిఐలో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికి 20 రూపాయలు సురక్ష బీమా పథకం 436 రూపాయల జీవనజ్యోతి పథకం చెల్లించి రెండు లక్షలు బీమాను పొంది కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించటం. దీంట్లో భాగంగా ఇప్పటివరకు ఎస్బిఐలో ఖాతాలు లేని వారికి ఖాతాలు తెరవడం ఇన్సూరెన్స్ లు చేయడం జరిగింది. స్థానికంగా ఉన్న ఎస్బిఐ సర్వీస్ పాయింట్ నిర్వాహకులు అయిన భరతనాకేష్ , కాంపల్లి వెంకటి, స్వప్న తాండ్ర, భానోత్ కృష్ణ, మరియు గ్రామ పెద్దలు అప్పం సురేష్, చింతపల్లి జయరాజు, ఎర్రబోయిన రామారావు, రాయపూడి కన్నయ్య, లాలయ్య, సుమన్, కొమ్ము భాస్కర్, వెంకటరత్నం, వెంకయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్ళికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆర్థికసాయం



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నినాదం) :** కల్వకుర్తి పట్టణం సుభాష్ నగర్ కాలనీకి చెందిన మహేశ్వరి పెళ్లికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. తల్లిదండ్రులు లేని నిరుపేద ఆడబిడ్డ మహేశ్వరి వివాహం సందర్భంగా అమ్మాయి కుటుంబ పరిస్థితిని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తనవంతు సహకారం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మాయి కుటుంబ సభ్యులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గణేష్, శేఖర్, శ్రీను, ఝాన్సీ, గంగా తదితరులు పాల్గొన్నారు.

# 'కే.పి.ఆర్ గౌతమ్'లో అంతరిక్ష దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి, ఆగస్టు 23 (నినాదం):** శనివారం స్థానిక కే.పి.ఆర్ గౌతమ్ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థులకు అంతరిక్ష స్వరూపం,శాటిలైట్ విధానం, స్పేస్ స్టేషన్ నమూనా మొదలగు అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మన దేశం నిర్మిస్తున్నటువంటి భారతీయ అంతరిక్ష స్టేషన్ బి.ఏ.ఎస్ వర్కింగ్ నమూనాను 9వ తరగతి విద్యార్థి భూక్య హనీష్ కుమార్ ప్రాజెక్ట్ రూపంలో ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శనలో అంతరిక్షంలో పరిశోధనలు చేస్తున్నటువంటి స్పేస్ స్టేషన్ నమూనా ఏర్పాటు చేసి విద్యార్థులకు దానిపైన అవగాహన కల్పించాడు. తనకు చిన్నతనం నుంచి అంతరిక్ష విషయాల పైన ఎంతో ఆసక్తి ఉండడం వలన దీనిపైన పరిశోధనలు మొదలు పెట్టానని తద్వారానే ఈ ప్రాజెక్టుని రూపొందించినట్లు హనీష్ తెలిపాడు. ప్రస్తుతం భారతదేశం తన సొంత స్పేస్ స్టేషన్ అంతరిక్షంలో నెలకొల్పడానికి అన్ని సన్నాహాలు చేస్తుందని 2028 వ సంవత్సరం నుంచి భారత్ కు అంతరిక్షంలో సొంత స్టేషన్ ఏర్పాటు జరగబోతుందని తద్వారా మన దేశం తన సొంత శక్తితో అంతరిక్షంలో జరుగుతున్నటువంటి మార్పులు, రహస్యాలు, సాటిలైట్ వ్యవస్థ భూగ్రహానికి ఏ రకంగా అనుసంధానం చేపడుతుందని దానివల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలు గురించి సుదీర్ఘమైనటువంటి చర్చను విద్యార్థుల ముందు ఉంచాడు. ప్రజలందరికీ సైన్స్ అండ్ టెక్నాలజీ రాబోయే రోజుల్లో అత్యంత ముఖ్యమైన అంశంగా ఉండబోతుందని దానిపైన ఎక్కువ ఆలోచన చేయవలసిన అవసరం ఉందని తెలిపాడు. ఈ నమూనా తయారు చేయడానికి తనకి సుమారు రెండు నెలల సమయం పట్టిందని తక్కువ ఖర్చుతో మనం వాడి పారేసినటువంటి వస్తువులతో ఈ నమూనాన్ని తయారు చేసినట్లు తెలిపాడు. భవిష్యత్తులో తను ఇస్రోకి సేవలు అందించాలని ఆశపడుతున్నట్లు దానికి అనుగుణంగా కావలసిన సమాచారాన్ని విషయాన్ని అర్హతను పెంచుకుంటున్నట్లు తెలిపాడు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ ప్రారంభించి ఇటువంటి విద్యార్థి పాఠశాలలో ఉండడం మాకు ఎంతో గర్వకారణం అని భవిష్యత్తులో భారత శాటిలైట్, అంతరిక్ష పరిశోధన సంస్థల్లోకి హనీష్ కుమార్ ఎదగాలని ఆకాంక్షించారు. ఇతని కృషి పట్టుదల వెనక హనీష్ తల్లిదండ్రుల పాత్ర చాలా గొప్పదని ఆర్థికంగా స్థితివంతులు కాకపోయినా కుమారుణ్ణి తనకు నచ్చిన రంగంలో ప్రోత్సహించడానికి స్తోమతకి మించి ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ దేశానికి సేవ చేస్తే చాలా సంతోషిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఏ విద్యార్థి సంఘానికి..

## రాష్ట్రవ్యాప్తంగా మూకుమ్మడిగా రాజీనామాలు



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 23 (నినాదం) :** ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఏ) కు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా రాజీనామాలు చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, అలీసాగర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో విద్యారంగ సమస్యల పట్ల చురుకుగా విద్యార్థి నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నక్రమంలో పార్టీలో రాష్ట్ర నాయకత్వాన్ని కాదని ఆంధ్ర పెత్తనం మొదలైందని దాంతో విద్యార్థి సంఘానికి సలహాదారుడిగా వ్యవహరించేటటువంటి తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ ఆంధ్ర పెత్తనంతో ఇబ్బంది పాలవుతుందన్నారు. ఈ ఆంధ్ర నాయకుడి పెద్ద పెత్తనం విద్యార్థి సంఘం పైకి మర్లి విద్యార్థి సంఘాన్ని కూడా అనేకమార్లు వ్యక్తిత్వ విలువలు కించపరిచే లాగా మాట్లాడటం, కేవలం తాము చెప్పినటువంటి కార్యచరణలు చేయాలనటం, కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తుంటే అడ్డుపడటం జరిగిందన్నారు. ఆంధ్రా అజమాయిషిని తట్టుకోలేక విసిగిపోయి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ జిల్లాల నాయకులు రాష్ట్ర కమిటీ మొత్తం కూడా ముక్కుమ్మడిగా రాజీనామాలు చేశామన్నారు. రాజీనామా చేసినటువంటి తెలంగాణ రాష్ట్ర నాయకత్వం రాజీనామాల అనంతరం విద్యారంగ సమస్యలపై పోరాడేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా రాజీనామా చేసినటువంటి ఐసా నాయకత్వం మొత్తం కూడా టీఎస్ఏ పేరుతో నూతనంగా తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ గా ఏర్పడి రాష్ట్ర నాయకత్వం మొత్తం కూడా విద్యారంగ సమస్యలపై కొత్త ఎజెండాను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజల విశ్వాసం పెంచాలి

**ప్రభుత్వ ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి**


**నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసిన కలెక్టర్**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఆగస్టు 23 (నినాదం):** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా, వైద్యులు స్థానికంగానే ఉంటూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్యులను ఆదేశించారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధ నిల్వలు, వార్డుల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు సమయపాలనతో మెరుగైన వైద్య సేవలు అందించాలి అని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వైద్యులు స్థానికంగానే ఉండి రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ సైతం తన బీపీని ఆరోగ్య కేంద్రంలోనే చెక్ చేయించుకున్నారు. అనంతరం కలెక్టర్ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ఓపి, ప్రసవాల వివరాలు, సాధారణ ప్రసవాల వివరాలతో పాటు భవిష్యత్తులో అంటువ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు కావలసిన మందులు సమృద్ధిగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే వైద్య అధికారులను సంప్రదించాలని, వారు పరిష్కారం చూపుతారని భరోసా ఇచ్చారు.

# జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారుల దందాపై సోదాలు



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 23 (నినాదం) :** నిజామాబాద్ జిల్లాలో వడ్డీ వ్యాపారుల దందా లపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోదాలు చేపట్టింది. శనివారం తెల్లవారుజాము నుంచి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు వడ్డీ వ్యాపారుల ఇండ్లలో, కార్యాలయాలలో తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో చాలమటుకు అప్పులు ఇచ్చిన వడ్డి వ్యాపారులు ఆస్తులు తనఖా పెట్టి( సెల్ రిజిస్ట్రేషన్) లు చేసుకుని, అధిక వడ్డీలు వసూల్, లైసెన్స్ లేకుండా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహణపై ఫిర్యాదుల నేపథ్యంలో సోదాలు అదేశించారు. జిల్లా లో ఏకకాలంలో పది టీంలతో సోదాలు నిర్వహించారు. నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, ఆర్మూర్ డివిజన్ లో పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించారు. సంబందిత ఎసిపీల పర్యవేక్షణలో సిఐలు, ఎస్ఐల అధ్వర్యంలో వడ్డి వ్యాపారుల దందాల వివరాలను, లావా దేవిల చిట్టాలను పరిశీలించారు. సంబంధిత వివరాలు అధికారులు సిపి కి అందచేయనున్నారు.

# విధులు బహిష్కరించి మిషన్ భగీరథ కార్మికుల సమ్మె



**వైరా ఆగస్ట్ 23 (నినాదం):** వైరా నియోజకవర్గ కేంద్రంలో రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలోని మిషన్ భగీరథ పథకం వద్ద కార్మికుల వేతనాలు చెల్లించాలని మిషన్ భగీరథ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలు వేతనాలు చెల్లించాలని హెడ్ వర్క్ వద్ద నీటి సరఫరా బంద్ చేసి మిషన్ భగీరథ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో 18 మండలాలకు త్రాగునీటి సరఫరా బంద్ అయింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 600 మంది కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో త్రాగునీటి కోసం స్థానిక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకులు మద్దెల రవి మాట్లాడుతూ ఎల్ అండ్ టి కంపెనీ లో 463 మంది కార్మికులు ఎస్.కె ఎలక్ట్రికల్ కంపెనీ 9 మంది కి 13 నెలలు మిషన్ భగీరథ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా జానపద దినోత్సవ వేడుకలు

**ప్రభుత్వం జానపద కళాకారుల కోసం జానపద అకాడమీ ఏర్పాటుచేయాలి**

**తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి**




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 23 (నినాదం):** అంతరించిపోతున్న జానపద కళలను బతికించాలని, జానపద కళాకారుల కోసం ప్రత్యేక జానపద అకాడమీని ఏర్పాటుచేయాలని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ జానపద దినోత్సవ సందర్భంగా ఖమ్మం నగరంలోని సంజీవరెడ్డి భవనంలో శనివారం జానపద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం, కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద కళాకారులు కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు పోలూరి రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి లు ముఖ్య అతిథులుగా విచ్చేసి వారు మాట్లాడుతూ.. జానపద కళాకారులకు ప్రభుత్వం తక్షణమే జానపద అకాడమీ ఏర్పాటుచేసి అంతరించిపోతున్న జానపద కళలను బతికించాలని కోరారు. 1848 సంవత్సరంలో మిలియన్ థామస్ ఫోక్ లిటరేచర్ అనే పదాన్ని కనుగొని జానపద దినోత్సవంగా ప్రకటించారు. ఆగస్టు 22ను ప్రపంచ జానపద దినోత్సవంగా ప్రకటించి అన్ని జిల్లాలలో జానపద జాతరను నిర్వహించాలని ప్రభుత్వానికి విన్నవించారు. కాంగ్రెస్ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు వంగపండు పుల్లారావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు నంద్యాల నాగేశ్వరరావు, కొచ్చర్ల గురవయ్య, కర్ణ పుల్లయ్య, అద్దంకి నరసింహారావు, బొడ్డు నాగేశ్వరావు, పెద్దపాక విజయ్, డప్పు శ్రీకాంత్, డోలక్ నరేష్, ఉపేందర్, వంశీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా బ్యాగ్ లెస్ డే

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**కలెక్టరేట్‌ను సందర్శించిన జెడ్పిహెచ్ఎస్ వివి పాలెం విద్యార్థులు**



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 23 (నినాదం):** పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ప్రతి నాల్గవ శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాగ్ లెస్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం బ్యాగ్ లెస్ డేలో భాగంగా కలెక్టరేట్ ను సందర్శించడానికి వచ్చిన జెడ్పిహెచ్ఎస్ వివి పాలెం 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులను జిల్లా కలెక్టర్ కలిసారు. బ్యాగ్ లెస్ డే సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం, ట్రెజరీ, ఇతర శాఖలకు వెళ్లి పిల్లలు విజిట్ చేసి వాటి పని తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో మాట్లాడి సమీకృత జిల్లా కలెక్టరేట్ సందర్శనలో ఏమేమి గ్రహించారో అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం జిల్లాలో నేడు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాగ్ లెస్ డే అమలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా 4వ శనివారం జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాగ్ లెస్ డే జరుగుతుందని అన్నారు. బ్యాగ్ లెస్ డే రోజున పాఠశాలల్లో క్విజ్, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, క్రీడా పోటీల నిర్వహణ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కూరగాయల మార్కెట్ల సందర్శన, సర్వే నిర్వహణ, బుక్ ఫేర్ నిర్వహణ వంటి వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక నైపుణ్యాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వృత్తిపరమైన, వివిధ పనులకు సంబంధించిన నైపుణ్యాలపై ఉన్నత తరగతి విద్యార్థులకు అవగాహన, అనుభవం కల్పించేలా కార్యక్రమాల అమలుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. బ్యాగ్ లెస్ డే సందర్భంగా పిల్లలు సరదాగా, ఉల్లాసంగా గడిపేలా మంచి కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీచర్లకు తెలిపారు. బ్యాగ్ లెస్ డే లో భాగంగా పిల్లలకు పాఠశాలలో పాఠ్యంశాల బోధన కాకుండా ఆటలు, ఇతర వినోద కార్యక్రమాలు, సామాజిక ప్రోగ్రాం, నైపుణ్య శిక్షణ వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. తరగతి గది బోధనకు బదులుగా ఆచరణాత్మక, ఇంటరాక్టివ్ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారిణి నాగ పద్మజ, జెడ్.పి.హెచ్.ఎస్. వివి పాలెం హెడ్మాస్టర్ శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు ఏ. రమాదేవి, డోరిస్, శైలజ, మాధవి, దాస్, వెంకటేశ్వర్లు నగేష్, నాగులు, పుల్లయ్య, పిఈటి ఆదర్ష్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డెంగ్యూ ఏలిసా వాషర్, రీడర్ మిషన్‌ల సరఫరాకు టెండర్లు దాఖలు చేయాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కళావతి బాయి**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 23: (నినాదం):** 5 డెంగ్యూ ఏలిసా వాషర్, రీడర్ మిషన్ ల సరఫరా చేయడానికి టెండర్లు దాఖలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీల్డ్ కవర్ టెండర్లను ఆఫ్ లైన్ పద్ధతిన ఆగస్టు 27 మధ్యాహ్నం 3.00 గంటల్లోగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయంలో అందజేయాలని, 27 లోగా దాఖలైన టెండర్ లను ఆగస్టు 28 న మధ్యాహ్నం 2.00 గంటలకు ఫైనల్ చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నినాదం) :** మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన నాప రాములమ్మ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.3వేలు ఆర్థిక సహాయం చేశారు. మృతురాలి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, దేవాలయ చైర్మన్ రవిగౌడ్, వైస్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ నెంబర్ బాల్ జంగయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లెల్ల ఎస్సీ సెల్ మహేందర్, మాజీ వార్డ్ నెంబర్ పాండురంగారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాప మల్లయ్య, మాజీ వార్డ్ నెంబర్ ఆంజనేయులు, శ్రీశైలం, శ్రీహరి, రమేష్, జంగయ్య, తోటపల్లి నరసింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీ ఎదుట 13 మంది డీజే ఆపరేటర్ల బైండోవర్

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 23 (నినాదం) :** పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 13 మంది డీజే ఆపరేటర్లను శనివారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఎదుట బైండోవర్ చేశారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం, మిలాద్-ఉల్-నబి, దుర్గామాత ఉత్సవాల సందర్భంగా డీజే ఆపరేటర్లు, డీజే యజమానులు, ట్రబుల్ మాంగర్స్, బోధన్ డివిజన్ పరిధిలో గల వివిధ పోలీస్ స్టేషన్లలలో గతంలో నమోదైన కేసుల లోని నిందితులను బైండోవర్ చేశారు. వచ్చే 6 నెలల పాటు సత్ప్రవర్తనతో ఉండాలని డీజే యజమానులకు రూ.2 లక్షలు, ట్రబుల్ మాంగర్స్ కు రూ.లక్ష, డీజే ఆపరేటర్లకు రూ.50 వేలు స్వంత పూచీకత్తు పై బైండోవర్ చేశారు. పై పూచీకత్తు కాలంలో మళ్ళీ నేరాలు చేసినట్లు అయితే పూచీకత్తు ఇచ్చిన రూపాయలను జప్తు చేసి జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5, ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3, రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురిని బైండోవర్ చేశారు.

# వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేయాలి

**రాష్ట్రం అభివృద్ధికి వారే అడ్డుతగులుతున్నారు**
**ప్రతిపక్ష పాత్ర దక్కకపోవడంతో విషం చిమ్ముతున్నారు**
**స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలి**
**పెద్దాపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు**



**కాకినాడ, ఆగస్టు 23 (నినాదం):** వదల బొమ్మాళీ అంటున్న వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రం బాగు కోసం కూడా పది తరాల ముందు ఆలోచించాలన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానం దక్కకపోవడంతో, అందుకే బయట విషం చిమ్ముతున్నారు. కారు కింద సొంత కార్యకర్త పడినా పట్టించుకోరు. నెల్లూరు వెళ్లి మార్ఫింగ్ ఫొటోలతో ప్రచారం చేశారు. అమరావతి మునిగిపోయిందని సాక్షిలో దుష్ప్రచారం చేస్తోంది. అమరావతి నిధులు ఇవ్వొద్దని అందరికీ లేఖలు రాశారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా అమరావతిని తయారు చేస్తాం. అమరావతి, విశాఖ, తిరుపతిని మహానగరాలుగా మారుస్తాం అన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు వస్తే ఎవరినైనా ఆహ్వానిస్తాం. వైకాపా నేతలు మాత్రం పెట్టుబడిదారులను బెదిరిస్తారు. వైకాపా హయాంలో నకిలీ వ్యక్తులకు దివ్యాంగుల పింఛన్లు ఇచ్చారు. పింఛన్లు అర్హులకే అందాలి.. అనర్హులకు కాదు. రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీసేలా విషప్రచారం చేస్తున్నారు. మనది విజన్ రాజకీయం.. వాళ్లది క్రిమినల్ రాజకీయం అని చంద్రబాబు వైకాపా తీరుపై మండిపడ్డారు. స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే దీనిని సాధించగలమని అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. దీనిని విస్మరించడం వల్లనే అంటు- వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఇందుకు ప్రధాన కారణం చెత్త, అపరిశుభ్రత అన్నారు. గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది గానీ.. చెత్త మాత్రం తీయలేదు. ప్రజారోగ్యాన్ని వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం తొలగిస్తాం. గత ప్రభుత్వంలో అరాచకాన్ని సృష్టించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగి.. ఆరోగ్యంగా ఉండాలనేదే నా ఏకైక కోరిక. మన ఆలోచనలు ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదు.. చెత్త నుంచి సంపద సృష్టించొచ్చు. ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్‌కు పంపేలా ఆలోచనలు చేస్తున్నాం. పేదవాడి ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం అని చంద్రబాబు హామీ ఇచ్చారు. సంపద సృష్టించడం.. ఆదాయాన్ని పెంచడం మాకు తెలుసు. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు చేస్తే దీర్ఘకాలం కొనసాగదు. నేను సూపర్ సిక్స్ అంటే సాధ్యం కాదన్నారు.. చేసి చూపించాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యింది. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఎప్పటికప్పుడు వారి ఖాతాల్లో నగదు జమచేస్తున్నాం. రాష్ట్రంలో 40వేల హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు చాలా ఆనందంగా ఉన్నారు. ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్ని వర్గాలకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నాం. పీ-4 ద్వారా పేదప్రజలను ఆదుకుంటున్నాం. పేదలపై పన్నుల భారం తగ్గించాలని కేంద్రం యోచిస్తోందని సీఎం తెలిపారు. వైకుంఠపాళి ఆటలు మన రాష్ట్రానికి వద్దు. మనకు అభివృద్ధి కావాలి. పేదరికం పోవాలి. పేదవాళ్లకు సాయం చేసేందుకు మార్గదర్శులు ముందుకు రావాలి. పెద్దాపురం నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. ఎన్నికల ముందు పింఛన్ల పేరుతో ఎండల్లో తిప్పి వృద్ధుల మరణానికి కారణమయ్యారు. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారని, అయితే తాము వాటిని అమలు చేసి చూపించామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మోహంలో ఆనందం చూడాలని కోరుకుంటున్నట్లు- తెలిపారు. ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ చెత్త ఎత్తే కార్యక్రమం చెయ్యలేదు. కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇంట్లో చెత్త బయట పడేయటం వలన అంటూ వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ రెండో తేదీలోపు 85టన్నుల చెత్తను సేకరిస్తాం. టీ-డీపీ, జనసేన, బీజేపీ కలిసి ఏర్పాటు- చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి మోహంలో ఆనందం చూడాలి

# ఆదాయం తగ్గి..అప్పులు పెరిగాయి

**ఆందోళన కలిగిస్తున్న కాగ్ నివేదికలు**
**ఎక్స్ వేదికగా ఆర్థిక పరిస్థితిపై జగన్ విమర్శలు**



**అమరావతి, ఆగస్టు 23 (నినాదం):** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై సోషల్ మీడియా వేదికగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎక్స్ లో స్పందించిన ఆయన.. ఆదాయాలు తగ్గిపోయి, అప్పులు పెరగటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. కాగ్ నివేదికలపై ఎక్స్ లో ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు భారీగా తగ్గి, అప్పులు పెరిగిపోతున్నాయి.. కూటమి ప్రభుత్వ విధానాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిరదని ఆరోపించారు.. ఆదాయాలు తగ్గి, అప్పులు పెరిగిపోతున్న ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని హితవు చెప్పారు.. అన్ని స్థాయిల్లో పెరిగిన అవినీతిని అరికట్టాలని సూచించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2019-24 మధ్య మా ప్రభుత్వంపై టీ-డీపీ, జనసేన పార్టీలు పదేపదే అబద్దాలు చెప్పాయి. రాష్ట్రంలో ఆదాయ వృద్ధి తగ్గిందనీ, అభివృద్ధి అనేదే లేదని తప్పుడు ప్రచారం చేశాయి. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ కూటమి నేతలు నమ్మబలికారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆదాయాలు భారీగా తగ్గాయని పేర్కొన్నారు జగన్.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయాలు కేవలం 3.08 శాతం మాత్రమే పెరిగాయని తెలిపారు జగన్.. కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04 శాతం పెరగగా, ఏపీ ఆదాయం భారీగా తగ్గిపోయిందన్న ఆయన. కూటమి ప్రభుత్వం చెప్పినట్టు- నిజంగానే ఏపీ ఆర్థిక వృద్ధి 12.02 శాతం ఉంటే, మరి ఆదాయం పెరుగుదల 3.08 శాతం దగ్గరే ఎందుకు ఆగిపోయింది? అని ప్రశ్నించారు.. గతేడాదితో పోల్చితే ఈఏడాది కొంత ఆశాజనకంగా ఉంటుందనుకుంటే మొదటి నాలుగు నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంన్న ఆయన.. ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా బాగా తగ్గిపోయిందన్నారు.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆదాయాల వృద్ధి పది శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 2.39 శాతం మాత్రమే ఉంది. మా హయాంలో అన్ని రకాల అప్పులు కలిపి రూ.3,32,671 కోట్లు- మాత్రమే.. కానీ, టీ-డీపీ కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లోనే ఏకంగా రూ. 1,86,361 కోట్లు- అప్పు చేసింది.. అంటే మా ఐదేళ్ల హయాంలో చేసిన అప్పుల్లో ఇప్పటికే 56 శాతం చేశారని పేర్కొన్నారు..

# మా లెక్కలు ఏం తేల్చేది

**మీ లెక్కలు ఇప్పటికే జనం తేల్చారు**
**బట్టలూడదీసినా బుద్ధిరాలేదు: చింతమనేని**

**అమరావతి, ఆగస్టు 23 (నినాదం):** వై నాట్ 175 అంటే వైసీపీ బట్టలు ఊడదీశారు.. జగన్ బట్టలు నైతికంగా ఊడతీశారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యానించారు.. అమరాతిలో మీడియాతో మాట్లాడిన ఆయాన.. వైసీపీ నేతలు ఎవర్ని బెదిరిస్తున్నారు..? అని ప్రశ్నించారు.. ఇక, మా గొప్పతనం వల్ల మేం గెలవలేదు... వైసీపీ అరాచకాలు వల్ల గెలిచామని చెప్పుకొచ్చారు.. మా లెక్కలు తేలుస్తారా..? ఏ లెక్కలు ఉన్నాయని తేలుస్తారు? అంటూ మండిపడ్డారు.. వైసీపీకి ప్రజలు రాజకీయ గోరి కట్టే రోజు దగ్గరలోనే ఉందన్న ఆయన.. దోపిడీదారులకు తమ అండ దండ ఉందని జగన్ నేతృత్వంలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు.. జగన్ కు, అతని అనుచరులకు కాల్చి ఎక్కడ వాతలు పెట్టకూడదో అక్కడ ప్రజలు వాతలు పెట్టినా బుద్ధిరాలేదని ఫైర్ అయ్యారు.. తాను చేసిన దోపిడీకి భార్యను కేసులో ఇరికించి పారిపోయిన పేర్ని నాని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై నోరూపారేసుకుంటు-న్నాడు.. దోచుకోవడం, దోపిడీ చేయటమే వైసీపీ సిద్ధాంతమని దుయ్యబట్టారు చింతమనేని.. అధికారం ముసుగులో చేసిన అరాచక దాడులు మరిచారా? అని ప్రశ్నించిన ఆయన.. చేపల దొంగతానినికి పాల్పడ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి మద్దతుగా జగన్ అనుచరవర్గమంతా వచ్చింది.. కొల్లేరుకు వలస పక్షులు వచ్చినట్లు- అప్పుడప్పుడు దెందులూరుకు అబ్బయ్య చౌదరి వస్తాడు.. ఎప్పుడు ఎప్పుడు టీ-డీపీలో చేరాలా అని అబ్బయ్య చౌదరి ప్రయత్నిస్తున్నాడు.. ఎన్నికల సమయంలో కూడా నేను గెలిచి టీ-డీపీలో చేరతానని ప్రచారం చేసుకున్నాడని మండిపడ్డారు.. ఇక, దెందులూరు నియోజకవర్గంలో చేసిన అక్రమాలపై త్వరలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# సిట్ వెల్లడించినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం

**సిట్ ప్రశ్నలకు నేరుగా సమాధానం చెప్పా**
**అరెస్ట్ చేశారంటూ అసత్య ప్రచారం చేశారు**
**మాజీమంత్రి నారాయణ స్వామి సంచలన వ్యాఖ్యలు**

**చిత్తూరు, ఆగస్టు 23 (నినాదం):** ఏపీలో సంచలనంగా మారిన లిక్కర్ స్కాం కేసులో శుక్రవారం రోజు వైసీపీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ- సీఎం నారాయణస్వామిని సిట్ అధికారులు ప్రశ్నించారు.. దాదాపు 6 గంటల పాటు నారాయణస్వామిని విచారించిన సిట్ అధికారులు కీలక విషయాలు రాబట్టారని.. ఆయన కీలక సమాచారం ఇచ్చారని, ల్యాప్‌టాప్ కూడా సీజ్ చేశారని వార్తలు వచ్చాయి.. అయితే, సిట్ విచారణపై మరోసారి మీడియాతో మాట్లాడిన మాజీ డిప్యూటీ- సీఎం నారాయణస్వామి.. ఆసక్తికర విషయాలు వెల్లడించారు.. సిట్ వారు సహకరించారు.. వారు అడిగిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను... కేసుతో నాకేం సంబంధం లేదు.. అంతా పైవాళ్లే చేశారని నేను ఎక్కడ సిట్ అధికారులకు చెప్పలేదని స్పష్టం చేశారు.. సిట్ అధికారులు ఇబ్బంది పడే ప్రశ్నలు అడిగినా.. నేను సమాధానం చెప్పాను... నన్ను అరెస్టు చేశారంటూ కొందరూ అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. నేనెప్పుడూ నీతిగా, నిజాయితీ బతికాను... ఎప్పుడూ తప్పు చేయలేదు.. అవినీతి చేయలేదన్నారు నారాయణస్వామి.. ఇక, నాకు ల్యాప్‌టాప్ అంటే ఏంటో.. దానిని ఎలా వాడాలో కూడా తెలియదు.. నాకు వాట్సాప్ వాడటం కూడా రాదన్నారు.. ల్యాప్ టాప్ సిట్ అధికారులు తీసుకుని పోలేదన్నారు.. ప్రభుత్వం తరపున మద్యం అమ్మకాలు చేస్తే అవినీతికి అవకాశం ఉండదు అని తెలిపారు.. ప్రైవేటు- గా అమ్మకాలు సాగిస్తేనే అవినీతి జరుగుతుందన్నారు.. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో పాల ప్యాకెట్ల కంటే మద్యం 24 గంటలకు దొరుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. నేను ఎక్కడ తప్పుడు సంతకాలు పెట్టలేదు... నేను ఏంటో చంద్రబాబుకు తెలుసు.... నేను మంచోడినని ఆయనే చెప్పారని గుర్తుచేసుకున్నారు.. మరోవైపు, జగన్ ఎప్పుడూ పిలిచి చెప్పిన పనులు చేయాలని నాకు చెప్పలేదు... ఎప్పుడూ పిలిస్తే అప్పుడు విచారణకు వెళ్తాను అన్నారు.. ఎనిమిది కోట్లు- దొరికిందని అసత్య ప్రచారం చేశారని మాజీ డిప్యూటీ- సీఎం నారాయణస్వామి మండిపడ్డారు..

# విశాఖలో ఆహా ఏమి రుచులు

**దాడుల్లో పాచిపోయిన ఫుడ్ పట్టివేత**

**విశాఖపట్నం, ఆగస్టు 23 (నినాదం):** విశాఖపట్నంలో రెస్టారెంట్లు, హోటళ్ల తీరు ఇప్పటికీ మారడం లేదు. అదే పాచిపోయిన ఆహారం, అదే నిల్వ ఉంచిన నాన్ వెజ్ వంటకాలను మళ్లీ మళ్లీ వేడి చేసి కస్టమర్లకు సరఫర చేస్తున్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ రెస్టారెంట్లపై అధికారులు కొద్ది రోజుల క్రితం కొరడా ఝులిపించినా, వారి పద్ధతిలో ఎలాంటి మార్పు రాలేదు. గత నాలుగైదు రోజుల క్రితం వండిన చికెన్, మటన్, ఫిష్, రొయ్యలు లాంటి వంటకాలను తిరిగి వేడి చేసి ప్లేట్లలో పెట్టడం రోజువారీ పద్ధతిగా మారిపోయింది. తాజాగా విశాఖలోని ఎంవీపీలో ఉన్న 'ఆహా ఏమీ రుచులు' రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో 85 కిలోల పాచిపోయిన ఫుడ్ దొరికింది. పాచిపోయిన ఫుడ్ ను అధికారులు స్వాధీనం చేసుకుని శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. కిచెన్ తనిఖీ చేసి పాచిన ఆహారపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత రెస్టారెంట్‌పై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అయితే, తమ కష్టార్జిత డబ్బును ఖర్చు పెట్టి తింటున్నా, నాణ్యమైన ఆహారం లభించడటం లేదని కస్టమర్లు రెస్టారెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాచిపోయిన ఆహారం ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెస్టారెంట్ల నిర్లక్ష్యంతో ప్రజల ఆరోగ్యాలు ప్రమాదంలో పడకుండా.. అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.




**చెన్నూరు ఎస్‌బిఐ వ్యవహారంలో**

# విస్తుపోయే నిజాలు

**రూ.12.61 కోట్ల బంగారం, రూ.1.10 కోట్ల నగదు అపహరణ**
**పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంక్ అధికారులు**

**చెన్నూరు ఆగస్టు 23 (నినాదం):** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్‌బీఐ-2 బ్రాంచిలో బంగారం, నగదు భారీగా అపహరణకు గురైనట్లు- అధికారులు గుర్తించారు. బ్యాంకు అధికారుల ఆడిట్ నేపథ్యంలో ఈనెల 21న ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత 3 రోజులుగా బ్యాంకు, పోలీసు అధికారులు విచారణ జరిపారు. రూ.12.61 కోట్ల విలువైన బంగారం, రూ.1.10 కోట్ల నగదు అపహరణకు గురైనట్లు- తేలడంతో శనివారం బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన నరిగె రవీందర్ ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్నారు. అతడితో పాటు- మరో తొమ్మిది మంది అనుమానితులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. నరిగె రవీందర్, కొంగంది బీరేశ్, నరిగె సరిత, నరిగె స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కొదటి రాజశేఖర్, గౌడ సుమన్, ఎసంపల్లి సాయికిరణ్, ఎల్.సందీప్, మోత్కూరి రమ్యలపై కేసు నమోదు చేసినట్లు- సీఐ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టు-కుని బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ రితీశ్‌కుమార్ గుప్తా స్థానిక బ్యాంకులో విలేకరులతో మాట్లాడుతూ.. జరిగిన ఘటనపై తాము పూర్తి స్థాయిలో విచారణ జరిపి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు- చెప్పారు. బ్యాంకు ద్వారా వినియోగదారులకు ఎలాంటి ఆర్థిక నష్టం వాటిల్లదని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# ఆదాయానికి మించి ఆస్తులు

**కార్మికశాఖ జెసి బాలునాయక్ అరెస్ట్**

తిరుపతి,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే కేసులో కర్నూలు కార్మిక శాఖ జాయింట్ కమిషనరు బాలు నాయక్ అరెస్ట్ అయ్యారు. తిరుపతి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి బాలు నాయక్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్ నిమిత్తం ఆయన్ను నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించారు. రెండవ రోజు ఏసీబీ అధికారులు రాఘవేంద్రనగర్లోని బాలు నాయక్ ఇంటితోపాటు-, కర్నూలులోని కార్యాలయం, అద్దె ఇల్లు, కుటుంబీకులు, బంధువుల ఇళ్లు, అన్నమయ్య జిల్లాలోని పౌల్ట్రీ ఫారంతో పాటు- 11 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేశారు. ఏసీబీ ఎఎస్పి విమలకుమారి నేతృత్వంలో ఈ సోదాలు జరిపారు. బాలునాయక్ కుమారుడు నిర్వహిస్తున్న ఆర్సీ సర్జికల్ షాపులోనూ తనిఖీలు చేశారు. ఇంట్లో పలు కీలక రికార్డులు, అర కేజీ బంగారు నగలు, కిలో వెండి వస్తువులు, 3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆయన స్వగ్రామమైన రాయచోటి సమీపంలోని బిడికి తాండా, రాయచోటి, మదనపల్లె, చుట్టు- పక్కల ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు-, పౌల్ట్రీ ఫారాలు, భూములకు సంబంధించి డాక్యుమెంట్ల ద్వారా 10 ఎకరాల భూమి గుర్తించారు. సంబేపల్లిలో ఆయన కుమారుల పేరుతో పౌల్ట్రీఫ్రారం ఉన్నట్లు- గుర్తించారు. వివిధ బ్యాంకులలో 18 ఖాతాలు, 25 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు- కూడా ఏసీబీ గుర్తించింది. దీంతోపాటు-, మూడు టూవీలర్లు, రెండు కార్లు ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల మేరకు బాలు నాయక్ ఆస్తులు మూడు కోట్లు-గా ఉండగా, మార్కెట్ విలువ సుమారుగా 20 కోట్లు- పైనే ఉంటుందని అంచనా. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు- తేలడంతో బాలునాయక్ ను తిరుపతి ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచన**

**గుంటూరు, ఆగస్టు 23 (నినాదం):** కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునే విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పీఎం జేవీకే, పీఎం సూర్యఘర్ పథకాల అమలు, క్షేత్రస్థాయి సమస్యలపై గుంటూరు కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. మైనారిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే పీఎంజేవీకే పథకంలో జగన్ తప్పుడు బిల్లులు పెట్టి మోసం చేశారని ఆరోపించారు. కేంద్రం నిర్వహించిన ఆడిట్‌లో ఈ విషయం వెల్లడైందన్నారు. ఆ తప్పులు సరిదిద్ది గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మైనారిటీ- రెసిడెన్షియల్ స్కూల్, జీజీహెచ్ విస్తరణ పనులు, ఆటోనగర్‌లో కార్మికుల కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, అంజుమన్ ల్యాండ్‌లో మల్టీ పర్పస్ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు- చేయనున్నట్టు- తెలిపారు. సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తులు వచ్చినా.. సౌర ఫలకాల ఏర్పాటు విషయంలో ఆలస్యం జరుగుతోందన్నారు. బ్యాంకు రుణాలు, పథకానికి సంబంధించిన పోర్టల్‌లో ఉన్న ఇబ్బందులు, అధికారులు- లబ్ధిదారుల మధ్య సమన్వయ లోపాలను సరిదిద్దుతామన్నారు.

# నేను ఏ తప్పూ చేయలేదు : నారాయణ స్వామి

**తిరుపతి, ఆగస్టు 23 (నినాదం):** మద్యం స్కామ్‌పై వైసీపీ మాజీ మంత్రి నారాయణ స్వామి కీలక కామెంట్స్ చేశారు. మద్యం స్కామ్‌లో తాను ఏ తప్పు చేయలేదన్నారు. తప్పుడు కేసులు పెడితే వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నకు ఉన్నది ఉన్నట్లు సమాధానం చెప్పానన్నారు. తన వద్ద నుంచి ఎలాంటి ల్యాప్ ట్యాప్ గానీ, డబ్బులు, రికార్డ్స్ గాని వాళ్ళు తీసుకెళ్ళ లేదని తెలిపారు. తనకు వాట్సాప్ వాడటమే రాదన్నారు. ప్రభుత్వమే మద్యం విక్రయిస్తే కమిషన్లు ఎలా వస్తాయని నారాయణ స్వామి ప్రశ్నించారు. జగన్ ఏ రోజూ తనకు ఇది చెయ్యి.. అది చెయ్యి అని చెప్పలేదన్నారు. అధికారులు స్టడీ చేసి వచ్చాక.. మంత్రివర్గంలో మద్యం పాలసీపై కలెక్టివ్‌గా నిర్ణయం తీసుకున్నామని నారాయణ స్వామి తెలిపారు. సిట్ మళ్లీ పిలిస్తే వెళ్తానని అన్నారు. కట్టలు కట్టలుగా డబ్బులు తాను ఎప్పుడూ చూడలేదన్నారు. తన ఇంట్లో నోట్ల కట్టలు బయటపడలేదన్నారు. మీడియాలో కథనాలు వచ్చినట్లు ఆ ఎనిమిది కోట్ల రూపాయలు తనకు ఇచ్చి.. తనను జైలుకు పంపినా పర్వాలేదన్నారు నారాయణ స్వామి. ఆ డబ్బును తన బిడ్డలకు ఇచ్చేస్తానని అన్నారు. చంద్రబాబుపై తనకేమీ శత్రుత్వం లేదన్న నారాయణ స్వామి.. పాలసీపైనే మాట్లాడుతున్నానని అన్నారు. తాను ఎలాంటి వాడినో చంద్రబాబు కూడా తెలుసునని చెప్పారు
ఇదే సమయంలో నారాయణ స్వామి కుమార్తె కృపా లక్ష్మీ మాట్లాడుతూ.. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పామని.. నాకు తెలీదు, లేదు అని తన నాన్న చెప్పలేదన్నారు. తన తండ్రికి ల్యాప్ ట్యాప్ లేదని.. లేని ల్యాప్ ట్యాప్‌ని సీజ్ చేశారని ఎలా వార్త రాస్తారంటూ మీడియాను ఆమె ప్రశ్నించారు. పార్టీ ఇన్‌చార్జ్‌గా తాను ఉన్నానని.. జగన్ ఆశీస్సులతో ఇన్‌చార్జ్‌గా ఉంటానని ఆమె పేర్కొన్నారు. అయితే, వైసీపీ పాలనలో బ్రాండెడ్ మద్యం లభ్యం కాని అంశంపై నారాయణ స్వామి సమాధానం దాటవేశారు. పేపర్ పైన రాసుకు వచ్చిన వాటిని చెప్పేసిన తరువాత.. చెప్పదలచుకున్నది చెప్పేశాము.. మీరు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పమంటూ మీడియాతో నారాయణస్వామి కుమార్తె వాగ్వాదానికి దిగారు. నారాయణ స్వామి నివారించినా ఆయన కుమార్తె ఆగలేదు. ఇదే క్రమంలో నువ్వు ఏం రాసుకుంటావో రాసుకో అని ఓ పాత్రికేయుడితో నారాయణ స్వామి అన్నారు. కసిరెడ్డి ఎవరో తన ముగ్గురు బిడ్డల సాక్షిగా తనకు తెలియదన్నారు నారాయణ స్వామి. అయితే, ఇదే సమయంలో ఆయనపై వ్యతిరేకంగా వార్తలు రాసిన మీడియా పేర్లు చెప్పేయాలని నారాయణ స్వామిని సాక్షి టీవీ విలేకరి ఒత్తిడి చేశారు.

**సూపర్ సిక్స్‌ను ఎగతాళి చేశారు..**

# సాధ్యం చేసి చూపించాం

**: ఏపీ సీఎం**



**అమరావతి,ఆగస్టు 23 (నినాదం):** కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారని, అయితే తాము వాటిని అమలు చేసి చూపించామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. చంద్రబాబు తాజాగా పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించారు. సీఎంకు స్థానిక నాయుకులు, ప్రజలు అఖండ స్వాగతం పలి కారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మోహంలో ఆనందం చూడాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. 'గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ చెత్త ఎత్తే కార్యక్రమం చెయ్యలేదు. కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇంట్లో చెత్త బయట పడేయటం వలన అంటూ వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ రెండో తేదీలోపు 85టన్నుల చెత్తను సేకరిస్తాం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టి స్తోంది. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి మోహంలో ఆనందం చూడాలి' అని చంద్రబాబు అన్నారు. 'ఉమ్మడి జిల్లా వాసులు చాలా సౌమ్యులు. ఇలాంటి చోట కూడా గతంలో రౌడీయిజం చేశారు. మేం పెద్దాపురంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంటును ప్రారంభించబోతున్నాం. వర్షాకాలంలో దోమల వల్ల రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. డ్రోన్స్ ఉపయోగించి రాష్ట్రంలో దోమల సమూల నివారణకు చర్యలు తీసుకుంటాం. సూపర్ సిక్స్‌ను ఎగతాళి చేశారు. సాధ్యం కాదు అన్నారు. సాధ్యం చేసి చూపించా. 2027లో పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమృత్ పథకంలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో 75 కోట్ల రూపాయలతో ఇంటింటికి మంచినీటి కుళాయి వేయిస్తాం. ఎన్డీఏకు పెద్దాపురం నియోజకవర్గం కంచుకోట. ఇక్కడ మరొకరికి అవకాశం ఇవ్వకూడద'ని చంద్రబాబు పేర్కొన్నారు.

# దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు..

# ఎక్కడినుంచి ఎక్కడివరకంటే

**గుంతకల్లు(అనంతపురం) ఆగస్టు 23 (నినాదం):** ప్రయాణికుల రద్దీ, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక వీక్లీ రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-తిరుపతి (07011) ప్రత్యేక వీక్లీ రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07012) సెప్టెంబరు 6 నుంచి 27 వరకూ శనివారాలలో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట, స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. తిరుపతి-హిసర్ ప్రత్యేక రైలు (07717) అక్టోబరు 1 నుంచి నవంబరు 26 వరకూ బుధవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07718)ను ఈ నెల అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకూ ఆదివారాలలో నడుపుతామన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల, కాచిగూడ(%ఖుఎప్ట్రఅస్త్రబఖు%), మల్కాజ్‌గిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, బస్మట్, హింగోళి, వాసిం, అకోలా, షేగావ్, మల్కాపూర్, భుస్వాల్, జల్‌గావ్, ధరన్‌గావ్, అమల్నేర్, నందుర్బార్, ఉడ్నా, వడోదర, రత్లం, మాండ్‌సౌర్, నీమచ్, చిత్తౌర్‌ఘర్, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిర్‌బాద్, అజ్మీర్, క్రిష్ణాఘర్, పులేరా, రింగస్, సికర్, నవాల్‌ఘర్, ఝుంజును, చిరావా, లోహారు, సదుల్‌పూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.



నాందేడ్-ధర్మవరం (07189) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07190) సెప్టెంబరు 7 నుంచి 28 వరకూ ఆదివారాలలో నడుస్తుందన్నారు. ఈ రైలు ముధే?డ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, లింగంపేట, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్లు, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట(%=వఅఅస్త్రబత్ఖు%), తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుతుందన్నారు. బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు (06549) ఈనెల 26న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06550) ఈ నెల 27న, బెంగళూరు-బీదర్ (06530) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 28 వరకూ శుక్ర, ఆదివారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (06540) సెప్టెంబరు 6 నుంచి 29 వరకూ శని, సోమవారాలలో నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహాబాద్, కలబురగి, హుమ్నాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తాయన్నారు. యశ్వంతపూర్-ధన్‌బాద్ (06563) ప్రత్యేక రైలు ఈ నెల 23 నుంచి డిసెంబరు 27 వరకూ శనివారం, దీని తిరుగు ప్రయాణపు రైలు (06564) ఈ నెల 25 నుంచి డిసెంబరు 29 వరకూ నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట్, రామగుండం, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, నరసింగ్‌పూర్, మదన్‌మహల్, కట్నీ, సాట్నా, ప్రయాగరాజ్, మీర్జాపూర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బబువా రోడ్, ససరం, అనుగ్రహ నారాయణ్, గయ, కోడేర్మ, హజారీబాగ్, పరశ్‌నాథ్, గోమహ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

# కావలి ఎమ్మెల్యే కావ్యా హత్య కుట్రలో ట్విస్ట్..

**ఏ5గా వైసీపీ మాజీ ఎమ్మెల్యే..**

**నెల్లూరు, ఆగస్టు 23 (నినాదం):** కావలి ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి హత్యకి కుట్ర, హత్యాయత్నం కేసులో 5 నిందితుడిగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డిని చేర్చారు పోలీసులు. గత నాలుగు రోజులుగా పోలీసుల కన్నుగప్పి తప్పించుకు తిరుగుతున్న రామిరెడ్డి, మరో ఇద్దరు రౌడీషీటర్ల కోసం మూడు పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. బెంగుళూరులో రామిరెడ్డి, అతడి అనుచరులు పోలీసుల నుంచి తృటిలో తప్పించుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచి వారంతా మైసూరుకు మకాం మార్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. రామిరెడ్డి దేశం విడిచి వెళ్లకుండా శనివారం లుక్ అవుట్ నోటీసులు ఇచ్చే అవకాశముంది. కాగా, రామిరెడ్డిపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల లిక్కర్ స్కాంలోనూ రామిరెడ్డి నిందితుడిగా ఉన్నాడు. కొన్ని రోజుల క్రితం జలదంకి మండలం అన్నవరంలోని తన క్రషర్ వద్ద ఉన్న కావలి ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డిపై వైసీపీ మూకలు దాడికి యత్నించాయి. డ్రోన్‌తో వీజువల్స్ తీస్తుండగా ప్రశ్నించిన సిబ్బందిపై మారణాయుధాలతో దాడి చేయడంతో క్రషర్ సిబ్బంది పోలీసులకు పట్టించారు. పట్టుబడిన నిందితులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఆదేశాలతో వచ్చామని అంగీకరించినట్లు సమాచారం. పలువురు వైసీపీ నేతల నుంచి కూడా నిందితుల ఫోన్లకు కాల్స్ వచ్చాయని పోలీసులు చెప్తున్నారు. ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను చంద్రబాబును కలవడానికి విజయవాడ వెళ్లడంతో దాడి నుంచి తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయని, జగన్ ఆదేశాలతోనే రామిరెడ్డి ఈ దాడికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అయిన తనను లక్ష్యంగా చేసుకుని దాడి చేయాలన్న కుట్రను సీఎం చంద్రబాబుకు వివరించానని అన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, మరో ఇద్దరు రౌడీషీటర్లను పట్టుకునేందుకు పోలీసు బృందాలు ముమ్మరంగా వెతుకులాట కొనసాగిస్తున్నాయి.

## నిస్వార్థ రాజకీయ నేత సురవరం !

రాజకీయాల్లో స్వార్థపరులే తప్ప నిస్వార్థపరులు ఉండరు... అన్న కాలంలో నేనున్నానని చెప్పుకునే ఉదాత్త లక్షణాలు కలిగిన నేత సురవరం సుధాకర్ రెడ్డి. ఆజన్మాంతం సామాన్యుడిగా ఉంటూ..అసామాన్య రాజకీయ ప్రతిభను ప్రదర్శించిన వ్యక్తి సురవరం. ఆయన తెలుగువాడు కావడం మనమంతా గర్వించాలి. కమ్యూనిస్టు రాజకీయాల్లో ఉంటూనే దేశ రాజకీయాల్లో ప్రభావశీలమైన పాత్రపోషించారు. కమ్యూనిస్టులు ఏకం కావాలన్న ఆయన కోరిక మాత్రం తీరకుండానే పోయారు. పుట్టినవారు గిట్టక మానరు...అయితే జీవించినంత కాలం ఏం సాధించామన్నది ముఖ్యం. అదే సురవరంలో మనం చూస్తాం. ఎప్పుడూ ప్రజల గొడవతోనే ఆయన జీవితం ముడిపడి ఉండేది. తెలంగాన కమ్యూనిస్టు దిగ్గజాలలో గతేడాది సీతారాం ఏచూరిని కోల్పోయాం. ఏడాదిలోపే ఇప్పుడు సురవరంను కోల్పోయాం. జాతీయ రాజకీయాల్లో తెలుగువారు కనుమరుగు అవుతున్నారు. గట్టిగా నిలబడే నేతలు లేకుండా పోతున్నారు. ఈ క్రమంలో సురవం వృద్ధాప్య కారణాలతో మనలను వీడిపోయారు. ఆయన రాజకీయాల్లో అజాతశత్రువు... అంతకు మించి నిస్వార్థ రాజకీయ నేత. పీడిత,తాడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ ముద్దుబిడ్డ... చెప్పాలంటే అరుదైన మట్టిమనిషి. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్ రెడ్డి తనవంతుగా దేశానికి ఋషిలా పనిచేశారు. సమస్యలు ఎక్కడున్నా వాటికోసం పోరాడేందుకు ఎప్పుడూ ముందుండే వారు. సమస్యలపై ఎంత గట్టిగా పోరాడేవారో ఆయన అంతకుమంచి సౌమ్యుడు. ఆయన సౌమ్యత్వానికి, పోరాటానికి పొంతన ఉండేది కాదు. కానీ జన్మతః వచ్చిన మృదు స్వభావం కారణంగా ఆయన అజాత శత్రువు అయ్యారేమో అనిపిస్తుంది. ఎందుకంటే సురవరం అంటే నచ్చని నేత ఉండేవాడు కాదు. ఆయన మాట్లాడినంత సేపు ఇంకా మాట్లాడాలనిపిస్తుందని అనేవారు. సాదాసీదాగా ఉంటూ జాతీయరాజకీయాల్లో చెలామణి కావడం కష్టం. కానీ అది సాధ్యమని రుజువు చేసిన దిగ్గజనేత సురవం. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. అందుకేనేమో అటు తండ్రి, ఇటు పెదనాన్న వారసత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టిన తీరు అమోఘం. చిరు ప్రాయంలోనే ఆయన మెదడులో నాటుకున్న పోరాటస్ఫూర్తికి అది నిదర్శనంగా చూడాలి. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయా లకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించడం యనకు అక్కడితోనే అబ్బింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా సురవరం ఎదిగారు. దివంగత జైపాల్ రెడ్డితో పాటు ఆయన కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో రాటుదేలారు. ఎన్నో వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారు. రెండుసార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడని చెప్పక తప్పదు. ఆచన చేసిన పోరాటలు,ప్రజా ఉద్యమాల పట్ల ఉన్న నిబద్ధత కారణంగా ప్రజానేతగా సురవరం గొప్ప పేరు సంపాదించుకున్నారు. పీడిత వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలం కృషి చేశారు. తెలంగాణ మట్టి బిడ్డగా, మార్క్సిస్టు ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది విడదీయరాని అనుబంధం. ఏఐఎస్ఎఫ్ నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది. 2012 నుంచి 2019వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగారు. మూడు దఫాలుగా ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో సురవరం సుధాకర్ రెడ్డి ముఖ్యపాత్ర పోషించారు. చంద్రరాజేశ్వరరావు తరువాత జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 1960లో ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం కోసం ఏర్పాటు చేసిన సమ్మెకు కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ కమిటీ- 62రోజుల పాటు- చేసిన సమ్మెకు నాయకత్వం వహించారు. అనంతరం కర్నూలులోని కళాశాల విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ చదువుతున్న సమయంలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను సురవరానికి అప్పగించారు. 1966లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు. దీంతో ఆయన ఢిల్లీకి మకాం మార్చారు. 1969లో రెండోసారి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. 1970లో ఏఐఎస్ఎఫ్, 1972లో ఏఐవైఎఫ్‌నకు జాతీయ అధ్యక్షుడయ్యారు. 1971లో కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన సీపీఐ 9వ నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో జాతీయ కమిటీ- సభ్యుడయ్యారు. 1974లో తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన సురవరం ఆనాటి నుంచి 1984 వరకు సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 1985, 90లో కొల్లాపూర్ అసెంబ్లీ నుంచి సురవరం సుధాకర్ రెడ్డి పోటీ- చేసి ఓటమి చవిచూశారు. 1994లో కర్నూలులోని డోన్‌లో ముఖ్యమంత్రి విజయభాస్కర్‌రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. 1998లో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలా ఒక్కో మెట్టు ఎక్కినా, ఒదిగే ఉన్నారు. ఇంతటి ఉన్నత లక్షణాలు, ఉదాత్త ఆశయాలు కలిగిన సురవరం మనవాడు కావడం మన అదృష్టం.

ఎడిటోరియల్

### హద్దులు చెరిపేస్తున్న
## అంతర్జాలం

ప్రపంచం కాలంతో పాటు ఎన్నో మార్పులకు గురవుతుంది. ప్రపంచంలో జరిగే మార్పులకు అనుగుణంగా మనుషులు కూడా ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా మనుషులు మార్పును స్వాగతిస్తుంటారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒకరిపై విపరీతమైన ప్రభావం కలిగిన సంచలమైన మార్పు అంతర్జాలం ఇంటర్నెట్ అని పిలవబడే అంతర్జాలం ఆధునికహంగులతో ప్రపంచాన్ని మరో కొత్త లోకానికి పరుగులు పెట్టేలా చేస్తుందా అనే ఆలోచన రాక తప్పదు. నేటి సమాజంలో చదువుకున్న, చదువు లేని ప్రతి ఒక్కరికి ఇంటర్నెట్ అనేది నిత్యవసరంగా మారింది. సమాజంలో జరిగే ప్రభుత్వ ,ప్రైవేటు అనే రంగాలతో సంబంధం లేకుండా ఎక్కువ శాతం పని సాంకేతికతను సంతరించుకుంది ఈ తరుణంలో ప్రతి ఒక్కరికి సాంకేతికత నైపుణ్యం అవసరమే అంతర్జాల వినియోగం కూడా అత్యవసరమే. కానీ ఇంటర్నెట్ వినియోగం శృతిమించి విలువలను పాతరేసే దిశగా విలయతాండవం చేస్తుందని చెప్పవచ్చు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు మొదలుకొని పనికి వెళ్లే కూలీల వరకు అంతర్జాలం అందుబాటులోకి వచ్చింది.అది ఆధునాతమైన ప్రోగ్రామింగ్ లతో, ఫీచర్లతో కూడిన అతివేగవంతమైన ఇంటర్నెట్ సౌలభ్యం కలిగిన మొబైల్స్ అందుబాటులోకి రావడమే దీనికి కారణం. అంతర్జాలానికి అనుసంధానమైన వాట్సాప్ ,ఫేస్బుక్ ట్విట్టర్, షేర్ చాట్ ,ఇన్స్టా గ్రామ్,ఇలా చెప్పుకుంటూ పోతే సోషల్ మీడియా అనబడే వేదికలు చాలా ఉన్నాయి. నేటి సమాజంలో చాలామంది తమ వ్యక్తిగత జీవితంలో జరిగే విందులను, వినోదాలను విషాదాలను, వివాదాలను ,బాధలను ఇలా ప్రతిదీ సోషల్ మీడియాలో బహిరంగంగా పెట్టడం సర్వసాధారణంగా మారింది.తమ జీవితంలో చేసిన పనులను, చేయబోతున్న పనులను సైతం బాహటంగానే వివిధ రకాల సోషల్ మీడియాలో తెలియజేస్తున్నారు. మానవత విలువలకు తిలోదకాలు ఇచ్చి అనుబంధాలను, బంధాలను వ్యక్తిగత స్వేచ్ఛకు అలవాటు పడి మంచి చెడు అనే తారతమ్యం లేకుండా అనేక విషయాలను నిర్మొహమాటంగా పోస్టుల రూపంలో ఫోటోలు, వీడియోల రూపంలో బహిర్గతం చేస్తున్నారు. మానవ జీవితంలో కొన్ని తెలియజేసే విషయాలతో పాటు తెలియజేయకూడని మనోభావాలకు సంబంధించిన అంశాలు ఉంటాయని ఇంగిత జ్ఞానాన్ని మరిచి సోషల్ మీడియా ప్రచారానికి తెరలేపడం అనేది అసంబద్ధమైన చర్యగా భావించ వచ్చు.ఇలా విపరీతమైన పోకడలతో చేసే పనుల వల్ల కుటుంబంలో ఉన్న వ్యక్తుల మధ్యపలు రకాల వ్యవస్థల మధ్య విభేదాలు మొదలై ఆత్మీయ స్నేహ బంధాలు దెబ్బతింటున్నాయి. బహిరంగ స్వేచ్ఛను నమ్ముకొని వ్యక్తిగత విషయాలను సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల ఇదే అదనుగా భావించిన సైబర్ మోసగాళ్లు ఉన్మాదులు అతివల జీవితాలతో ఆడుకునే కామాంధులు తీవ్రమైన ఆర్థిక నేరాలకు దారుణాలకు పాల్పడుతున్నారు. చదువుతోపాటు నేడు సాంకేతికత అవసరమే కానీ దానిని అనవసరమైన విషయాలను వినియోగించి లేనిపోని ఇబ్బందులు కొని తెచ్చుకొని జీవితాలను ప్రమాదపుటంచులకు చేరేలా ప్రవర్తిస్తున్నారు అనడంలో సందేహం లేదు.అసందర్భమైన అనవసరమైన విషయాలను ఫార్వర్డ్ మెసేజ్ ల రూపంలో ఒక సెకనులో కొన్ని లక్షల మందికి చేరవేయడం నేటి కాలంలో ఒక ఆనవాయితీగా మారింది.మరీ కొందరైతే బాధ్యతమైన స్థానాన్ని మరిచి కుటుంబాన్ని పిల్లలను పక్కనపెట్టి వీడియోల రూపంలో, రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ గుర్తుతెలియని వ్యక్తుల మెప్పు కొరకు ఆరాటపడటం హాస్యాన్ని, ఆశ్చర్యాన్ని కలిగేలా చేస్తుంది. పలు రకాల సోషల్ మీడియాలకు బానిసలై ఉన్నతమైన జీవితాలలో సుఖమంతమైన కుటుంబాలలో అనవసరమైన గొడవలతో అనుమానాలతో ఆత్మహత్యలకు హత్యలకు పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి .పాలకులు సాంకేతిక సంబంధిత శాఖలు అనుచితమైన పోస్టు ,కామెంట్లు వీడియోలు పెట్టిన వారిపై చర్యలు తీసుకునేలా కొన్ని చట్టాలు తీసుకురావాలి. వివిధ రకాల సోషల్ మీడియా సంస్థలు కూడా కేవలం సాంకేతికతకే ప్రాధాన్యత ఇవ్వకుండా వ్యక్తిగత విలువలకు మనోభావాలకు కుటుంబాల ఔన్నత్యానికి సంబంధించిన విషయాల పై దృష్టి సారించాలి.సమాజం పురోగతి ,యువత సమగ్ర అభివృద్ధికై కొన్ని కఠినమైన ఆంక్షల నడుమ సోషల్ మీడియా వేదికల అస్తిత్వం కొనసాగేలా కార్యక్రమాలు జరిగేలా చూడడం మంచిది.



**వంశీకృష్ణ గౌడ్ బండి**
రంగయ్యపల్లి, రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962

# ధర్మస్థల వ్యవహారం అంతా ఉత్తిదే

**అబద్దాలతో బురిడీ కొట్టించిన ముసుగు వ్యక్తి**
**తవ్వకాలతో పోలీసులను పరుగెత్తించిన భీమా**
**అబద్ధమనిచెప్పడంతో అరెస్ట్ చేసిన సిట్**

**బెంగళూరు,ఆగస్ట్23(నినాదం):** ధర్మస్థల వ్యవహారం అంతా తూచ్ .. అన్నట్లుగా తయరయ్యింది. కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థల సామూహిక మృతదేహాలు ఖననం కేసు కీలక మలుపు తిరిగింది. వందలాది మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేశానని ఫిర్యాదు చేసిన మాస్క్ మ్యాన్ భీమా అసలు రంగు బయటపడింది. పారిశుద్ధ్య కార్మికుడు ఇన్నాళ్లూ చేసిన ఆరోపణలు బూటకమేనని సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించిన మాస్క్ మ్యాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ధర్మస్థల ఆలయ పరిసరాల్లో సుమారు 100కు పైగా మృతదేహాలను ఖననం చేశానంటూ భీమా 15 రోజులుగా ఆడుతున్న నాటకానికి సిట్ బృందం తెరదించింది. మాయమాటలతో వ్యవస్థను నమ్మించి విచారణలో పదేపదే తన వాదనలు మార్చిన భీమా చివరకి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడు. దీంతో ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందం పారిశుద్ధ్య కార్మికుడు భీమాను అదుపులోకి తీసుకుంది. ఇంత డ్రామా ఆడటానికి కారణాలేంటని రాబట్టేందుకు సిట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. విచారణ అనంతరం భీమాను కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన బెంగళూరుకు చెందిన సుజాత భట్‌పైనా విచారణ కొనసాగుతోంది. ఆమె, తన కుమార్తె అనన్య భట్ 2003లో ధర్మస్థలలో అదృశ్యమైందని ఫిర్యాదు చేసింది. కానీ, తాజాగా ఆమె ఆ ఆరోపణలను తిరస్కరించింది. దీంతో సుజాతను కూడా పోలీసులు




అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ధర్మస్థల శైవ క్షేత్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసిన భీమా అనే వ్యక్తి కొన్నాళ్ల క్రితం సంచలన ఆరోపణలు చేశాడు. 1995 నుండి 2014 మధ్య లైంగిక వేధింపులకు గురై హత్య చేయబడ్డ 100కు పైగా మహిళలు, పిల్లల మృతదేహాలను తాను పూడ్చిపెట్టానని.. 2014లో తమ కుటుంబంలోని ఓ యువతిని లైంగికంగా వేధించి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశ వ్యాప్తంగా కలకలం చెలరేగింది. పశ్చాతాపం వెంటాడుతుండటంతోనే ఈ ఫిర్యాదు చేసినట్లు- భీమా వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందాన్ని రంగంలోకి దింపింది. భీమా చెప్పిన ప్రకారం పలు చోట్ల సిట్ అధికారులు తవ్వకాలు జరిపారు. కేవలం రెండు ప్రదేశాల్లోనే కొన్ని ఎముకలు కనిపించాయి. స్పష్టమైన ఆధారాలు లభించకపోవడంతో సిట్ అధికారులకు ఫిర్యాదుదారుడైన భీమా ఆరోపణలపై అనుమానం రేకెత్తింది. దీంతో లోతుగా దర్యాప్తు నిర్వహించగా ఆశ్చర్యకరమైన నిజాలు వెల్లడయ్యాయి. విచారణలో భీమా కూడా మాట మార్చాడు. వేరెవరో ఒక పుర్రె ఇచ్చి పోలీసులకు ఇమ్మన్నారని.. కోర్టులో పిటిషన్ కూడా వారే వేయించారని.. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉన్నానని అతడు పేర్కొనడంతో సిట్ అధికారులకు దిమ్మతిరిగి పోయింది. దీంతో ఇదంతా డ్రామాగా గుర్తించి భీమాను అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు- పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేయడంతో దేశమంతా ఉలిక్కిపడింది. ఇకపోతే ధర్మస్థల పుణ్యక్షేత్రంపై అనవసర ఆరోఫలు చేయడం తగదని బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి, అదీ ఎవరోడబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తుల మాటల ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు- చేయడం సిగ్గుచేటని సీఎంపై నిప్పులు చెరిగారు. హిందుత్వాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కావాలనే ధర్మస్థలపై నిందలు వేశారని అన్నారు.

# ప్రధాని మోడీపై తేజస్వీ అభ్యంతరకర పోస్ట్

### మహారాష్ట్ర, యూపిల్లో కేసులు నమోదు





**న్యూఢిల్లీ,ఆగస్ట్ 23(నినాదం):** బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌పై మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లాలో కేసు నమోదైంది. ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ స్థానిక ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. గడ్చిరోలీ ఎమ్మెల్యే మిలింద్ నరోటే ఫిర్యాదు చేసినట్లు- సీనియర్ పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రధాని బిహార్ పర్యటన నేపథ్యంలో తేజస్వి యాదవ్ అభ్యంతరకర పోస్టు పెట్టారని నరోటే ఫిర్యాదు చేసినట్లు- తెలిపారు. ఎమ్మెల్యే నరోటే ఫిర్యాదు మేరకు పోలీసులు తేజస్వి యాదవ్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల మేరకు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం, పరువుకు భంగం కలిగించడం, శాంతికి విఘాతం కలిగించే ఉద్దేశంతో అవమానించడం కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే యూపీలో కూడా తేజస్విపై కేసు నమోదైంది. షాజహాన్‌పూర్ బీజేపీ మెట్రోపాలిటన్ అధ్యక్షురాలు శిల్పి గుప్తా ఫిర్యాదు మేరకు ఆయనపై బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో తేజస్వి అభ్యంతరకర పోస్టు పెట్టారని శిల్పి గుప్తా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక బిహార్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనపై మండిపడ్డారు. వారి పాలనను చీకటి యుగంగా అభివర్ణించారు. విద్య, ఉపాధి లేక ఎన్నో తరాలు ఉన్న ఊరిని వదులుకొని పొరుగు ప్రాంతాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిహార్‌ను ఆర్జేడీ కేవలం తన ఓటు- బ్యాంకుగా మార్చుకుందని మండిపడ్డారు యావత్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని ప్రధాని అన్నారు. ప్రధాని ఆరోపణలపై తేజస్వి ప్రతి విమర్శలు చేశారు. గయాలో ప్రధాని అసత్యాలు పలికారని అన్నారు. ప్రజలు మాత్రం వీటిని నమ్మరని తేల్చి చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలన వివరాలను కూడా చెప్పాలని సవాలు విసిరారు.

### మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
## ఎలక్ట్రిక్ వాహనాలకు
## టోల్ మినహాయింపు



ముంబై,ఆగస్ట్23 (నినాదం): మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్‌ప్లాజాలలో టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాలుష్యం తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతన్న కాలుష్యం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వం కాలుష్యం తగ్గించే దిశగా చర్యలు మొదలుపెట్టింది. ఈ మేరకు ఎలాక్ట్రిక్ వాహనాలకు టోల్ మినాహాయింపు ప్రకటించింది. ఎలాక్ట్రిక్ కార్లు, బైకులకు టోల్ ఫ్రీ చేస్తూ..నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎలాక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడానికి మొగ్గుచూపుతారని ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. దీనితో పాటు- రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ఎలాక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఏర్పాడుతాయని భావిస్తుంది. గతంలో ఢిల్లీలో వాహన కాలుష్యంతో ఏర్పడిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోనూ వాహన కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం టోల్ ట్యాక్స్‌లను రద్దు చేస్తున్నట్లు- ప్రకటించింది.

## అమెరికాలో ఘోరరోడ్డు ప్రమాదం

### ఐదుగురు యాత్రికుల దుర్మరణం

**న్యూయార్క్:** అమెరికాలోని న్యూయార్క్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెంబ్రోక్ శివారులో యాత్రికుల బస్సు బోల్తాపడడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. పలువురు గాయపడడంతో హెలికాప్టర్లలో వారిని ఆస్పత్రికి తరలించారు. 50మంది బస్సులో నయాగారా నుంచి న్యూయార్క్‌కు వెళ్తుండగా అదుపు తప్పిబోల్తాపడింది. ప్రయాణికులు సీటు బెల్ట్ ధరించకపోవడంతో త్వరగా బయటకు తీసి ఆస్పత్రికి తరలిం చారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భారత్, చైనా, ఫిలిప్పీన్స్‌కు చెందిన యాత్రికులు నయాగారా జలపాతం అందాలను వీక్షించి వస్తుండగా ఈ ప్రమాదం చోటు-చేసుకుంది. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు. ఈ ఘటన న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

# విప్లవ అగ్ని కణం

## స్వాతంత్ర్య సమర యోధుడు రాజ్‌గురు

(24 ఆగష్టు "స్వాతంత్ర్య సమరయోధుడు రాజ్‌గురు జన్మదినం" సందర్భంగా)

24 ఆగష్టు 1908న పూనె సమీప ఖేడ్ గ్రామంలోని పార్వతీదేవి - హరినారాయణ్ రాజ్‌గురు మరాఠీ బ్రాహ్మణ దంపతులకు జన్మించిన శివరామ్ హరి రాజ్‌గురు తన తండ్రిని 6వ ఏటనే కోల్పోయారు. అన్నయ్య దినకర్ కుటుంబ పెద్దగా బాధ్యతలు చేపట్టడంతో ప్రాథమిక విద్యను ఖేడ్‌లో, ఉన్నత పాఠశాల విద్యను పూనె న్యూ ఇంగ్లీష్ హైస్కూల్‌లో పూర్తి చేశారు. చిన్నతనంలోనే బ్రిటీష్ అప్రజాస్వామిక పాలనను వ్యతిరేకిస్తూ సేవ దళ్‌లో చేరి తన నిస్వార్థ సేవా యాత్రను ప్రారంభించారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్లు కలిసి ఏర్పాటు చేసిన "హిందుస్థానీ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్"లో చురుకైన సభ్యుడిగా చేరిబ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు.

మంచి షూటర్‌గా అనుభవం కలిగి ఉండడంతో ఆయనను అందరూ 'గన్‌మెన్' అని పిలవడం జరిగింది. విప్లవాత్మక భావజాలం, రోషం కలిగిన శివరామ్ 1925లో అత్యంత ధైర్యంగా 'కకోరి కుట్ర'లో భాగంగా బ్రిటీష్ రైలును దోపిడీ చేసి తమ కార్యకలాపాలకు వినియోగించారు.
గాంధీ చేపట్టిన అహింసాత్మక పోరాటాన్ని వ్యతిరేకించి రక్తం చించి స్వాగతం సాధిద్దాం అంటూ విప్లవ మార్గం చేపట్టారు. తన స్వతంత్ర పోరాట విప్లవంలో భాగంగా చంద్రశేఖర్ ఆజాద్?, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ తాపర్‌లతో కలిసి పోరాట కత్తులు దూకడం ప్రారంభించారు. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన లాలాలజపతి రాయ్‌ని బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేయడం, దురదృష్టవశాత్తు ఆయన మరణించడం చూసి తట్టుకోలేక ఈ యువకులు నిప్పు కణికలుగా మారి నాటి బ్రిటీష్ పోలీస్



అధికారి జాన్ సాండర్స్‌ను 17 డిసెంబర్ 1928న హత్య చేసారు. ఈ హత్య కేసులో బ్రిటీష్ పోలీసులు రాజ్‌గురు, భకగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్?లను అరెస్టు చేసి మరణ శిక్ష విధించడం, 23 మార్చి 1931 ఉదయం లాహోర్ జైలులో ఉరి శిక్ష అమలు చేశారు. భరతమాత కోసం వీరు ప్రాణ త్యాగం చేయడం, స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఎర్రని అక్షరాలతో లిఖించబడింది.

వీరు అమరత్వం పొందిన రోజును భారత ప్రభుత్వం "అమరత్వ దినం" లేదా "మార్టిర్స్ డే"గా పాటించి నివాళులు అర్పించడం జరుగుతోంది.
భీమా నది ఒడ్డున తను పుట్టిన ఇంటిని 'రాజ్ వాడా'గా నామకరణం చేసి స్మారక చిహ్నంగా మార్చాడమే కాకుండా వారు పుట్టిన ఖేడ గ్రామాన్ని నేడు 'రాజ్‌గురు నగర్" పేరుతో పిలవడం జరుగుతోంది. ఢిల్లీలో 'షహీద్? రాజ్‌గురు కాలేజ్ ఆఫ్ అప్లైడ సైన్సెస్ ఫర్ వుమన్' కళాశాలకు ఆయన పేరును పెట్టడం సముచితంగా ఉన్నది. తన 22వ ఏటనే ఉరి కంభం ఎక్కి ధైర్యంగా దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడం నేచి భారత యువతకు ఆదర్శం కావాలి, వారు సాధించి పెట్టిన స్వాతంత్ర్యానికి అసలైన అర్థాన్ని చేకూర్చుదాం, దేశాభివృద్ధిలో భాగం అవుదాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# మరువకూడని 'జ్ఞాపకాల ఊరేగింపు'

**హుజూరాబాద్ కి చెందిన ఆవునూరి సమ్మయ్య గారి రచన 'జ్ఞాపకాల ఊరేగింపు' అనే వ్యాస సంపుటి ఇటీవల విడుదలైంది. హుజూరాబాద్ లో భారీగా తరలి వచ్చిన ఉద్యమ, సాహిత్యాభిమానుల మధ్య ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇది రచయిత వ్యక్తిగత జీవితచరిత్ర కాదు. ఇది హుజురాబాద్ ప్రాంతంలోని ఒక తరం మనుషుల చరిత్ర. చాలా సాధారణ మనుషులు నెలకొల్పిన అసాధారణ రాజకీయ, సాహితీ, పాత్రికేయ, మానవ విలువల చరిత్ర.**

వరవరరావు గారి ముందుమాటతో సహా పుస్తకంలోని వ్యాసాలన్నీ ప్రధానంగా డెబ్బై, ఎనభైలలో మార్పు కోసం ఆరాటపడ్డ విప్లవ, సామాజిక, సాహితీ, మేథోరంగ కార్యకర్తల జీవన రేఖలకు చెందినవి. అలాగే ఈ పుస్తకం, తమ జీవితాల్లో సామాజిక బాధ్యతకు ప్రాధాన్యతనిచ్చిన అనేకమంది ఉపాధ్యాయుల, లెక్చరర్ల, వైద్యుల, పాత్రికేయుల, ఇంకా ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాలుగా సేవలందించిన సాధారణ పౌరుల జీవన విలువల సమాహారం కూడా.

ఇందులో గూడూరు గ్రామంలో, బడి మానేసిన తనను తిరిగి బడిదారి పట్టించిన దాసి దామోదర్ అనే మానవీయ ఉపాధ్యాయుని నుండి, హుజురాబాద్, జమ్మికుంటలలో ప్రభుత్వ ఉద్యోగం చేసుకునే సాధారణ ఉపాధ్యాయులు, అధ్యాపకులు అయిన ఆకుల లింగయ్య, శివప్రసాద్ శుక్లా, చొల్లేటి శ్రీశైలం, ఎంవీ తిరుపతయ్య, ఒ నారాయణ రెడ్డి గార్లు విద్యార్థులకు ఎట్లా సామాజిక స్పృహ కల్పించిందీ రాశారు. అదే విద్యార్థులు విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించటం, వారే ఈ ప్రాంతంలో, రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో రాజకీయ ఉద్యమం విస్తరించడానికి కారణమవటం తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగక మానదు. కేవలం రాజకీయ ఉద్యమకారుల గురించే కాక, ఇతర రంగాల్లో సామాజిక సేవ చేస్తున్న వారినీ స్ఫూర్తిదాయకంగా పరిచయం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హుజురాబాద్ కేంద్రంలో తన సౌండ్ సిస్టం ద్వారా సేవలందించి, ప్రమాదంలో చనిపోయిన ఒక పేద ముస్లిం అయిన బాబాను స్మరిస్తూ రాశారు. చివరగా, రచయిత కుటుంబం తన బాల్యంలో అనుభవించిన సామాజిక జీవితం, పడ్డ కష్టాలు, సంఘర్షణలను రాశారు. ఈ భాగం కూడా ఆ కాలపు సామాజిక, ఆర్థిక దొంతరలలో క్రింది స్థాయి శ్రమజీవుల జీవితాల్ని ప్రతిబింబిస్తుంది. వారి కుటుంబానికి వ్యవసాయంలో సహాయపడిన రెండు దున్నపోతుల గురించి కూడా రాశారు. ఎంతో ఆర్ద్రంగా చిత్రీకరించబడిన ' మా కుటుంబం రెండు దున్నపోతులు' అనే వ్యాసం పశువులు, మనుషులు పరస్పరం పెంచుకునే అనుబంధాల గురించి తెలియజేస్తుంది. ఎవరైనా తప్పుడు లేదా మూర?పు పనులు చేస్తే 'మనిషివా దున్నపోతువా ?' అని అంటాం. అటువంటి సామెత బహుశా పశువుల గురించి, ముఖ్యంగా దున్నపోతుల గురించి తెలియని వారు సృష్టించి ఉంటారని ఈ వ్యాసం చదివిన తర్వాత అనుకోకుండా ఉండలేం.


**పుస్తకం పేజీలు 258.**
**ధర: 200**
**ప్రచురణ: జన సాహితి, హుజురాబాద్.**
**కాపీల కోసం: ఆవునూరి సమ్మయ్య 9849188633.**

ఈ పుస్తకంలో చోటు చేసుకున్న సంఘటనలు, మనుషుల పేర్లు, వారి ఇంటి పేర్లతో సహా అన్నీ యదార్థాలు. ఏవీ కల్పితాలు కావు. రచయిత మరొక నీతినీ ఈ పుస్తకం నిండా పాటించారు. అది , ఇందులోని మనుషులు తనకు ఆ సమయంలో ఎలా కనిపించారో అలాగే చిత్రించారు తప్ప, ఆ పాత్రల పట్ల పాఠకులకు ఫలానా అభిప్రాయం కలిగించాలనే ఉద్దేశంతో, ఆయా మనుషులకు లేని అసాధారణ లక్షణాలను ఆపాదించలేదు. ఇలా, యదార్థాలతో కూడిన ఈ రచనను చరిత్ర అనవచ్చునా? నిజానికి, చరిత్రలో కూడా సగానికి సగం ఊహలు ఉంటాయి. ఆ ఊహలు వాస్తవానికి ఎంత దగ్గరగా చేసినప్పటికీ, ఖచ్చితంగా అది అలాగే జరిగిందా అంటే చరిత్రకారులు సమాధానం చెప్పలేరు. కానీ ఈ పుస్తకంలో జరిగిన సంఘటనలు అలాగే జరిగాయి, జీవించిన మనుషులు ఖచ్చితంగా అలాగే జీవించారు. అందువల్ల ఇది చరిత్ర రచన కంటే ఎక్కువ విలువైనదిగా మనం భావించవచ్చు.

సమాజంలో ప్రగతిశీల మార్పుకు కారణమై, మానవీయంగా జీవించిన మనుషులెందరో క్రమంగా కాలగర్భంలో కలిసిపోయే అవకాశం ఉంటుంది. అటువంటి అనేకమంది అద్భుతమైన మనుషుల గురించి కొత్త తరాలకి, భవిష్యత్తు తరాలకి తెలియజేసేది ఇటువంటి సాహిత్యమే. ఈ 'జ్ఞాపకాల ఊరేగింపు' పుస్తకం ఆ రకంగా ఎంతో విలువైనది.

అయితే, ఎంత గొప్పదైనా ఇదంతా గతం. ఈరోజు ఈ ప్రాంతంలో, రాష్ట్రంలో, ఆ మాటకొస్తే దేశంలో కూడా ఆ ఆదర్శాలు, విలువలు, ఉద్యమాలు పౌర సమాజపు ప్రాధాన్యతలుగా లేవు. అటువంటి అవసరం అందరికీ ఉంటుంది. కానీ వారి ప్రాధాన్యతలలో మాత్రం ఈ రోజు అవి లేని స్థితిని మనం చూస్తున్నాం. అయితే, ఈరోజు లేదా భవిష్యత్తులో జీవించే మనుషులు ఎప్పటికైనా తాము జీవిస్తున్న సమాజ స్థితిగతులను సమీక్షించుకొని ఇంతకంటే మెరుగైన, ఒక మనిషి ఇంకొక మనిషిని హీనంగా చూడని, తన మేలు కోసం ఇతరులను మోసం, దోపిడీ, హత్యలు చేయని, ఆర్థిక, సామాజిక, లింగ స్థితిగతులతో సంబంధం లేకుండా అందరూ సంతోషంగా, శాంతితో, భద్రతతో జీవించగలిగే మానవ సంబంధాలతో కూడిన సమాజాన్ని కోరుకుంటారా? దానికి ఏ పేరైనా ఉండనివ్వండి. అలా కోరుకుంటే దాన్ని వాళ్ళు ఎలా సాధించాలనుకుంటారు? అనేది ఈరోజు అందరి ముందున్న ప్రశ్న. సామాజిక అభివృద్ధిని కోరుకునే ఏ తరమైనా తన పూర్వీకులు చేసిన పోరాటంలో గల ఆకాంక్షలను, వారు అవలంబించిన రాజకీయ విధానాలను అధ్యయనం చేయాలి. అవి నేర్పుతున్న పాఠాల నుండి, వారు పాటించిన విలువల నుండి చాలా నేర్చుకోవాలి. అందుకు ఈ పుస్తకం మంచి సహాయకారి.

ఈ పుస్తకం సాంకేతిక ప్రమాణాల రీత్యా కూడా చాలా బాగుంది. రచనా శైలి చాలా సరళంగా, పిల్లలు సైతం సులభంగా చదువుకునేలాగా ఉంది. అయితే కొన్నిచోట్ల వాక్య నిర్మాణాలలో కొన్ని పదాలు రెండుసార్లు రావడం, చాలా వ్యాసాలలో కొన్ని అంశాలు పదే పదే రావటం పాఠకులకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది. అందుకు ఒక కారణం ఈ వ్యాసాలు వేరువేరు సందర్భంలో రాసినవి కావటం. కానీ, దీనివలన పుస్తకంలో పటుత్వం తగ్గుతుంది. వేరు వేరు సందర్భాలలో రాసిన వ్యాసాలను ఒక పుస్తకంగా వేస్తున్నప్పుడు రిపీటెడ్ గా ఉన్న పేరాలను లేదా వాక్యాలను తొలగించటం తప్పు కాదని నా అభిప్రాయం. ఒక పుస్తకం ఒక వ్యాసం కంటే ఉన్నత రూపం. కాబట్టి పుస్తకానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వ్యాసాలను కొంత మార్చుకొని, కావాలంటే వాటి కింద ఫలానా పత్రికలో, ఫలానా తేదీన ప్రచురింపబడ్డ ఈ వ్యాసాల నుండి కొన్ని పేరాలు తొలగించబడినవి లేదా కొద్దిగా మార్చబడినవి అని రాయవచ్చు. ఇవి మినహా ప్రచురణ నాణ్యత రీత్యా కూడా ఈ పుస్తకం ప్రామాణికమైనది. రచయితకు ధన్యవాదాలు.



**డా. ఎస్ తిరుపతయ్య**
**మానవ హక్కుల వేదిక**
**9849228212.**

# సాధారణ జ్వరం కాదు

# ప్రాణాంతక డెంగ్యూ




## ఈ లక్షణాలుంటే జాగ్రత్త!

**వారందరికీ జ్వరం, ఒళ్లు నొప్పులు. కొద్ది రోజులకు తగ్గిపోతుందనుకున్నారు. కానీ, పరిస్థితి విషమిం చడంతో ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షల్లో డెంగ్యూ అని తేలింది.సాధారణ జ్వరం, వైరల్ ఫీవర్ అని చాలామంది నిర్లక్ష్యం చేస్తారు. కానీ, డెంగ్యూ జ్వరం ప్రాణాంతకం కావచ్చు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల బెడద ఎక్కువైంది. ఈ సమయంలో డెంగ్యూ కేసులు పెరిగే ప్రమాదం ఉంది. అందుకే, దీని లక్షణాలను గుర్తించడం చాలా ముఖ్యం.**

**-డెంగ్యూ లక్షణాలు:** డెంగ్యూ జ్వరం సాధారణ వైరల్ ఫీవర్‌లా ప్రారంభమవుతుంది. అందుకే చాలామంది తేలికగా తీసుకుంటారు. కానీ, కొన్ని లక్షణాలు డెంగ్యూను సూచిస్తాయి.

**-తీవ్రమైన జ్వరం:** డెంగ్యూ సోకినప్పుడు ఒక్కసారిగా 104 డిగ్రీల ఫారెన్‌హీట్ కంటే ఎక్కువ జ్వరం వస్తుంది.

-తలనొప్పి, కంటి నొప్పి: నుదిటిపై తీవ్రమైన తలనొప్పి, కనుగుడ్డు వెనుక భాగంలో నొప్పి ప్రధాన లక్షణాలు.

-కండరాల, కీళ్ల నొప్పులు: శరీరం అంతటా కండరాలు, కీళ్లలో తీవ్రమైన నొప్పి ఉంటుంది. అందుకే ఈ వ్యాధిని 'బ్రేక్ బోన్ ఫీవర్' అని కూడా అంటారు.

-వాంతులు, వికారం: ఆకలి లేకపోవడం, వాంతులు, వికారం వంటి సమస్యలు ఉంటాయి.

-శరీరంపై దద్దుర్లు: జ్వరం తగ్గిన తర్వాత శరీరంపై ఎర్రటి దద్దుర్లు (రాషెస్) రావడం డెంగ్యూ ప్రధాన లక్షణం.

**ప్లేట్‌లెట్స్ తగ్గుదల:** డెంగ్యూలో ప్లేట్‌లెట్స్ సంఖ్య వేగంగా తగ్గుతుంది. ఇది పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తుంది.

ఎప్పుడు వైద్యుడిని సంప్రదించాలి?

పైన చెప్పిన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ముఖ్యంగా ప్లేట్‌లెట్స్ సంఖ్యను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. స్వయంగా మందులు వాడకూడదు. ప్లేట్‌లెట్స్ బాగా తగ్గితే వెంటనే ఆసుపత్రిలో చేరాలి.

**డెంగ్యూ నుంచి రక్షణ:**

దోమలు నివసించే ప్రాంతాలను శుభ్రంగా ఉంచు కోవాలి.

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

నిద్రించేటప్పుడు దోమతెరలు, క్రీమ్స్ వాడాలి.

పూర్తి చేతులు, కాళ్లు కప్పే దుస్తులు ధరించాలి.

ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

వర్షాకాలంలో డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండి, లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవాలి.

### కంటిపాపలను కాటేశాడు..

## వేసిన శిక్ష సరిపోదు అంటున్న సమాజం



మార్వాడీలు ప్రధానంగా భారతదేశంలోని రాజస్థాన్‌కు చెందిన ఒక వ్యాపార వర్గం. వీరు వ్యాపారంలో తమకున్న నైపుణ్యానికి, ఆర్థిక పట్టుకు ప్రసిద్ధి చెందారు.రాజస్థాన్‌లోని చారిత్రక మార్వార్ ప్రాంతం నుంచి వీరు వచ్చారు కాబట్టి వీరికి 'మార్వాడీలు' అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతం నుంచి భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు, ప్రపంచవ్యాప్తంగా కూడా వలస వెళ్లి, వ్యాపార రంగంలో తమదైన ముద్ర వేశారు.

చారిత్రక నేపథ్యం:

మార్వార్ ప్రాంతం ఒకప్పుడు కఠినమైన వాతావరణం, తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతం. వ్యవసాయం కష్టంగా ఉండేది. అందుకే, ఇక్కడి ప్రజలు సహజంగానే వ్యాపారం వైపు మొగ్గు చూపారు. వీరు ప్రధానంగా అప్పులు ఇవ్వడం, వర్తకం చేయడం వంటి పనులను ఆరంభించారు. మొఘల్ సామ్రాజ్యం కాలంలో, బ్రిటీష్ పాలనలో కూడా వీరు తమ ఆర్థిక వ్యవస్థను విస్తరించారు. అప్పటికే వారి వ్యాపారాలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఈస్ట్ ఇండియా కంపెనీతో వ్యాపార సంబంధాలు పెట్టుకుని, భారత ఆర్థిక వ్యవస్థలో వీరు కీలక పాత్ర పోషించారు.

**భారతదేశంలో విస్తరణ:**

మార్వాడీలు ఆర్థిక అవకాశాల కోసం రాజస్థాన్ నుంచి ముఖ్యంగా కోల్‌కతా, ముంబై, ఢిల్లీ వంటి పెద్ద నగరాలకు వలస వచ్చారు. ఈ నగరాల్లో స్థిరపడి, జూట్, పత్తి, చక్కెర, బ్యాంకింగ్ వంటి అనేక రంగాలలో తమ వ్యాపారాలను స్థాపించారు. వీరిలో బిర్లా, బజాజ్, జైన్, అగర్వాల్ వంటి అనేక ప్రముఖ వ్యాపార కుటుంబాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో వీరు కీలక స్థానాన్ని సంపాదించారు.

సాంస్కృతిక విలువలు:

మార్వాడీలు తమ కఠోర శ్రమ, పొదుపు, వ్యాపార నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందారు. వీరు ఎక్కువగా తమ సొంత సమాజంలోనే వివాహాలు చేసుకుంటారు, కుటుంబ బంధాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. జైనమతం, వైష్ణవ మతాన్ని పాటించే వీరు శాకాహారులుగా ఉంటారు. సంస్కృతి, భాష, మతపరమైన ఆచారాలను తరతరాలుగా పాటిస్తూ వస్తున్నారు.

### మార్వాడీలు ఎవరు?..

## దేశవ్యాప్తంగా వ్యాపార సామ్రాజ్యాలు ఎలా నిర్మించారు?



మార్వాడీలు ప్రధానంగా భారతదేశంలోని రాజస్థాన్‌కు చెందిన ఒక వ్యాపార వర్గం. వీరు వ్యాపారంలో తమకున్న నైపుణ్యానికి, ఆర్థిక పట్టుకు ప్రసిద్ధి చెందారు. రాజస్థాన్ లోని చారిత్రక మార్వార్ ప్రాంతం నుంచి వీరు వచ్చారు కాబట్టి వీరికి 'మార్వాడీలు' అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతం నుంచి భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు, ప్రపంచ వ్యాప్తంగా కూడా వలస వెళ్లి, వ్యాపార రంగంలో తమదైన ముద్ర వేశారు.

**చారిత్రక నేపథ్యం:**

మార్వార్ ప్రాంతం ఒకప్పుడు కఠినమైన వాతావ రణం, తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతం. వ్యవసాయం కష్టంగా ఉండేది. అందుకే, ఇక్కడి ప్రజలు సహజంగానే వ్యా పారం వైపు మొగ్గు చూపారు. వీరు ప్రధానంగా అప్పులు ఇవ్వడం, వర్తకం చేయడం వంటి పనులను ఆరంభిం చారు. మొఘల్ సామ్రాజ్యం కాలంలో, బ్రిటీష్ పాలనలో కూడా వీరు తమ ఆర్థిక వ్యవ స్థను విస్తరించారు. అప్పటికే వారి వ్యాపా రాలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఈస్ట్ ఇండియా కంపెనీతో వ్యాపార సం బంధా లు పెట్టుకుని, భారత ఆర్థిక వ్యవ స్థలో వీరు కీలక పాత్ర పోషించారు.

**భారతదేశంలో విస్తరణ:**

మార్వాడీలు ఆర్థిక అవకాశాల కోసం రాజ స్థాన్ నుంచి ముఖ్యంగా కోల్‌కతా, ముంబై, ఢిల్లీ వంటి పెద్ద నగరాలకు వలస వచ్చారు. ఈ నగరాల్లో స్థిరపడి, జూట్, పత్తి, చక్కెర, బ్యాంకింగ్ వంటి అనేక రం గాలలో తమ వ్యాపారాలను స్థాపించారు. వీరిలో బిర్లా, బజాజ్, జైన్, అగర్వాల్ వంటి అనేక ప్రముఖ వ్యాపార కుటుంబాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో వీరు కీలక స్థానాన్ని సంపాదించారు.

**సాంస్కృతిక విలువలు:**

మార్వాడీలు తమ కఠోర శ్రమ, పొదుపు, వ్యాపార నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందారు. వీరు ఎక్కువగా తమ సొంత సమాజంలోనే వివాహాలు చేసుకుంటారు, కుటుంబ బం ధాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. జైన మతం, వైష్ణవ మతాన్ని పాటించే వీరు శాకాహారులుగా ఉంటారు. సంస్కృతి, భాష, మతపరమైన ఆచారాలను తరతరా లుగా పాటిస్తూ వస్తున్నారు.

# సినిమా స్టోరీని తలపించే నిజ జీవిత కథ



అస్సాంలోని టిన్సుకియా జిల్లాకి చెందిన సోబెరాన్ యువకుడు కూరలు అమ్ముకుని జీవిస్తున్నాడు. అతనికి ఇంకా పెళ్లి కాలేదు. ఒక రోజు సాయంత్రం కూరగాయలు అమ్ముకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు.అప్పుడు అతనికి పొదల్లో ఒక పసికందు ఏడుస్తున్న శబ్దం వినిపించింది. సోబెరాన్ ఏడుపు వినిపిస్తున్న దిశగా వెళ్లి చూస్తే అక్కడ.. పొద దగ్గర ఉన్న చెత్త కుప్పపై పడి ఏడుస్తున్న పసికందును చూశాడు.సోబెరాన్ చుట్టూ చూశాడు.. ఎవరూ కనిపించలేదు. ఎవరైనా వస్తారేమో అని కొంతసేపు వేచి ఉన్నాడు.. ఎవరూ కనిపించకపోవడంతో.. ఆ చిన్నారి బాలికని ఒడిలోకి తీసుకున్నాడు. ఆ పసికందు ఆడపిల్లగా గుర్తించాడు. చాలా ముద్దుగా ఉంది. అక్కడ వదిలి వేయడానికి మనసు రాక.. సోబెరాన్ ఆ బాలికను ఇంటికి తీసుకువచ్చాడు.ఆ సమయంలో సోబెరాన్ వయసు 30 సంవత్సరాలు. అవివాహితుడు. బాలికని చూస్తే చాలా సంతోషం కలిగింది. దీంతో పాపని తానే పెంచుకోవాలని నిర్ణయించుకున్నాడు. పెళ్లి కూడా చేసుకోలేదు. ఆ అమ్మాయికి జ్యోతి అని పేరు పెట్టాడు. జ్యోతిని కన్నబిడ్డలా సాకడం మొదలు పెట్టాడు. సోబెరాన్ పగలు, రాత్రి కష్టపడి పనిచేశాడు. జ్యోతికి లోటు అనేది తెలియకుండా అన్ని అవసరాలు తీర్చాడు. స్కూల్ కి పంపించాడు. జ్యోతి అవసరాలు తీర్చేందుకు ఒక తండ్రి చేయగలిగినంత చేశాడు.తాను ఆకలితో పస్తు ఉండాల్సి వచ్చినా..తన కుమార్తెకు ఆ పరిస్థితి రానివ్వలేదు. ఇలా సంవత్సరాలు గడిచాయి. జ్యోతి 2013లో కంప్యూటర్ సైన్స్‌లో పట్టభద్రురాలింది. జ్యోతి పోటీ పరీక్షలకు సిద్ధం కావడం ప్రారంభించింది. 2014లో, అస్సాం పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసింది. ఉత్తీర్ణురాలైంది. జ్యోతి ఇన్ కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్‌గా నియమితురాలైంది.తన కుమార్తె ఈ రోజు మంచి స్టేజ్ కు చేరుకోవడం చూసిన ఆ తండ్రి కళ్ళు కన్నీళ్లతో నిండిపోయాయి. జ్యోతి తన తండ్రిని బాగా చూసుకుంటోంది. తండ్రి కోరికలన్నింటినీ నెరవేరుస్తోంది. తన తండ్రి కష్టపడింది చాలు.. ఇకనైనా విశ్రాంతి తీసుకోవాలని చెబుతుంది. అయితే సోబెరాన్ ఇప్పటికీ కూరగాయల వ్యాపారాన్ని నడుపుతున్నాడు. అంతేకాదు తన కూతురుని చూసి గర్వంతో నేను చెత్త కుప్ప నుంచి ఆడపిల్లను తెచ్చుకోలేదు.. నేనువజ్రాన్ని తెచ్చుకున్నా.. తన రాక నా జీవితాన్ని దైవిక కాంతితో నింపింది. ఆమె నాజీవితానికి ఒక జ్యోతి అని గర్వంగా చెబుతాడు.సోబెరాన్ గురించి తెలిసిన వారు అందరూ దైవం మాన్యుష్య రూపేణా అని అంటున్నారు. నీలాంటి వ్యక్తులే సమాజానికి అవసరం.. నీ త్యాగానికి ప్రేమకి సలామ్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.




### క్రెడిట్ కార్డ్ వాడుతున్నారా..

## ఇబ్బందులను ఏరికోరి తెచ్చుకున్నట్లే




క్రెడిట్ కార్డు మోసాలు ఈ మధ్య కాలంలో అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇటీవల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లను ఓ ముఠా టార్గెట్ చేసి కోట్లు కొల్లగొట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది.ఈ మోసంలో సుమారు 350 మంది రూ. 2.6 కోట్ల వరకు నష్టపోయారు. ఈ కేసులో ఆరు నెలల తర్వాత పోలీసులు 18 మందిని అరెస్టు చేశారు. ఇందులో కాల్ సెంటర్ ఉద్యోగులు, ప్రాంతీయ ఏజెంట్లు, సిమ్ కార్డు ప్రొవైడర్లు, క్రిప్టోకరెన్సీ వినియోగదారులు వంటి అనేకమంది ఉన్నారు. ఈ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా, అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డ్ మోసాల నుండి మిమ్మల్ని మీరు ఎలా రక్షించుకోవచ్చో కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం.

**ఎవరికీ చెప్పొద్దు:**

మీ క్రెడిట్ కార్డ్ ఓటీపీ, సీవీవీ, పిన్ లేదా పాస్‌వర్డ్ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎవరికీ చెప్పకండి. బ్యాంక్ అధికారినంటూ మీకు ఎవరైనా మీకు కాల్ చేసినా లేదా మెసేజ్ చేసినా మీ సమాచారాన్ని పంచుకోవడం చాలా ప్రమాదకరం. గుర్తుంచుకోండి, ఏ బ్యాంకూ మీకు కాల్ చేసి ఇలాంటి సమాచారం అడగదు.

**బ్యాంక్ కాల్స్:**

మీకు బ్యాంక్ నుండి ఏదైనా కాల్ వచ్చి, వారు సమాచారం అడిగితే, ముందుగా వారి గుర్తింపును సరిచూసుకోండి. దీని కోసం మీరు అధికారిక బ్యాంక్ వెబ్‌సైట్ లేదా కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేసి నిర్ధారించుకోవచ్చు. అనుమానాస్పద కాల్‌లను ఎప్పుడూ నమ్మవద్దు.

**లావాదేవీలపై అలర్ట్ :**

మీ బ్యాంక్ ఖాతా, క్రెడిట్ కార్డ్ లావాదేవీలపై నిరంతరం దృష్టి పెట్టండి. మీ మొబైల్‌లో లావాదేవీ హెచ్చరికలను సెట్ చేసుకోండి. తద్వారా ఏదైనా అనధికార లావాదేవీ జరిగితే మీకు వెంటనే తెలుస్తుంది. ఏదైనా అనుమానాస్పద లావాదేవీ కనిపిస్తే, వెంటనే మీ బ్యాంకుకు, పోలీసులకు తెలియజేయండి.

**డిజిటల్ సేఫ్టీ:**


బ్యాంకింగ్ లేదా డబ్బు సంబంధిత లావాదేవీలు చేసేటప్పుడు పబ్లిక్ వైఫైని ఉపయోగించవద్దు. మీ మొబైల్, బ్యాంకింగ్ యాప్‌లను ఎల్లప్పుడూ అప్డేట్ చేస్తూ ఉండండి. గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆప్‌స్టోర్ నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోండి. వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో వచ్చే అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు.

**తక్షణ చర్య :**

ఒకవేళ మీరు ఏదైనా మోసం జరిగిందని అనుమానిస్తే, వెంటనే మీ క్రెడిట్ కార్డును బ్లాక్ చేయండి. తర్వాత వెంటనే మీ బ్యాంకుకు తెలియజేయండి. పోలీసులకు ఫిర్యాదు చేయండి. మీరు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. త్వరితగతిన చర్య తీసుకోవడం వలన మీ నష్టాలను తగ్గించుకోవచ్చు.ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా మీరు ఆర్థిక మోసాల నుండి మిమ్మల్ని మీరు సులభంగా రక్షించుకోవచ్చు. అవగాహనతో ఉండటమే మోసగాళ్లను ఎదుర్కొనే మొదటి అడుగు. క్రెడిట్ కార్డు మోసాలు ఈ మధ్య కాలంలో అంతకంతకూ పెరుగుతున్నాయి.




# నీతా అంబానీ లైఫ్‌స్టైల్ గురించి మీకు తెలుసా?



దేశంలోని అతిపెద్ద పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ భార్య, రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితం కారణంగా వార్తల్లో నిలుస్తున్నారు.కానీ ఆమెలో ఉన్న మరో ప్రత్యేక లక్షణం ఆమె ఫిట్‌నెస్. 60 ఏళ్లు దాటిన తర్వాత కూడా నీతా అంబానీ ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా కనిపించడమే కాకుండా తన శక్తి, సానుకూల దృక్పథంతో లక్షలాది మంది మహిళలకు స్ఫూర్తినిస్తుంది. Traffic Challan Rule: ఇక ట్రాఫిక్ రూల్స్ మరింత కఠినం.. చెల్లించని చలాన్‌లపై ఛార్జీలు!

**ఆరోగ్యకరమైన జీవనశైలి యొక్క రహస్యం:**

నీతా అంబానీకి నృత్యం, ఫిట్‌నెస్‌తో ఎప్పుడూ అనుబంధం ఉంది. ఆమె చిన్నప్పటి నుంచి భరతనాట్యం నేర్చుకుంది. నేటికీ దానిని ఆమె దినచర్యలో భాగంగా చేసుకుంటోంది. మీడియా నివేదికల ప్రకారం.. యోగా, నృత్యం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఆమె ఆరోగ్యం, చర్మానికి అతిపెద్ద రహస్యాలు అని ఆమె నమ్ముతుంది. ఆమె తన కుమారుడు అనంత్ అంబానీని బరువు తగ్గడానికి ప్రేరేపించింది. ఈ సమయంలో ఆమె తన బరువులో 18 కిలోలు కూడా తగ్గింది.

నీతా అంబానీ దినచర్య :

నీతా అంబానీ రోజు తెల్లవారుజామున నిద్రలేవడంతో ప్రారంభమవుతుంది. ఆమె ఎక్కువసేపు మంచం మీద ఉండటం ఇష్టపడదు. నీతా అంబానీ ఉదయం లేచి ముందుగా 40 నిమిషాలు వ్యాయామం చేస్తారు. కొన్నిసార్లు యోగా, కొన్నిసార్లు కార్డియో, కొన్నిసార్లు ఈత, ఆమె ప్రతిరోజూ కొత్తగా ఏదైనా ప్రయత్నించడానికి ఇష్టపడతారట. నృత్యం ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. అందుకే ఆమె బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ఆమె భరతనాట్యం కోసం సమయం కేటాయిస్తుంది. వ్యాయా మం తర్వాత కూడా ఆమె ఆరోగ్యకరమైన అల్పాహారం తీసుకుంటారు. ఇందులో డ్రై ఫ్రూట్స్ ఆమ్లెట్ లేదా గుడ్డు, రసం లేదా గ్రీన్ టీ ఉంటాయి.

**ఆరోగ్యంపై దృష్టి పెట్టండి:**

నీతా అంబానీ శాఖాహారు రాలు, మాంసం, చేపలకు దూ రంగా ఉంటారు. ఆమె ఆహా రంలో ఎక్కువగా కాలానుగుణ కూరగా యలు, ఆకుపచ్చ కూర గాయలు, సూప్‌లు ఉంటాయి. ఆమె మధ్యాహ్న భోజనంలో తేలిక పాటి ఆహారం తినడానికి ఇష్టపడ తారనట. అలాగే సా యంత్రం పండ్లు తీసుకుం టారట. రోజంతా హైడ్రేటెడ్‌గా ఉండటానికి ఆమె ఎల్లప్పుడూ తనతో వాటర్ బాటిల్ ఉంచు కుంటారు. విందు కోసం నీతా, ముఖేష్ అంబానీ చాలా సరళమైన గుజరాతీ శైలి విందును ఇష్టపడతారు. ఇందులో ముఖ్యంగా పప్పు, రోటీ ఉంటాయి.

**మహిళలకు నీతా అంబానీ సందేశం :**

ఇటీవల ఒక కార్యక్రమంలో నీతా అంబానీ ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. దీనిలో మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వమని సందేశం ఇచ్చారు. 30 సంవత్సరాల వయస్సు తర్వాత మహిళలు ప్రతి దశాబ్దానికి మూడు నుండి ఎనిమిది శాతం కండర ద్రవ్యరాశిని కోల్పోతారని, ఇది పెరుగుతున్న వయస్సుతో పాటు మరింత పెరుగుతుందని ఆమె చెప్పారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను విస్మరించకూడదని ఇదే కారణం. నీతా అంబానీ కూడా ఇది వయస్సుతో పోరాడటం కాదు, దానిని స్వీకరించడం అని చెబుతున్నారు. నేను 61 సంవత్సరాల వయస్సులో కూడా దీన్ని చేయగలిగితే, మీరు కూడా దీన్ని చేయగలరు అని అంటున్నారు.

**వ్యాయామాలు, మానసిక ప్రశాంతత :**

వ్యాయామం శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడవే కాకుండా మానసిక ఆరోగ్యానికి కూడా ముఖ్యమని నీతా అంబానీ అభిప్రాయపడ్డారు. వ్యాయామం ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. అలాగే రోజంతా సానుకూల శక్తిని ఇస్తుంది. ఇది బరువులు ఎత్తడం గురించి మాత్రమే కాదు, పిల్లలు, మనవరాళ్లతో చురుకుగా ఉండటానికి శక్తిని కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉందని ఆమె చెబుతున్నారు.

### ఉత్తరప్రదేశ్ రవాణా శాఖ చెల్లించాల్సిన

# చలాన్లపై భారీ జరిమానాలు విధించడానికి సన్నాహాలు




ఉత్తరప్రదేశ్ రవాణా శాఖ ఇప్పుడు చెల్లించాల్సిన చలాన్లపై భారీ జరిమానాలు విధించడానికి సన్నాహాలు చేస్తోంది. దీని కోసం శాఖ 1 నెల కాలపరిమితిని నిర్ణయించింది.ఆ శాఖ అధికారి ప్రకారం.. ఆగస్టు 10 నుండి చలాన్ వసూలు చేసే కొత్త విధానం అమలులోకి వచ్చింది.

ట్రాఫిక్ చలాన్ కొత్త నియమం:

ఉత్తరప్రదేశ్ రవాణా శాఖ ట్రాఫిక్ నిబంధనల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. మీరు ఉత్తరప్రదేశ్‌లో ఉండి వాహనం నడుపుతున్నప్పుడు చలాన్ జారీ చేస్తే వెంటనే దానిని చెల్లించాలి. ఎందుకంటే ఉత్తరప్రదేశ్ రవాణా శాఖ ఇప్పుడు చెల్లించాల్సిన చలాన్లపై భారీ జరిమానా విధించడానికి సిద్ధమవుతోంది. దీని కోసం శాఖ 1 నెల కాలపరిమితిని నిర్ణయించింది.

భారీ వర్షాలు.. 10 జిల్లాల్లో పాఠశాలలు బంద్.. ఆ ప్రభుత్వం కీలక ఆదేశాలు!

అంటే, యుపిలో జారీ చేసిన ఒక నెలలోపు చలాన్‌ను చెల్లించడం తప్పనిసరి. లేకుంటే ఆ తర్వాత ఆలస్య రుసుము విధించే నిబంధన ఉంది. ఈ నియమాన్ని పాటించడంలో ఆలస్యం చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఈ కొత్త నియమం ఇప్పుడు అమలు చేస్తోంది. మీ వాహనం చలాన్‌లను సకాలంలో చెల్లించుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి నిబంధనలు రానున్న రోజులలో అన్ని రాష్ట్రాలలో కూడా అమలు అయ్యే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఆగస్టు 10 నుండి కొత్త చలాన్ రికవరీ విధానం అమలులోకి వచ్చిందని రవాణా కమిషనర్ బ్రజేష్ నారాయణ్ సింగ్ తెలిపారు. ఈ ఆలస్య రుసుము చలాన్ మొత్తంలో 5 నుండి 10 శాతం వరకు ఉంటుంది. అంటే రూ. 1,000 చలాన్ జారీ చేస్తే దానిపై రూ. 50 నుండి రూ. 100 వరకు ఆలస్యంగా జరిమానా విధించవచ్చు.

వాహన యజమానులకు %వామీ%లు

డిపార్ట్‌మెంట్ ప్రకారం.. ఇప్పుడు వాట్సాప్ చాట్‌బాట్ (8005 441222) ద్వారా వాహన యజమానుల మొబైల్‌కు నేరుగా ఈ-చలాన్ నోటీసు పంపుతున్నారు ఆ రాష్ట్ర ట్రాఫిక్ పోలీసులు. మొదటి దశలో జనవరి 2024 నుండి జూలై 2025 వరకు ఉన్న చలాన్‌ల గురించి సమా చారం పంపిస్తారని డిపార్ట్‌మెంట్ చెబు తోంది. దీని తర్వాత రెండవ దశలో 2022, 2023 సంవత్సరాల పెండింగ్ చలాన్‌ల గురించి సమాచారం కూడా అం దుతుంది. దీనితో పా టు వాహన యజ మానులు చాట్‌బాట్ ద్వారా తమ చలాన్‌ను తనిఖీ చేయవచ్చు.

**ఇదేందిరా నాయనా..** ఈ ఖాతాలో డబ్బులు డిపాజిట్ చేసినా ఆదా యపు పన్ను శాఖ నోటీసు!

మీరు చలాన్ ఎలా చెల్లించగలరు?

ఉత్తం ప్రదేశ్ ప్రభుత్వం పౌరుల సౌలభ్యం కో సం ఈ-చలాన్ వ్యవస్థ ను ప్రారంభించింది. దీని సహాయంతో వాహన యజమానులు ఇంట్లో కూర్చొని చలాన్ చెల్లించవచ్చు. వారు ఏ కార్యాలయాన్ని సందర్శించాల్సిన అవసరం లేదు. దీని కోసం మీరు రవాణా శాఖ అధికారిక వెబ్‌సైట్ ని సందర్శించి మీ చలాన్‌ను తనిఖీ చేయవచ్చు. ఏదైనా చలాన్ జారీ అయితే ఉంటే, మీరు వెంటనే ఆన్‌లైన్‌లో చెల్లిం చవచ్చు.

**రవాణా శాఖ వెబ్‌సైట్ నుండి చలాన్‌ను ఎలా సమర్పించాలి?**

ముందుగా echallan.pariva han.gov.in వెబ సైట్‌కి వెళ్లండి.'చెక్ చలాన్ స్టేటస్' పై క్లిక్ చేయండి. ఇక్కడ మీకు మూడు ఎంపికలు లభిస్తాయి.లాన్ నంబర్ ద్వారా వాహన నంబర్ ద్వారా, డ్రైవింగ్ లైసెన్స్ నంబర్ ద్వారా.సరైన ఎంపికను ఎంచుకుని, అడిగిన సమాచారాన్ని నమోదు చేయండి.మీ వాహనానికి సంబంధించిన అన్ని చలాన్లు స్క్రీన్‌పై కనిపిస్తాయి.

మీరు చెల్లించాలనుకుంటున్న చలాన్ ముందు ఉన్న "ఇప్పుడే చెల్లించండి" పై క్లిక్ చేయండి.

నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డ్ లేదా UPI ద్వారా చెల్లించండి.చెల్లింపు విజయవంతమైతే మీకు ఆన్‌లైన్ రసీదు లభిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకోండి.

# గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

## శామీర్ పేట్ చెరువును సందర్శించిన మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

### భద్రత చర్యల అధికారులకు సూచనలు

**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,ఆగస్టు23,(నినాదం):** వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిమజ్జనం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ, భక్తులకు ఏలాంటి అసౌర్యం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. శనివారం గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల తనిఖీ లో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి లతో కలిసి శామీర్ పేట్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ గతంలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఎదురైన సమస్యలను అధిగమిస్తూ ఈసారి



ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువు పరిసరాలలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నీటి మట్టం ఎక్కువగా ఉన్న మధ్య భాగంలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలన్నారు. విగ్రహాల వాహనాలు వెళ్లేందుకు రహదారిని పరిశీలించి, వెంటనేరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అర్ అండ్ బి, పోలీసు, విద్యుతు శాఖల అధికారుల సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. రాత్రిపూట కూడా నిమజ్జనం జరుగుతుంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు అందుకు అవసరమయ్యేలా మసకగా ఉండకుండా వెలుగు ఉండేలా స్తంబాలు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులకు సరిపడా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో 3 క్రేన్లు పెట్టడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ తెలుపగా, ఈ సారి 4 క్రేన్లు పెట్టమని కలెక్టర్ ఆదేశించారు. చెరువు దగ్గరికి భక్తులు వెళ్లకుండా బారిగేడింగ్ నిర్మించాలని సూచించారు. క్రేన్ పెట్టడానికి స్పాట్లను ఏర్పాటు చేయాలని, క్రేన్ ల దగ్గర డ్రైవరు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. భక్తులకు త్రాగునీరు, వైద్య సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా అధికారులందరు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో తూంకుంట మున్సిపల్ కమీషన్ జ్యోతి, ఆర్ అండ్ బి అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి, ట్రాపిక్ ఎసిపి వెంకట్ రెడ్డి, విద్యుత్తు, పోలీస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌రావు నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నాచారం, ఆగస్టు 23 ( నినాదం) :** ఏ ఎస్ రావు నగర్ డివిజన్ నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి తో కలిసి డివిజన్ పరిధిలోని సుబ్రమణ్య నగర్ లో 64 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు, స్ట్రాం వాటర్ డ్రైన్ మరియు 27 లక్షల రూపాయల నిధులతో శశికాంత్ నగర్ లో, 13 లక్ష రూపాయల నిధులతో అనుపురం లో 17.50 లక్షల రూపాయల నిధులతో థీమ్ పార్కులో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, డిఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి, కుమార స్వామి, బేతాళ బాల రాజు, రహీం పాల్గొన్నారు.

### కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం

## ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

### సిపిఐ నాయకుల ఘన నివాళులు



**కుత్బుల్లాపూర్,ఆగస్టు 23 (నినాదం):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన కామ్రేడ్స్ సురవరం సుధాకర్ రెడ్డి అనారోగ్యంతో మరణించడం పార్టీకి తీరని లోటని సిపిఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గొప్ప మేధావిని, పోరాట స్ఫూర్తిని ఇచ్చిన గొప్ప నాయకుడిని నేడు దేశం కోల్పోయిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండీ యూసుఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, కే స్వామి లు సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద, షాపూర్ నగర్ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ హరినాథ్ రావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, మాజీ సాయం కార్యదర్శి దుర్గయ్య, సిపిఐ నాయకులు నరసింహారెడ్డి, శాఖ కార్యదర్శులు ఏం సహదేవరెడ్డి, శ్రీనివాస్ చారి, కే వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ దప్పు రామస్వామి, ప్రజానాట్యమండలి కార్యదర్శి బాబు,ఇమామ్, కృష్ణ,నరసింహ, జానకిరామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### కార్పొరేటర్ రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ రావినారాయణ రెడ్డి నగర్ ఫేస్ టు లో డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు మేనేజింగ్ డైరెక్టర్, చర్చ్ పాస్టర్ జె లోక ప్రకాష్ రావు ఆధ్వర్యంలో మెడి స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. మెగా మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవానికి బిజెపి నేత డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరమును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మెగా హెల్త్ క్యాంప్ ను చర్చి సంఘ పెద్దలు జోబు దాస్ చర్లెస్ సురేంద్ర ఇమునయల్ వినోద్ పాల్గొని ఉచిత వైద్య శిబిరంలో హాజరైన రోగులకు కావలసిన వైద్య పరీక్షల అనంతరం మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోర్చా ఉపాధ్యక్షుడు లక్కోజి మురళీకృష్ణ, శ్రీ విశ్వకర్మ సలహాదారులు సోమేశ్వరరావు, అధ్యక్షులు భాస్కర్, శ్రీ విశ్వకర్మ అధ్యక్షులు జోగారావు, బుల్లెట్ శ్రీను, భాస్కర్, శ్రీకాంత్, పాండు, గోవింద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడండి

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, ఆగస్టు 23 ( నినాదం):** మీర్పేట్ - హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని బ్రహ్మకుమారీస్ రాజయోగ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన దేశ వ్యాప్త లక్ష యూనిట్ల రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. రాజయోగిని దాది ప్రకాశముని ని స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో లక్ష యూనిట్ల రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమని ఈ విషయమై బ్రహ్మకుమారిస్ వారు చేస్తున్న కార్యక్రమాన్ని అభినందించకుండా ఉండలేమని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు సకాలంలో రక్తం అందుబాటులో ఉండడం వల్ల వారి ప్రాణాలను కాపాడిన వారిమీ అవుతామని, ఇదొక పుణ్యకార్యమని తెలిపారు. బ్రహ్మకుమారిస్ వారు నిత్యం ఆచరించే మెడిటేషన్ మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తుందని, జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మెడిటేషన్ ఏకైక మార్గమని ఈ మెడిటేషన్ను బ్రహ్మకుమారిస్ వారు



అందరికీ ఉచితంగా నేర్పించడం అభినందనీయమని అన్నారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతను పెంచుకుంటే స్వతహాగా సమాజం శాంతియుతంగా మారుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రమ్మకుమారిస్ నిర్వాహకులు మీర్పేట్ మౌలాలి ఇంచార్జి సునీత, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఇక్బాల్, మల్లేష్ గౌడ్, హెచ్ బి కాలనీ ఫేజ్-1 అధ్యక్షులు శివరాం ప్రసాద్, గోవిందరెడ్డి, ప్రతాపరెడ్డి, దేవేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డి అమర్ రహే

**కొడంగల్, ఆగష్టు,23 (నినాదం):** సిపిఐ పార్టీ జాతీయ నాయకులు,మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అమర్ రహే సురవరం సుధాకర్ రెడ్డి, అని నినాదాలు చేశారు. సిపిఐ పార్టీ కొడంగల్ నియోజకవర్గ నాయకులు గంటిసురేష్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ, సురవరం సుధాకర్ రెడ్డి చివరి ఊపిరి వరకు కార్మికులు, కర్షకులు పేద ప్రజల పక్షాన తన గొంతును వినిపించిన మహనీయుడని కొనియాడారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటు అని అన్నారు.ఆయన భౌతిక కాయాన్ని గాంధీ ఆసుపత్రికి దానం చేసి,మృతిచెందిన దేహం కూడా విద్యార్థులకు ఉపయోగపడేందుకు అంకితం చేయడం గొప్ప విషయమన్నారు. ఈకార్యక్రమంలో సావిత్రమ్మ, హకీమ్, లాలయ్య, హఫీజ్, షాకీర్, అంజమ్మ, ఆశమ్మ, అశోక్, నర్సిములు, రాజునాయక్,భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



## నేర ప్రవృత్తిని మార్చిన 'ఉన్నతి'

### జైలు సంస్కరణలపై గీతం ఆతిథ్య ఉపన్యాసంలో ప్రఖ్యాత మనస్తత్వవేత్త ప్రొఫెసర్ బీనా చింతలపురి

**జిన్నారం/ పటాన్ చెరు ఆగస్టు 23 (నినాదం):** ఖైదీలను సంస్కరించి రుజువర్తనలోకి మార్చే ఉన్నతి కార్యక్రమం ద్వారా వారిలో సామాజిక అనుకూల విలువలు, జీవిత నైపుణ్యాలు, నేరం చేయని ప్రవర్తనను పెంపొందించినట్టు ఎమెరిటస్ ప్రొఫెసర్, తీహార్ జైళ్లలో ఉన్నతి కార్యక్రమ డైరెక్టర్, ఉస్మానియా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీనా చింతలపురి చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని అప్లైడ్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఎత్తైన గోడలు, తాళాలు వేసిన ద్వారాల లోపల జీవిత లక్ష్యాలను సున్నితంగా మార్చడం' అనే అంశంపై శనివారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తెలంగాణ, ఢిల్లీలో జైలు సంస్కరణ, ఖైదీల పునరావాస కార్యక్రమాలలో మార్గదర్శకురాలైన ప్రొఫెసర్ బీనా, తెలంగాణ జైళ్ల డైరెక్టర్ జనరల్ వీ.కే. సింగ్ నాయకత్వంలో చర్లపల్లి జైలులో ఉన్నతి సంస్కరణల కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ఆంట్రిక్స్-భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సహకారంతో 2015 నుంచి 2023 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని, ఆ తరువాత రాష్ట్రంలోని అన్ని కేంద్ర కారాగాలకు



విస్తరించామన్నారు. ఆ తరువాత ప్రేమ్ రావత్ ఫౌండేషన్ (టీపీఆర్ఎఫ్), తెలంగాణ జైలు సేవల మద్దతుతో, ఉస్మానియా విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం ద్వారా బ్యూరో ఆఫ్ పోలీసు పరిశోధనా, అభివృద్ధి (బీపీఆర్ అండ్ డీ) ఢిల్లీలోని తీహార్ జైలుకు విస్తరించడానికి దోహదపడినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం వెనుక ఉన్న తత్వాన్ని ప్రొఫెసర్ బీనా వివరిస్తూ, ఏ తప్పు కూడా ప్రతికూలం కాదని, తప్పు అనేది ఒకరి జీవితాన్ని నిర్వచించాల్సిన అవసరం లేదని, ఎందుకంటే దానిని సరిదిద్దవచ్చన్నారు. కార్యశాలలు, శిక్షణా మాడ్యూళ్లు, మానసిక అంచనాలు, కౌన్సెలింగ్ సెషన్ల ద్వారా ఈ కార్యక్రమం జైలులో అభిజ్ఞా ప్రవర్తన మార్పు పద్ధతులను ఎలా తీసుకొచ్చిందో ఆమె వివరించారు. మొత్తంగా ఈ చొరవ ఖైదీలలో మార్పుకు బాటలు వేసి తిరిగి తప్పు చేయకుండా నివారించగలిగినట్టు 2019 నుంచి 21 వరకు గణాంకాలతో సహా ఆమె పేర్కొన్నారు. ఉన్నతి యొక్క వినూత్న 5ఆర్ విధానాన్ని ప్రొఫెసర్ బీనా విశ్లేషిస్తూ, కారణం, లక్ష్యాలను తిరిగి మార్చడం, సంస్కరణ, బాధ్యతాయుతంగా ఉండటం, తిరిగి రావడం (జైలుకు కాదు) వంటి వాటి ద్వారా సాధించిన విజయాన్ని విశదీకరించారు. కేస్ స్టడీలు, సైద్ధాంతిక చట్రాలు, మానసిక సాధనాలు, వీడియో ప్రెజెంటేషన్లతో పాటు విద్యార్థులను ఆకర్షించేలా పలు చిత్రాను ఆమె చూపడంతో పాటు పలు కార్యకలాపాలను (యాక్టివిటీస్) చేయించారు. తొలుత, అప్లైడ్ సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గేష్ నందిని అతిథిని పరిచయం చేసి, కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. పలువురు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం

**మహేశ్వరం, ఆగస్టు 23 (నినాదం):** గౌలిపురలో ప్రతినెలా జరిగే అమావాస్య అన్నప్రసాద కార్యక్రమం ఈరోజు శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం, లాల్ దర్వాజా, గౌలిపుర మరియు వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభం గౌలిపుర బతుకమ్మ బావి వద్ద గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక శివపూజలు, రుద్రాభిషేకంతో జరిగింది. శివునికి అత్యంత పుణ్యమైన రోజు అయిన అమావాస్యలో ఈ పూజ భక్తులలో ఆధ్యాత్మిక ఉల్లాసాన్ని నింపింది. పూజల అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభమై, భక్తులందరికీ అన్నం పంపిణీ చేశారు. దాతల సహకారంతో గత 66 నెలలుగా నిరవధికంగా జరుగుతున్న ఈ పుణ్యకర్మ, సామాజిక సేవలో ప్రత్యేక గుర్తింపును పొందింది. కార్యక్రమాన్ని చత్రినాక పాత పోలీస్ స్టేషన్ వద్ద కూడా కొనసాగించారు. కార్యక్రమంలో ముఖ్యంగా పాల్గొన్న శ్రీరాం కోటయ్య గుప్త, అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం ఐపిపి శ్రీధర మల్లికార్జున్ గుప్త, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్ గుప్త, కోశాధికారి వెంకటేశం గుప్త, అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల బిక్షపతి గుప్తకిరణ్ కుమార్ రేనికింది



తదితరులు 66 నెలలుగా కొనసాగుతున్న ఈ పుణ్యకర్మ భక్తులకు ఆధ్యాత్మిక సంతృప్తి, దాతృత్వం మరియు సామాజిక చైతన్యంని పెంపొందిస్తున్న ఒక గొప్ప వేదికగా నిలిచింది.

## సర్వం శివమయం

### ఘనంగా శ్రీ సోమేశ్వర నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

**జవహర్‌నగర్/ దమ్మాయిగూడ ఆగస్టు 23 (నినాదం ):** శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని సర్వం శివమయమని బ్రహ్మశ్రీ కార్తీక్ శాస్త్రి అన్నారు. శనివారం పొలాల అమావాస్య సందర్భంగా సాయిబాబా నగర్ పరిధిలోని ఒకటవ డివిజన్లో పోచమ్మ తల్లి దేవాలయం నూతన సోమేశ్వర స్వామి శివలింగ నందీశ్వర నవగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ శాస్త్రి మాట్లాడుతూ జగత్తు అంతా శివమయమని శివుడు సర్వలోక పాలకుడని సర్వంతర్యామి అని ఈశ్వరేచ్ఛలో భక్తులు తరించాలని సూచించారు. సమాజ అభివృద్ధికి భక్తి మార్గమే మేలని భక్తి సర్వశక్తికి మూలం అన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక శక్తి కేంద్రాలని అవి మనోవికాస కేంద్రాలు అన్నారు. పొలాల అమావాస్య సందర్భంగా శనివారం సాయిబాబా నగర్ ఆలయ కమిటీ వాసుల సహకారంతో నూతన ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వేద పండితుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పోచమ్మ తల్లి దేవాలయం లో నవగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించడం మా పూర్వజన్మ సుకృతం అని ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని కనులారా



వీక్షించడం ముదాబావమన్నారు. బ్రహ్మశ్రీ కార్తీక్ శాస్త్రి పండితులచే దివ్య ప్రతిష్ట కార్యక్రమం జరగడం ఆనందదాయకమన్నారు. ఇది సాయిబాబా నగర్ కాలనీ వాసుల సమిష్టి కృషి, భక్తి భావానికి ఐక్యతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. వినోద్ కుమార్ ,పి. దామోదర్ గౌడ్, ఎస్. కృష్ణ, టి. రాము యాదవ్ , వెంకటాచారి, పి. జగన్ కుమార్, సిహెచ్. మల్లేష్, కాలనీవాసులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంహెచ్‌ఆర్ కాలనీలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు



**అల్వాల్, ఆగస్టు 23 (నినాదం):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని ఏం హెచ్ ఆర్ కాలిని వాసుల ఫిర్యాదు మేరకు పార్కును సందర్శించిన జిహెచ్ఎంసి ఏసిపి శ్రీనివాస్ రెడ్డి కాలనీ లో సమస్యలన్నీ కాలిని లో నిర్మాణ అవుతున్న ఇండ్లను పరిశీలించారు. కాలనీలో గృహాలు సెట్ బ్యాగులు. పెంట్ హౌస్. ఇంటి ముందు రోడ్లను ఆక్రమించి ర్యాంపులు కట్టడం రోడ్డు ఆక్రమించిన వారికి నోటీసులు ఇస్తానని ఏ సి పి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రోడ్లు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సంతోష్ రెడ్డి, బుచ్చిరెడ్డి, సంతోష్ కుమార్ ,ఆనంద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పువ్వులు పండ్లు తులసి దళాలతో శ్రీనివాసుడి దర్శనం

**అల్వాల్, ఆగస్టు 23 (నినాదం):** అలంకారాలకు నిలయం ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీవారికి శనివారం పువ్వులు, పండ్లు, తులసీదళాలతో ప్రత్యేక అలంకరణ చేసిన ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణ చార్యులు. శ్రావణమాసంలో చివరి రోజు శనివారం అమావాస్య కలిసి రావడం తో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారితో పాటు ఉపాలయంలో వేంచేసి ఉన్న సంకట విమోచన ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రద స్వీకరించారని ఆలయ ఈఓ ఏబి రవీందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవ భక్తబృందం అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ స్థలాలు కాపాడడంలో రెవెన్యూ అధికారులు విఫలం

### కార్పొరేటర్‌తో కలిసి ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం

### బిజెపి డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ లోని సర్వేనెంబర్ 12 లో జరుగుతున్న కబ్జాలను తాసిల్దార్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని గాజులరామారం డివిజన్ బిజెపి నేత సాయి నాథ నేత అధికారుల తీరును తప్పు పట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ కి సంబంధించిన సర్వేనెంబర్ 12 లో వందల కోట్ల విలువైన సుమారు 4 ఎకరాల ప్రభుత్వ స్థలం అన్యకాంతం అవుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. గత జులై మాసం 16-07-2025 రోజున స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ తాసిల్దార్ ను కలిసి పుణ్యాకరాంతమవుతున్న ప్రభుత్వ భూములపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశాం. తహసిల్దార్ ని కలిసి ప్రభుత్వ స్థలాలు కాపాడాలంటూ కార్పొరేటర్ తో కలిసి వినతి పత్రాలు ఇచ్చి నెల రోజులు దాటుతున్న ఇప్పటివరకు కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని వాపోయారు. వందల కోట్ల విలువైన ప్రభుత్వ



స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంలో కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు వైఫల్యం చెందడంలో కబ్జాదారులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కైనట్లు తెలుస్తుందని ఆయన ప్రకటనలో తెలిపారు.వందల కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలం ఒక బడా బాబుగా చెప్పు కునే కబ్జాదారుడు కబ్జా చేశాడని ఆధారాలతో సహా తహసిల్దార్ కు వివరాలు అందజేసిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రెవెన్యూ అధికారుల తీరును ఎండగట్టారు. వందల కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన టీ స్టాల్, కంటైనర్, కాంపౌండ్ వాల్‌ను ఎందుకు తొలగించడం లేదన్నారు. అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాన్ని నిర్ధారించి స్వాధీనం చేసుకొనుటకు ఏడి సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఆ స్థలాన్ని కాపాడడంలో మీకు గల ఇబ్బందులు ఏంటని ప్రశ్నించారు. కబ్జా జరిగిన స్థలం ప్రభుత్వ స్థలం కాదని రెవెన్యూ అధికారులు దాటవేసే ధోరణిలో ఉన్నారన్నారు. సర్వేనెంబర్ 12 లో గల 4 ఎకరాల ప్రభుత్వ స్థలం ఎక్కడ వున్నదో గుర్తించి దానిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సర్వే నెంబర్ 12 లోని ప్రభుత్వ స్థలము అన్యాక్రాంత మవుతుందని గత రెండు సంవత్సరాలుగా గతంలో ఉన్న తహసిల్దార్ కు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లకు అనేకమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ వాళ్ళు పట్టించుకోలేదు, కొత్తగా వచ్చిన తాసిల్దార్ కూడా వారి బాటలోనే నడుస్తున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కబ్జాదారున్ని ప్రోత్సహిస్తున్నారా? కబ్జాదారుడు రెవెన్యూ అధికారులను కంట్రోల్ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న నాయకులు, గెలిచిన ఎమ్మెల్యే కబ్జాదారులను, రెవెన్యూ అధికారులను కట్టడి చేయడం మాని వీళ్లిద్దరిని ప్రోత్సహిస్తున్నారా అనేది తెలియాల్సి ఉన్నదన్నారు. గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో శనివారం మరొకసారి తాసిల్దార్ ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. సర్వే నెంబర్ 12 లోని నాలుగెకరాల స్థలములో ప్రస్తుత ఎమ్మెల్యే కేపీ వివేకానంద, అప్పటి జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజనల్ అధికారి స్థానిక తహసీల్దార్ లు ప్రభుత్వము ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొక్కలు నాటడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ తహసిల్దార్ ఇతర అధికారులు సర్వేనెంబర్ 12 లోని ప్రభుత్వ స్థలం పై ప్రత్యేక చొరవ చూపి పాలకులతో కలిసి ఎడి సర్వే చేయించి ప్రభుత్వ స్థలాన్ని నిర్ధారించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాలకు విలువైన భూములు వినియోగించేలా చూసి తన నిజాయితీని నిరూపించుకోవాలని సాయినాథ్ నేత వివరించారు.

## నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్ట్ 23 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా బిల్లులు చెల్లించే ఆర్థిక స్తోమత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయంలో బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సి.ఎం.ఆర్.ఎఫ్)ను మంజూరు చేయించారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 129 డివిజన్ కళావతి నగర్ వాసులు ఎస్.మణెమ్మకు రూ. 52,500/-, 127 డివిజన్ గురుమూర్తి నగర్ వాసులు మొహమ్మద్ ఇషాక్ అహ్మద్ కు 60వేలు, బాచుపల్లి వాసులు సరస్వతికి రూ 60వేల సిఎంఆర్ఎఫ్-మంజూరి పత్రాలను కొలను హనుమంత రెడ్డి (చెక్కులు) అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సి ఎం ఆర్ ఎఫ్ పథకమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శరగడం నర్సింగ రావు, డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, సంతోష్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బిక్షపతి, కరణ్, చందు, రహీమ్, ఖలీమ్, సురేందర్ రెడ్డి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.




# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

**సరస్వతి నిలయంలో మందు బాటిల్లు..**
**గేటుకు తాళం లేకపోవడం వల్లే ఈ దుస్థితి..**



**జమ్మికుంట ఆగస్టు 23( నినాదం):** వీణవంక మండల కేంద్రంలో ఓల్డ్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల మందుబాబులకు అడ్డాగా, పార్టీలకు, జల్సాలకు, దావతులకు అడ్డాగా మారిపోయింది. పాత జడ్.పి.హెచ్.ఎస్ ఆవరణలో ప్రస్తుతం గ్రంథాలయం, పి హెచ్ సి సబ్ సెంటర్, 3 అంగ న్వాడీ కేంద్రాలు నిర్వహణ , నర్సరీ చెట్ల పెంపకం జరుగుతుంది. సాయంత్రం అయ్యిందంటే ప్రతిరోజు జల్సాలకు అడ్డాగా మారి, తాగుబోతులు అడ్డాగా మారి, సెల్ఫోన్లో మాట్లాడుతూ.. సిగరెట్లు తాగుతూ..పాఠశాల ఆవరణం లో బీరు బాటిల్స్, వాటర్ బాటిళ్లు, ఇస్తారాకులతో దర్శ నమిస్తుంది. గతంలో కొన్ని పత్రికలలో కథనాలు రావడంతో స్పందించిన అధికారులు కొన్ని రోజులు గేటుకు తాళం వేసిన అధికారులు మళ్లీ తెరిచి ఉంచడంతో మందు బాబులకు అడ్డగా మారిందని,108 సిబ్బంది నిర్లక్ష్యంతోనే గేటు ఓపెన్ చేసి ఉంచడం మందు బాబులకు అడ్డాగా మారిందని, సరస్వతి మాత కొలువై ఉన్నచోట ఖాళీ బీరు సీసాలతో వైన్ షాపును తలపిస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్‌కు తాళం వేయించాలని,అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారక ముందే, చదువు ల బడిని సంరక్షించాలని సామాజిక వేత్తలు,పూర్వ విద్యార్థులు, గ్రామ పుర ప్రముఖులు కోరుతున్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



**కరీంనగర్, ఆగస్టు 23(నినాదం):** అంధత్వము నిర్మూలించే బృహత్తర కార్యక్రమం లో భాగంగా లక్సట్టిపేట్ చుట్టూ ప్రక్కన గ్రామస్థులకు నిర్వహించిన ఉచిత కంటి క్యాంపు ద్వారా ఎంపిక కాబడి కంటి చూపు లోపించి బాధపడుతున్న 27 మంది బీదవారికి ఆధునిక పరికరాలు, అనుభవం ఉన్న డాక్టర్లు మన లయన్స్ రేకుర్తి కంటి దావఖానా యందు ఉచిత క్యాటరక్ట్ సర్జరీ గావించి, ఉచిత రవాణా, మందులు, అద్దాలు భోజన సదుపాయాలు సమకూర్చి ఆసుపత్రి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ ఆధ్వర్యంలో శనివారం రోజున వారిని తిరిగి వారి ఊరికి పంపించడం జరిగింది. ఇందులో టెక్నీషియన్ ప్రభాకర్, సిబ్బంది ఆశు, రియాజ్, బాబా పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ స్కూల్‌లో ఆకట్టుకున్న న్యూట్రిషన్ ఎక్స్పో



**కరీంనగర్, ఆగస్టు 23(నినాదం):** పౌష్టికరమైన ఆహారాన్ని విద్యార్థులకు ఇవ్వడం వలన చాలా ఆరోగ్యంగా ఉంటారని వారి యొక్క కార్యకలాపాలను హుషారుగా చేపడతారని అల్ఫో ర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో వినుత్నంగా ఆలోచింప చేసే విధంగా ఏర్పాటు చేసినటువంటి న్యూట్రిషన్ ఎక్స్పో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ప్రారంభానికి ముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి జ్యోతిని వెలిగించి వేడుకగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పౌష్టికరమైన ఆహారం లేకపోవడం వలన ఎంతోమంది రోగాల బారిన పడుతున్నారని, పౌష్టికరమైన ఆహారాన్ని తప్పనిసరిగా చిన్నతనం నుండే అలవాటుగా చేయాలని తద్వారా వారి ఎదుగుదలకు ఎటువంటి ఆటంకాలు ఉండవని వారు అభిప్రాయపడ్డారు.నేటి పోటీ ప్రపంచంలో సమయ భావం వలన చాలామంది కలుషిత ఆహారానికి అలవాటు పడ్డారని విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని మరియు శరీరాన్ని దృఢంగా చేసేటువంటి ఆహారపు అలవాటను అలవర్చుకొని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడమే కాకుండా ఎక్కువ కాలం పాటు జీవించే విధంగా పలు సూచనలను సలహాలు పాటిస్తూ జీవనాన్ని కొనసాగించాలని తెలిపారు.కార్యక్రమం లో భాగంగా ప్రాంగణంలో వివిధ రకాల పౌష్టికరమైన ఆహారాన్ని చేసేటువంటి వస్తువులతో చక్కగా అలంకరించారు, విద్యార్థులు వివిధ రకాల పౌష్టికర ఆహారాల గురించి స్పష్టంగా సమగ్రంగా సమాచారాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు నమూనాలు చాలా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ నేత సాయిని రవి

**నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన వైనం**



**జమ్మికుంట, ఆగస్టు 23 (నినాదం) :** మ్మికుంట పట్టణంలోని శాలవాడకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వితంతు మహిళ పాల రమ కుమార్తె పాల స్రవంతి ( 21) శనివారం బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో మృతి చెందింది. స్రవంతి మరణించిన విషయం తెలిసిన జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు సాయిని రవి వెంటనే స్పందించి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. మృతురాలి కుటుంబ సభ్యుడి లో ఒకడిగా దగ్గరుండి అన్ని తానై స్రవంతి అంత్యక్రియలు పూర్తిచేసి నిరుపేద కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు ఇచ్చి పేదింటి కుటుంబానికి బాసటగా నిలిచాడు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందిన ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆ కుటుంబంలో ఒకరిగా వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిని రవి తోపాటు డాన్ శీను తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న గణేష్ మండపాలు

**వెల్గటూర్,ఆగస్ట్23(నినాదం న్యూస్):** రానున్న వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలో మండపాల నిర్మాణం జోరుగా సాగుతోంది.గణనాథుడు కొలువు తీరిన రోజు నుండి నిమజ్జనం వరకు వేడుకలు అంగరంగ వైభవంగా జరిపేందుకు యువత,ఉత్సవ కమిటీ సభ్యులు సమాయత్తం అవుతున్నారు.మండపాల ఏర్పాటు పనులను శరవేగంగా కొనసాగుతున్నాయి.గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా కూడా భక్తులు ఏ మాత్రం తగ్గడం లేదు.పలు మండపాల్లో ఇప్పటికే వినాయక విగ్రహాలు చేరుకుని,మండపం నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నవ రాత్రులు జరుపుకోవాలని,మండపాల నిర్వాహకులు పోలీస్ వారు సూచించిన పోర్టల్ లో వివరాలు నింపి అనుమతి పొంది సహకరించాలని ఆలయ,ఉత్సవ కమిటీ నిర్వాహకులకు పోలీస్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



# పర్యావరణ పరిరక్షణకె మట్టి విగ్రహాలను పూజించండి

**జిల్లా కలెక్టర్ పమేల సత్పతి**

**కరీంనగర్, ఆగస్టు 23(నినాదం) :** పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి విగ్రహాలు పూజించలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. యువ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పూజిద్దాం! పర్యావరణాన్ని కాపాడుదాం!! అనే మట్టి గణపతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్ ను శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆమె ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలసత్పతి మాట్లాడుతూ ఇంటింటా మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కోరారు.కరీంనగర్ సిపి గౌస్ ఆలా మాట్లాడుతూ, రసాయనలతో తయారుచేసే రంగురంగుల వినాయకులతో పర్యావరణం ముప్పు పొంచి ఉన్నదని అన్నారు. పిఒపి తో తయారైన వాటిని ఆదరిస్తే జీవరాశి మనుగడకు ప్రమాదకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డిఓ మహేశ్వర్, యువ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జక్కని సాయిరాం, మేము సైతం యువ సేన ఫౌండేషన్ చైర్మన్ చకిలం స్వప్న, గొట్టేముక్కుల సుష్మిత రెడ్డి, న్యాయవాది ధీరజ్ స్వచ్ఛంద సంస్థసభ్యులు పాల్గొన్నారు.



# శ్రీరామ మానవ సేవ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు

**సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన వేదిక**
**వృద్ధులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేసిన సివిల్ జడ్జ్ కిరణ్ కుమార్**



**జమ్మికుంట, ఆగస్టు 23 (నినాదం):** శ్రీరామ మానవ సేవ వృద్ధాశ్రమంలో సివిల్ జడ్జ్ పి.బి కిరణ్ కుమార్ న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు.ఇల్లంతకుంట శ్రీరామ మానవ సేవ వృద్ధాశ్రమంలో హుజురాబాద్ కోర్టు సివిల్ జడ్జ్ కిరణ్ కుమార్ న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేసి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ న్యాయ శాస్త్ర కోవిదులు అధికార అనధికార ప్రముఖుల సమక్షంలో స్నేహపూరిత వాతావరణం లో ఉభయ పక్షాలకు ఆమోద్య యోగ్యమైన తీర్పు ద్వారా మీ కేసులలో తుది పరిష్కారం పొందాలని, వ్యాయప్రాయాసాలు లేని సత్వర న్యాయం పొందాలంటే లోక్ అదాలత్ వ్యవస్థను వినియోగించుకోవాలని అన్నారు. చిరకాలంగా కోర్టుల యందు అపరిష్కృతంగా నిలిచిపోయిన మీ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని తక్కువ వ్యవధిలో ఖర్చు లేకుండా మీ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. కోర్టు పెండింగ్లో ఉన్న కేసులలో ఇరుపక్షాలు తమ కేసును లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించమని కోరినప్పుడు గాని లేదా ఏ ఒక్క పార్టీ కోరినప్పుడు గాని లేదా సదరు కేసు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించ దగినదని ఆయా కోర్టులు భావించినప్పుడు గానీ సదరు కేసును సంబంధిత లోక్ అదాలత్ ఆయా కోర్టులు పంపవచ్చును అని తెలిపారు. కోర్టుకు కేసు వెళ్ళని పక్షంలో సదరు పార్టీల వారు తమ యొక్క తగాదాలను పరిష్కరించుకోవలసినదిగా సంబంధిత జిల్లా న్యాయ సేవా ఆధికారి సంస్థను గాని లేదా రాష్ట్ర న్యాయ సేవా ఆధికార సంస్థను గాని కోరవచ్చునని పేర్కొన్నారు. పలుమార్లు తిరగవలసిన పని లేకుండా సహోద్భవ వాతావరణంలో అప్పీలు లేని న్యాయబద్ధమైన అంతిమ తీర్పు పొందాలంటే లోక్ అదాలత్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ మానవ సేవ ట్రస్ట్ అధ్యక్షుడు ఎలిమిళ్ళ రాజేంద్రప్రసాద్,ప్రధాన కార్యదర్శి, బచ్చు శివకుమార్, మేనేజర్, ఆదిరెడ్డి ఇల్లంతకుంట హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, అశోక్, ప్రశాంత్, అమరేందర్, పాల్గొన్నారు.

## ఆర్ కృష్ణయ్య దీక్షకు బిసి సంఘాల సంఘీభావం

**42శాంతం బిసి రిజర్వేషన్లు**
**అమలు ధ్యేయంగా చలో హైదరాబాద్**
**బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అది మల్లేశం పటేల్,యువజన విభాగం**
**జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్**



కరీంనగర్, ఆగస్టు 23(నినాదం):బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య ఈనెల 25వ తేదీన ఇందిరా పార్క్ వద్ద సత్య గ్రహ దీక్ష చేపడుతున్నట్లు బిసి సంఘాల నాయకులు శనివారం రోజున ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ సమావేశంలో తెలియజేశారు. ఈ దీక్షకు మద్దతుగా గ్రామ, మండల, నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున బీసీ కుల సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు మేధావులు, విద్యార్థులు, యువకులు వేలాదిగా ప్రజలు తరలి రావాలని 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా ఆర్ కృష్ణయ్య దీక్షకు సంఘీభావం తెలుపాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42% రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికల నిర్వహించాలని కోరారు. లేకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్య క్షులు అది మల్లేశం పటేల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసుపెద్ది శ్రీధర్ రాజు, చిగుర్ల శ్రీనివాస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు గుంట స్వరూప, కన్వీనర్ రవీంద్ర చారి, నగర అధ్యక్షులు అనుమాస నితిన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు నల్లగొనీ శ్రీనివాస్ తదితరులు పాల్గొ న్నారు.

## రాష్ట్ర స్థాయి యోగాపోటీలకు ఎంపికైన హుజూరాబాద్ వాసి



**జమ్మికుంట, ఆగస్టు 23 (నినాదం) :** హైదరాబాద్ లోని సరూర్ నగర్ స్టేడియంలో ఈనెల 31న జరగబోయే రాష్ట్ర స్థాయి సీనియర్ యోగాపోటీలకు హుజురాబాద్ కు చెందిన చల్లూరి శ్రీధర్ ఎంపిక య్యారు. కరీంనగర్ లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆయనతో పాటు జిల్లా నుంచి మరో ఇద్దరు ఎంపికయ్యారు. శ్రీధర్ చెన్నైలోని అన్నామలై యూనివర్సిటీ నుంచి యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. ప్రస్తుతం హుజూరాబాద్ పట్టణంలో యోగా ట్రైనర్ గా పనిచేస్తున్నాడు. శ్రీధర్ ఎంపిక పట్ల పట్టణంలోని రాజకీయ ప్రముఖులు, యోగా అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, ఆయనను అభినందించారు.

# సమీకృత మార్కెట్ నిర్మాణం ను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలి

**మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్, ఆగస్టు 23(నినాదం):** కాశ్మీర్ గడ్డ రైతు బజార్ సమీకృత మార్కెట్ నిర్మాణం ను నాణ్య తతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీజేపి నాయకులు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు కాంట్రాక్ట్ ఏజెన్సీని ఆదేశించారు. కరీంనగర్ లో శనివారం రోజు కాశ్మీర్ గడ్డ రైతు బజార్ మార్కెట్ ను సందర్శించారు. నగరపాలక సంస్థ కు చెందిన 10 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్న వెజ్ నాన్ వెజ్ మార్కెట్ అభివృద్ధి పనులను తనిఖీ చేసి పరిశీలించారు. ప్రస్తుతం మార్కెట్ భవనం స్లాబ్ నిర్మాణం పనులు చేపట్టడంతో వాటిని తనిఖీ చేసి పరిశీలించారు. ఏజెన్సీ కాంట్రాక్టర్ ను పనులు జరుగుతున్న తీరు పై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేస్తూ... కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... కాశ్మీర్ గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణం నాణ్యతతో పూర్తి చేసి... ప్రజలకు త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పటికే మార్కెట్ నిర్మాణం పనులు చాలా ఆలస్యం అయ్యాయని.... వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. డిజైన్ మ్యాప్ లో పొందుపరిచిన ప్రకారం సమీకృత మార్కెట్ లో వసతులు, సౌకర్యాలను కల్పిస్తూ.... పనులు చేయాలని కోరారు. ఇందులో సెల్లార్ నిర్మాణం కూడ చేపడుతున్నా నేపథ్యంలో... వరద నీరు సెల్లార్ లోకి వెళ్లకుండ నిర్మాణం లో తగిన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. చాలా కాలంగా రైతు బజార్ మార్కెట్ ప్రఖ్యాతి గాంచింది కాబట్టి... వినియోగదారు అధికంగా మార్కెట్ కు రావడం జరుగుతుందని... వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమీకృత మార్కెట్ నిర్మాణం చేయాలన్నారు. వచ్చే ప్రజలకు, మార్కెట్ లో కూరగాయలు అమ్మకాలు చేసే వ్యాపారుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, స్త్రీలకు, పురుషులకు వేరు వేరుగా మాడ్రన్ మాడల్ లో మరుగుగొడ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. సమీకృత మార్కెట్ పనులను ఆరుమాసాల్లో పూర్తి చేసి ప్రజలకు వినియోగం లోకి తేవాలని అన్నారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు కూడ సమీకృత మార్కెట్ నిర్మాణం సమయంలో తప్పని సరిగా పర్యవేక్షణ చేయాలని... అధికారుల పర్యవేక్షణ లోనే పనులు పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణం లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పోరేటర్ తుల శ్రీదేవి చంద్రమౌళి, ఏజెన్సీ కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు..

## శ్రీసత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


**సాయి నామస్మరణతో మారు మ్రోగిన మర్రిపల్లిగూడెం**





**జమ్మికుంట, ఆగస్టు 23 (నినాదం):** శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం కమలాపూర్ మండలంలోని మర్రిపల్లి గూడెం గ్రామంలో శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో మర్రిపల్లి గూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ మాట్లాడుతూ, శ్రీ సత్య సాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా మర్రిపల్లిగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జమ్మికుంట పట్టణంలోని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వి సత్యం సావిత్రి దంపతుల చే వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా శ్రీ సత్య సాయి గ్రామోత్సవం కార్యక్రమం మర్రిపల్లిగూడెం గ్రామంలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 4:00 వరకు సత్య సాయి బాబా వారి శతజయంతి మహోత్సవాలను పురస్కరించుకొని సేవా సమితి ద్వారా గ్రామంలో నగర సంకీర్తన రంగనాయక స్వామి టెంపుల్ లో , భజన సత్సంగం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లలందరికీ పాటల పోటీలు ఆటలు పోటీలు మహిళ యువతకు కూడా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. యువతకు కెరీర్ గైడెన్స్, డ్రగ్స్ పై అవగాహన సదస్సు మొబైల్ వాడకం దాని ప్రభావం చెడు అలవాట్ల పై అవగాహన కల్పిస్తూ యువత అంతా కూడా చక్కటి మార్గంలో నడవడానికి అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ప్రేమ తరువు మొక్కలు నాటడం మొదలగు కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి లింగమూర్తి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు శ్రవణ్ డాక్టర్ సత్యం సావిత్రి జమ్మికుంట సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్, సమితి మహిళ యువజన విభాగ్ మాధురి, సాయి నిత్య శ్రీ, సత్య, సౌమ్య, లక్ష్మి మొదలగు తదితర సాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే కవ్వంపల్లిని పరామర్శించిన**
## టీఎన్జీవో సంఘ నాయకులు



**కరీంనగర్, ఆగస్టు 23(నినాదం) :** మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ సోదరులు కవ్వంపల్లి రాజేశం అకాల మరణం చెందడం తీవ్ర విచారకరం.ఈ సందర్భంగా కరీంనగర్ టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి కార్యవర్గ సభ్యులు వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని ఆ పరమాత్మను ప్రార్థిస్తూ, ఈ లోటును భరించే ధైర్యం, శక్తి భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సంతాపం ప్రకటించిన వారిలో టీఎన్జీవో నాయకులు ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మేందర్ సింగ్, ఒంటెల రవీందర్ రెడ్డి, గంగారపు రమేష్ లవ కుమార్, అరుణ్ సింగ్ మంజు సింగ్ హస్గర్ వెంకటరెడ్డి, కరుణాకర్, నారాయణ తదితర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో భారీ కవాతు

**పోలీస్ ఫోర్స్‌కు ఘన స్వాగతం పలికిన పట్టణ ప్రజలు**
**ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్**
**పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్**



**జమ్మికుంట, ఆగస్టు 23 (నినాదం):** శాంతి భద్రతల కోసమే ప్రత్యేక బలగాలచేత పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామని జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్ అన్నారు. జమ్మికుంట పట్టణంతో పాటు వీణవంక మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు రానున్న గణేష్ నవరాత్రులు, దుర్గ మాత నవరాత్రులు ,స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆర్ ఏ ఎఫ్ కు చెందిన 30 మంది, కరీంనగర్ కమిషనరేట్ పోలీస్ సిబ్బంది 15 మంది, 20 మంది లోకల్ పోలీస్ సిబ్బంది ఈ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీ నారాయణ జెండా ఊపి కవాతు ను ప్రారంభించారు. ఈ ర్యాలీ జమ్మికుంట గాంధీ చౌరస్తా మీదుగా పాత సిటీ కేబుల్ లైవ్ నుండి వీణవంక రోడ్డు మీదు గా తిరిగి జమ్మికుంట గాంధీ చౌరస్తాకు చేరుకుంది. చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ సీనియర్ నాయకులు ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ కోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి అర్థిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు మార్కెట్ డైరెక్టర్ మానుపాటి సూర్య ప్రత్యేక బలగాల కమాండర్, పట్టణ సిఐని పూలమాలవేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలు అలాగే గణేష్ నిమజ్జనం నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఈ యొక్క కవాతును నిర్వహిస్తున్నామని అన్నారు .ఎలాంటి సంఘటన జరగకుండా ముందస్తుగా ఈ యొక్క కవాతును నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు పోలీసు వారికి సహకరించి కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. చల్లూరు గ్రామానికి చెందిన జవాన్ బషీరుద్దీన్ కు గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఎస్సై సతీష్ వీణవంక ఎస్సైలు ఆవుల తిరుపతి , నాగరాజు,ఇల్లందకుంట ఎస్ఐ క్రాంతి కుమార్ మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం

## అర్హత గల వారిని గుర్తించి నివేదిక అందించాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 23( నినాదం):** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హత కలిగిన వారిని వారం రోజుల్లో గుర్తించి సమగ్ర నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించా రు. శనివారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పథకం కింద దారిద్ర్య రేఖ దిగువనున్న ప్రాథమిక ఆదాయం కలిగిన 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయసున్న కుటుంబ పెద్ద పురుష, మహిళ సహజ లేదా ప్రమాదవశాత్తు మరణించిన సమయంలో ఒకేసారి 20వేల రూపాయల నగదు సహాయాన్ని కుటుంబానికి అందించడం జరుగుతుందని తెలిపారు .కుటుంబంలో ప్రాథమిక సంపాదన దారుడు మరణించిన రెండు సంవత్సరాలు లోపు ఈ సహాయానికి వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అంత్యోదయ అన్నా భీమా యోజన, జన శ్రీ బీమా యోజన కింద లబ్ది పొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని స్పష్టం చేశారు. ఈ పథకం కింద లబ్ది పొందేందుకు దరఖాస్తులను సంబంధిత తహసిల్దార్ కార్యాలయంలో సమర్పించాలని, దరఖాస్తు తో పాటు, మరణించిన వ్యక్తికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం ,వ్యక్తిగత గుర్తింపు పత్రం, చిరునామా , దారిద్య్ర రేఖకు దిగువనున్నట్లు తెలిపే రేషన్ కార్డు, ధ్రువ పత్రం జత చేయాలని, సహాయం పొందేందుకు దరఖాస్తు చేసిన కుటుంబ సభ్యునికి సంబంధించిన ,ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతా లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతా వివరాలతో పాటు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోను జత చేసి సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.నల్గొండ జిల్లాకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 3500 మందికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు జనవరి ఒకటి, 2024 నుండి మరణించిన వారి వివరా లను మరణ రిజిస్టర్ ఆధారంగా తక్షణమే ఎంపీడీవోలకు పంపించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు పరిశీల నానంతరం జాబితాలను తహసిల్దార్లకు సమర్పించాలని ఆదేశిం చారు. మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ కమి షనర్లు జాబితాలను పంపించాలని చెప్పారు. మిర్యాల గూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తదితరులు ఉన్నారు .

## బిసి రిజర్వేషన్ల పెంపునకు 25న సత్యాగ్రహ దీక్ష

**కోదాడ,ఆగస్టు 23(నినాదం):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు బీసీ యువజన సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు గద్దం లక్ష్మీనారాయణ యాదవ్ తెలిపారు. మునగాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశపరిచి, బిసి రిజర్వేషన్ల అమలుకు ప్రత్యా మ్నాయ నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించి, రాజ్యాంగంలోని 246 డి6 టి6 ప్రకారం స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను పెంపునకు జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు..రాజకీయ పార్టీలు విభేదాలను విభేదాలుగానే వాస్తవాలు మాట్లాడ కుండా రాజకీయ ఘర్షణ వైఖరితో కేంద్రాన్ని విమర్శిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఇది సరికాదన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన రెండు బిసి బిల్లులు గవర్నర్ ఆమోదించడం కాని, తిరస్కరించడం కాని చేయలేదన్నారు. కోర్టులు కూడా బిసి రిజర్వేషన్లు వ్యతిరేకంగా ఉన్నాయని వాదన కూడా వినపడుతుందని, అలా అయితే, దీనిపై న్యాయ పోరాటం చేయాల్సిందన్నారు. 42శాతం బిసి రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్ని కలు నిర్వహించనిపక్షంలో యుద్ధం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమరగాని వంశీ, మండవ వీరబాబు, రెస్ సైదులు బీసీ నాయకులూ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు

విద్యార్థులను ఇబ్బందిపెడితే సహించేది లేదు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** విధిగాలతో విద్యార్థులపై ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుక్రవారం కలుషిత మంచినీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆయన శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లా డారు. పాఠశాలలో జరుగుతున్న అనేక విషయాలను విద్యార్థులు వెల్లడించారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యా యుడు రాజేందర్ మంచినీటిలో మోనో పురుగుల మందు కలపడంతో ఆ నీటిని తాగి అస్వస్థతకు గురయ్యామని తెలిపారు. ఉపాధ్యాయులు తమను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇష్టం వచ్చినట్టు కొడుతున్నారని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మధ్య తరచూ జరుగుతున్న గొడవలే దీనికి కారణమని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాల సైన్స్ టీచర్ రాజేందర్ మంచినీటి ట్యాంకులో మోనో పురుగుల మందు కలిపి అనుమానం రాకుండా చేసేందుకు అంతరం దాన్ని విద్యార్థుల దుప్పట్ల చల్లారని తెలిపారు. అది చూసిన విద్యార్థులను బెదిరించి ఈ విషయం బయటికి చెప్పొద్దని ఎవరికి చెప్పొద్దని హెచ్చరించాడని తెలిపారు. రాజేందర్ ఎవరికి అనుమానం రాకుండా అస్వస్థత గురైన విద్యార్థులతో పాటు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందు తున్నాడని తెలిపారు. సంబంధిత ఉపాధ్యా యులను, వంట మనిషిని సస్పెండ్ చేయడంతో పాటు చట్ట పరంగా కఠిన చర్యలు తీసు కుంటామని ఎమ్మెల్యే తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన అణగారిన పేద కుటుంబాల విద్యార్థులను తల్లిదండ్రులు చదివించి వింపుకోవాలన్న ఉద్దేశంతో వసతి గృహాల్లో ఉంచు తున్నారని, పిల్లలపై ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమి నల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల కేజీ బీవీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఎస్ఓ కు పరిక విభేదాల కారణంగా విద్యార్థులను ఇబ్బంది దుకు గురి చేస్తున్నారని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మంచినీటిలో పురుగుల మందు కలిపిన ఉపాధ్యాయుడు రాజేందర్ తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మని షి రాజేశ్వరి ని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇలాంటి ఘటనలకు పాల్ప డితే ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తా మని హెచ్చరించారు. ప్రతి హాస్టల్ ను ప్రత్యే క అధికారులు, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేసి విద్యార్థులతో ముఖాముఖి కావాలని, వారి సమస్యలకు చర్యలు తీసుకోవాలన్నారు.

# లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

-ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్ రమేష్‌బాబు అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్, వివాహ ,కుటుంబ తగాదా కేసులు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కేసులు పరిష్కరించుటకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న తమ తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్క రించుకొని లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కోర్టులలో లేని కేసులను ప్రీ-లిటిగేషన్ ద్వారా న్యాయసేవాధికార సంస్థ లో పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, ఎక్కువ కేసులు పరిష్కరించుటకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఏ.నాగరాజ్ , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , ఏ.ఎస్.పి. ఏ. నరేష్ కుమార్, కాటారం డి.ఎస్.పి. సూర్యనారాయణ, సి.ఐ.లు, ఎస్సైలు పాల్గొన్నారు.

**న్యాయవాదులను అభినందించిన న్యాయమూర్తి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ నుండి మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన తొమ్మిది మంది న్యాయ వాదులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్ బాబు అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన న్యాయవాదులు మధ్యవర్తిత్వ ప్రధాన న్యాయ మూర్తిని శనివారం కలిశారు. కేసుల్లోని ఇరువర్గాల సమ న్వయ పరచి కేసుల పరిష్కారానికి కృషిచేయాలని వారికి సూ చించారు.జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ.నాగరాజ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, న్యాయవా దులు ఆనందరావు, కవిత, రాజ్ కుమార్, శివ కుమార్, రవీందర్, రమేష్, రవి కుమార్ , సంధ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**మహాముత్తారం, ఆగస్టు 23 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు మండల యువ నాయకులు లక్కిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. మహాముత్తారం మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హాట్కార్ తీత్రి బాయి, పర్శ దుర్గమ్మ,పెరుమాండ్ల సమ్మయ్య కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మందల రాజిరెడ్డి,మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామి ,పార్టీ కన్వీనర్ మార్క రామ్ గౌడ్ , పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెల్మరెడ్డి అనిల్ రెడ్డి . మండల ఆదికార ప్రతినిధి బోడ బాలాజి,మండల యువ నాయకులు పంగ సంపత్ , నర్సింగాపూర్ యూత్ అధ్యక్షులు ఉమ్మల్ల రత్నాకర్ ,మాజీ హనుమాన్ దేవాలయ చెర్మన్ గంట దేవేందర్ రెడ్డి , తైనేని సారయ్య ,ఎండీ ఫెరోజ్ ,రాగం బాపు ,గోపిరెడ్డి బాపు, జక్కుల చెంద్రు , మంచినీళ్ల సన్నీ పాల్గొన్నారు.

# విద్యార్థులు ఎన్‌సిసి కోర్సును సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ ఆగష్టు 23(నినాదం న్యూస్ ) :** డిగ్రీ విద్యార్థులు ఎన్ సిసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ) కోర్సును సద్వినియోగం చేసుకోవాలని సీకేఎం గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి అన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సి.కె.ఎం కళాశాల ఎన్ సిసీ ఆర్మీ పదవ బెటాలియన్ ఆధ్వర్యంలో 2024-2025 ఎన్ సిసీ ప్రవేశాలు నిర్వహణలో దాదాపు 105 మంది వరకు సెలక్షన్ లో పాల్గొనడం జరిగిందన్నారు. విద్యార్థులకు మొదట ఎత్తు, బరువు, రన్నింగ్, సెట్ అప్స్, పుష్‌అప్స్ మెడికల్ ఎగ్జామ్ నకు సంబంధించినటువంటివి మరియు రాత పరీక్ష ద్వారా ఎంపిక నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్ సిసీ ద్వారా యువతను దేశభక్తి, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే ఎన్ సిసీ బి మరియు సి సర్టిఫికెట్స్ భవిష్యత్తులో ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలకు సంబంధించినటు వంటి ఉద్యోగాలకు , పై చదువులు చదువుకునే వారికి ఈ సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగపడతా యన్నారు. విద్యార్థులు ఎన్ సిసీ లో చేరి మీ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఎన్ సిసీ సర్టిఫికెట్స్ ద్వారా భారత ఆర్మీలో చేరి దేశ సేవ చేయడానికి మరియు అన్ని రంగాలకు సంబంధించినటు వంటి పోటీ పరీక్షల్లో ప్రత్యేక రిజర్వేషన్ లు ఉంటాయన్నారు. ఎన్ సిసీ లో ఎంపికైనటువంటి విద్యార్థిని ,విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్నల్ ఎస్ఎస్ రామదురై, కెప్టెన్ డాక్టర్ పూజారి సతీష్ కుమార్, డాక్టర్ ఆయేషా, డాక్టర్ జైపాల్ రెడ్డి, మమత, సుమన్, సూపరిండెంట్ శ్రీనివాస్, శేషనారాయణ, కమలాకర్, సీనియర్ క్యాడేట్స్ తాజుద్దీన్, టోనీ, ప్రణయ్, నందిని, తేజోమయి, అక్షయ, హస్మ తదితరులు పాల్గొన్నారు.


## న్యాయం చేయాలని వృద్ధురాలి నిరసన



**నల్లబెల్లి ఆగస్టు 23 (నినాదం):** తన కొడుకు పెన్షన్ పేరుతో తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని ఓ వృద్ధురాలు నిరసన చేపట్టింది. శనివారం వరంగల్ జిల్లా నలబెల్లి మండల కేంద్రంలో లద్దునూరి సూరమ్మఅనే వృద్ధురాలు స్థానిక బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేసింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లద్దునూరి యుగేందర్‌పై ఆయన తల్లి సూరమ్మ ఆరోపణ చేసింది. తన కొడుకు కోడలు కలిసి పెన్షన్ పేరుతో భూమిని అక్రమంగా రిజిస్టేషన్ చేసుకున్నాడని వాపోయింది. తన హక్కులను కాపాడి న్యాయంచేయాలని ఆమె జిల్లా కలెక్టర్‌కోరింది. వృద్ధురాలి నిరసనకు స్థానికులు పర్కి కోర్నెల్ రవి తదితరులు మద్దతు తెలిపారు.

## అటెండెన్స్ ఉంటేనే విద్యార్థులు బోర్డ్ పరీక్షలకు అర్హులు

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య



**మహాదేవపూర్ ఆగస్టు 23,( నినాదం):** కళాశాలలో 75శాతం అటెండెన్స్ ఉంటేనే ఇంటర్మీడియట్ బోర్డ్ పరీక్షలకు విద్యార్థులు అర్హులవుతారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నర్సయ్య తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. కళాశా లలో విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు ద్వారా విద్యార్థుల హాజరు పర్యవేక్షణ జరుగుతున్నదని, విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా వస్తేనే బోర్డు ఎగ్జామ్ లు వ్రాయగలు గుతారని ఆయన వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇది గమనించి విద్యార్థులను ప్రతిరోజు కళాశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్తంభించిన బ్యాంకు ఖాతాలు తిరిగి ఆక్టివేట్ చేయించుకోవాలి



**కోదాడ,ఆగస్టు 23 (నినాదం):** చిలుకూరు మండలం కొండాపురం, నారాయణపురం గ్రామాలలో నిర్వహించినటు వంటి బ్యాంక్ ఎకౌంట్ రీ కేవైసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్బిఐ ఎల్డిఓ గోమతి, ఎస్బిఐ ఆర్ ఎం అనిల్ కుమార్, సూర్యాపేట జిల్లా ఎల్ డి ఎ వెంకట నాగ ప్రసాద్, బేతవోలు ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ లాల్ సింగ్, టీజీబీబీ మేనేజర్ శ్రీనివాస్, పాల్గొని గతంలో తీసుకున్నటు వంటి బ్యాంక్ ఖాతాలు స్తంభించి ఉంటే తిరిగి వాటిని యాక్టివేట్ చేయించుకోవాలని గ్రామంలోని ఖాతాదారులను కోరారు. ఈ రీ కేవైసీ కొరకు బ్యాంకును సంప్రదించవలసిన అవసరం లేదని ఆయా గ్రామంలో ఉన్న సి ఎస్ పి సెంటర్ లలో కూడా చేసుకోవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు కార్తీక్ రెడ్డి, కవిత, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్స్ సిహెచ్ సతీష్,అశోక్, .సత్యనారాయణ, సి ఎస్ పి సెంటర్ వారు, గ్రామ ప్రజలు, ఎస్ హెచ్ జి వారు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి సన్నిధిలో

## మహా మృత్యుంజయ హోమం



**కోదాడ, ఆగస్టు 23(నినాదం):** తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధిలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రసార సమితి జాతీయ విభాగం నిర్ణయం మేరకు ప్రతి అమా వాస్య సందర్భంగా నిర్వహించే మహా మృత్యుంజయ హోమం శనివారం నిర్వహించారు. అప మృత్యుభయం, సమస్త దోషాలు,తొలగి ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని హోమం నిర్వ హించినట్లుగా ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. హోమంలో పాల్గొన్న దంపతులు కొండపల్లి కిషన్ రావు చండి రాణి దంపతులు, గాదం శ్రీను గరిడేపల్లి ఉపేం దర్, యాగ్నిక స్వామిఅర్చకులు నాందాచార్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**మహాదేవపూర్ ఆగస్టు 23, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అన్నారం లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రత్న మల్లక్క ఇంటిలో షార్ట్ సర్క్యూట్ తో మంట లేవగానే గ్రామస్తులు ఫైర్ డిపార్ట్మెంట్ కు ఫోన్ చేయగా వారు వచ్చేవరకు ఇల్లు దగ్ధమైందని, ఇంటిలో ఉన్న 50000 వేల రూపాయల నగదు తో పాటు నిత్యవసర వస్తువులు దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. అధికారులు స్పందించి వెంటనే తనను ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## దివ్యాంగులకు ఉపాధి కల్పన కోసం మంజూరైన పత్రాలను అందజేసిన ఎంపీడీవో



**మిర్యాలగూడ ఆగస్టు 23( నినాదం)** మండల సమైక్య కార్యాలయంలో మండ ల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పన పై అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు శనివారం ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో శేషగి రి శర్మ హాజరై దివ్యంగా అభ్యర్థులకు బెన్ఫిషరీ గ్రాంట్ పత్రాలను అందించారు అనంతరం శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశిం చి మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు అదేవి ధంగా దివ్యాంగులు ఎవరిపై ఆధార పడకుండా స్వయంగా తమ వ్యాపారాన్ని తామే చేసుకునే విధంగా దోహదప డుతుందన్నారు రెడ్డీస్ ల్యాబ్ ఫౌండేషన్ వారు దివ్యాంగుల స్వయం ఉపాధి కల్ప న కొరకు మండలాన్ని యూనిట్గా తీసు కొని వివిధ గ్రామాల నుండి అర్హులైన 16 మంది దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేసి వారు వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందడానికి ఒక్కొక్క అభ్యర్థికి 25వేల రూపాయల విలువచేసే కుట్టు మిషన్లు పిండి మిల్లులు మరికొన్ని యూనిట్లను డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ వారు అందించడం చాలా అభినందించారు.

## సిపిఎస్ రద్దు కోసం తహసీల్దార్ కు వినతి

**చింతపల్లి, ఆగస్టు 23( నినాదం):** సి పి ఎస్. ను రద్దు చేయాలని కోరుతూ మండల తపస్ శాఖ ఆధ్వర్యంలో ఆ సంఘ మండల అధ్యక్షులు సొనగంటి వేణుగోపాల్ శనివారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23 వ తేదీ ని పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తున్నామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇది చీకటి రోజు అన్నారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగులకు సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ నేలంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రజలతో ముచ్చటించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**డోర్నకల్/మరిపెడ ఆగస్టు 23(నినాదం న్యూస్):** మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మరిపెడ మండల కేంద్రంలో ఓ టీ స్టాల్ వద్ద ఆగి టీ తాగారు..కురవి వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన టీ తాగుతూ పార్టీ నేతలు,మీడియా మిత్రుడు విష్ణుతో ముచ్చటించారు.. సత్యవతి రాథోడ్ కనిపించడంతో,చూడడానికి వచ్చిన ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు..ఎవరు అధైర్య పడవద్దని అందరికీ అండగా ఉంటానని, భవిష్యత్తులో మంచి రోజులు వస్తున్నాయన్నారు..

## వ్యక్తిగత ప్రమాద బీమా చెక్కులు అందజేత

-20 లక్షల చెక్కును అందజేసిన బ్యాంకు అధికారులు



**కోదాడ,ఆగస్టు 23 (నినాదం):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బ్యాంకులు కల్పిస్తున్న ఇన్సూరెన్స్ లను సద్విని యోగం చేసుకోవాలని ఎస్బిఐ ఆర్ ఎం అనిల్ కుమా ర్, సూర్యాపేట జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకట నాగ ప్రసాద్ అన్నారు. శుక్రవారం అనంతగిరి మండల కేంద్రానికి చెందిన బండి వెంకట రామయ్య(38), ఎస్బిఐ వారు తీసుకొచ్చి నటువంటి వ్యక్తిగత ప్రమాద బీమా ద్వారా 1000/- రూపాయల ప్రీమియం కట్టుకున్నారు. మూడు నెలల క్రితం వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు మరణించారు వారి యొక్క కుటుంబానికి 2,00,0000- రూపాయల విలువైన చెక్కును ఎస్బిఐ ఆర్‌ఎం అనిల్ కుమార్, సూర్యాపేట జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగప్రసాద్, అందజే. అనంతగిరి ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్, కోదాడ జిపి కాంప్లెక్స్ మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

## వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డిఓ

**కోదాడ,ఆగస్టు 23(నినాదం):** కోదాడ పట్టణంలోని ఎస్టీ విద్యార్థుల వసతి గృహాన్ని శనివారం కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించినట్లుగా ఆర్డీవో తెలిపారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. మధ్యాహ్నం సమయంలో వారితో కలిసి సహాపంక్తి భోజనం చేస్తూ..హాస్టల్స్‌లోని మౌలిక సదుపాయా లు, భద్రత అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు.

## జర్నలిస్ట్ సత్యనారాయణ మాతృమూర్తి ఆకాల మరణం బాధాకరం



**కోదాడ,ఆగస్టు 23(నినాదం):** కోదాడ మండలం యర్రవరం గ్రామంలో జర్నలిస్టు సత్యనారాయణ మాతృమూర్తి బుర అనసూయమ్మ అకాల మరణం బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం గ్రామంలో అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలవేసి మల్లయ్య యాదవ్ నివాళు లర్పించారు. అనంతరం సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అనంతగిరి మండల అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బూర లక్ష్మీనారాయణ, కొండ అంజయ్య ,పెండం శ్రీనివాస్ గౌడ్ ,బెల్లంకొండ నాగయ్య, కొండయ్య వీరయ్య, భానుచందర్ ,లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

-ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 23( నినాదం):** గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు శనివారం మిర్యాల గూడ పోలీస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవ శాంతి సంఘ సమావే శంలో మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజక వర్గ వ్యాప్తంగా ప్రజలందరు ఆహ్లాద వాతావర ణంలో భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు జరుపు కోవాలని కోరారు. అలాగే రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిం చారు .అన్ని కులాలు, మతాలు కలిసి మెలసి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.. సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ , కాం గ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో

## డిజే సౌండ్ వాడితే చర్యలు



**చింతపల్లి, ఆగస్టు 23( నినాదం)** రానున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా డిజే సౌండ్ సిస్టమ్ ను ఏర్పాటు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ రాజు హెచ్చరించారు.మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో శనివారం నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలని ఆయన సూచించారు. గణేష్ మండపాల వద్ద విధిగా అయిదుగురు కాపలా ఉండాలని, మండపాల ఏర్పాటు సమయంలో విద్యుత్తు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తాము ఉత్సవాలను నిర్వహించే ప్రాంతము వివరాలతో పాటు నిమజ్జనం చేసే ప్రాంత వివరాలను తెలియజేయాలని తెలిపారు. అదేవిధంగా విగ్రహ ఏర్పాటు కోసం ఆన్లైన్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా డిజె సౌండ్ సిస్టం కు సంబంధించిన 11 మందిని బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.ఎస్సై ముత్యాల రామ్మూర్తి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా సంక్షోభం

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బధనాంచేయడానికి రాజకీయ కుట్ర

### జిల్లాలో యూరియా కొరత లేదు

### రైతులు అధైర్య పడవద్దు

### అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### కేంద్రం కుట్ర, బిఆర్ ఎస్ రాజకీయంతోకావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తోంది

### ఎమ్మెల్యే విజయ రమణారావు



**సుల్తానాబాద్, ఆగస్ట్ 23(నినాదం):** యూరియా సంక్షోభం.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి రాజకీయ కుట్ర చేస్తున్నారని పెద్దపల్లి శాసన సభ్యుడు చింతకుంట విజయ రమణారావుకేంద్ర ప్రభుత్వం,బీఆర్ఎస్ పై ధ్వజమెత్తారు.రైతులు అధైర్య పడొద్దు,అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని అభయం ఇచ్చారు. శనివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం పంటలకు సరిపడా యూరియా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ సాగు పంటను అంచనా వేసి సింగిల్ విండో ఫర్టిలైజర్ల ద్వారా రైతులకు యూరియాను అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడ ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎ న్ డి ఏ లో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి యూరియాను అందించ డంలో వైఫల్యం చెందారని ఎద్దేవా చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 76, వేల పై చిలుకు పంట లు సాగుబడి అవుతోందని 28 లక్షల ఒక వంద 9 5 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని అన్నారు. జిల్లా లో 2లక్షల 50 వేల ఎకరాలు సాగు జరుగుతుందని,మరో15 వేలఎకరాలు వరినాట్లు వేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా మంత్రి శ్రీధర్ బా బు సహకారంతో 21 వేల 581 మెట్రిక్ టన్నుల యూరియా మార్కెట్లో ఉందని,కొత్తగా వేసే సాగు బడికి 65 టన్నుల యూరియా అవసరము పడు తుందనితెలిపారు.రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ 78 రోజులుగా మూతపడి ఉందని దానిని తెరిపిం చే బాధ్యత కేంద్రప్రభుత్వానికి లేదాఅని ప్రశ్నించా రు. తెలంగాణకు నష్టం జరుగుతోందని ఎంపీలు పార్లమెంటులో ప్రశ్నించిన స్పందించడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపీలు,వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి యూరియా అందించాలని అ డిగిన కేంద్రం స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు.కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ లు ఏమి మాట్లాడుతున్నారో అర్థం అయ్యే పరిస్థి తి లేదని పేర్కొన్నారు.బిఆర్ఎస్పార్టీ నాయకులు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడే మాటల్లో స్పష్టత లేదని,యూరియా ఇచ్చిన వారికి మద్దతిస్తామని తెలపడంసిగ్గుచేటని,యూరియా కృత్రిమ కొరత సృష్టించేదిబిఆర్ఎస్ నాయకులు అని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అ ధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమి టీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్,మండల అధ్యక్షుడు సతీష్, కిసా న్ సెల్ మండలఅధ్యక్షుడుపన్నాల రాములు, కాం గ్రెస్ శ్రేణులుదామోదర్ రావు, సాయిరి మహేంద ర్,గాజుల రాజమల్లు,అమీర్ శెట్టి రాజలింగం, తి రుపతి,ముత్యాల రవీందర్,పల్ల సురేష్, కల్లెపల్లి జానీ,దున్న పోతులరాజయ్య,రఫీక్, తోర్రికొండ ప్రభాకర్,అమీనోద్దీన్,విష్ణు,కోట శ్రీనివాస్,న్యాతరి దేవేందర్ తోపాటు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు కోసం తహసీల్దార్‌కు వినతి



**చింతపల్లి, ఆగస్టు 23(నినాదం):** సి పి ఎస్. ను రద్దు చేయాలని కోరుతూ మండల టీపీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆ సంఘ మండల అధ్యక్షులు సోమగంటి వేణుగోపాల్ శనివారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23 వ తేదీ ని పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తున్నామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇది చీకటి రోజు అన్నారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగులకు సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ నేలంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 26న విదేశాల్లో ఉపాధి అవకాశాల పై అవగాహన

### -ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా పరిశ్రమల అధికారి ఏ.కీర్తి కాంత్

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు23(నినాదం):** విదేశాలలో ఉపాధి అవకాశాల కోసం ఆగస్టు 26న కలెక్టరేట్ లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా పరిశ్రమల అధికారి ఏ.కీర్తి కాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా రాష్ట్ర యువతకు సురక్షితమైన చట్టబద్ధమైన విదేశీ ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని అన్నారు. టామ్ కామ్ విదేశీ నియామకదారులతో అనుసంధానం చేసి, అవసరమైన డాక్యుమెంటేషన్, శిక్షణ, ప్లేస్‌మెంట్ వంటి సదుపాయాలు అందిస్తోందని తెలిపారు. జపాన్ లో ప్రస్తుతం నర్సింగ్ కేర్ 14.16 లక్షల వార్షిక ప్యాకేజీ, జర్మనీ లో ఎలక్ట్రీషియన్ 32.76,34.80 లక్షల వార్షిక ప్యాకేజీ, ఇజ్రాయెల్ లో కన్‌స్ట్రక్షన్ వర్కర్ 19.20 లక్షల వార్షిక ప్యాకేజీ, ఫిజీ, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ సర్వీస్ టెక్నీషియన్ 6.10 లక్షల వార్షిక ప్యాకేజీ, హౌస్‌కీపింగ్, యుఏఈ ఎలక్ట్రీషియన్, మేసన్ 12 లక్షల వార్షిక ప్యాకేజీ, ఇతర అవకాశాలు పోర్చుగల్, యుఏఈ వంటి దేశాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 26న పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో టామ్ కామ్ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాల పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకొని టామ్ కామ్ లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. టామ్‌కామ్ దరఖాస్తు చేసుకోవడానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, గది నం.231 ఆగస్టు 26 వరకు సంప్రదించాలని జిల్లా పరిశ్రమల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎస్బిఐ బ్యాంకులో జరిగిన భారీ స్కాంలో సూత్రధారి క్యాషియర్ రవీందర్

### -ఈ భారీ స్కాంలో మొత్తం పది మంది పై కేసు నమోదు చేసిన చెన్నూర్ పోలీసులు



**చెన్నూర్ ఆగస్టు 23 (నినాదం న్యూస్):** చెన్నూరు పట్టణంలో స్థానిక గ్రామ ప్రజలకు నమ్మకమైన బ్యాంక్ అంటే అది ఎస్బిఐ మాత్రమే అందులో కష్టపడి సంపాదించిన ఒక్కొక్క రూపాయి జమ చేసి పెట్టుకున్న బంగారు ఆభరణాలను దొంగిలించడంతో అదీ కూడా అందులో పని చేసే క్యాషియర్ రవీందర్ అని తెలియడంతో బ్యాంకు పై నమ్మకం కోల్పోతున్న ఖాతాదారులు అంతేకాకుండా పట్టణంలోని మెయిన్ బ్రాంచ్ లో కూడా అధికారులతో తనిఖీలు నిర్వహించాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గల ఎస్బిఐ రెండవ బ్యాంకులో జరిగిన భారీ స్కాం లో గల్లంతైన బంగారం మరియు నగదు ప్రధాన సూత్రధారి బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న క్యాషియర్ రవీందర్ అని చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్ రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి పట్టణంలో ఎంతో సెన్సేషనల్ గా మారిన బ్యాంకు స్కాం లో లావాదేవీలలో మరియు కుదువపెట్టిన బంగారు ఆభరణాలలో తేడా ఉండటంతో బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బ్యాంకులో 12 కోట్ల 60 లక్షల బంగారంతో పాటు 1 కోటి 10 లక్షల నగదు స్కామ్ జరిగినట్లు బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఆడిట్ నివేదిక ప్రకారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సిఐ దేవేందర్ రావు తెలిపారు. ఈ భారీ స్కాం లో ప్రధాన సూత్రధారి బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న క్యాషియర్ [illegible] గ్రామానికి చెందిన రవీందర్ ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుడు గత మూడు రోజుల నుండి పరార్ లో ఉన్నాడని ఉన్నత అధికారుల పర్యవేక్షణలో అతనిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అతనితోపాటు మరో 9 మంది కోడంగి బిరేష్, నరిగే సరిత, నరిగే స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కోదాటి రాజశేఖర్, గౌడ సుమన్, ఏసంపల్లి సాయికిరణ్, ఎల్ సందీప్, మోత్కూరి రమ్య ఉన్నట్టు సమాచారం,అనుమానితులపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఖాతాదారులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిందితున్ని అతి త్వరలోనే పట్టుకొని కోర్టు లో హాజరు పరిచి ఖాతాదారులకు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో డివిజన్‌లో యూరియా కొరత లేదు

### కిసాన్ సేల్ జిల్లా అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి



**మంథని టౌన్ ఆగస్టు 23 (నినాదం):** రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని డివిజన్ లో యూరియా కొరత లేదని కిసాన్ సేల్ జిల్లా అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మంథని డివిజన్ లోని ప్రాథమిక సహకార సంఘాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సురేందర్ రెడ్డి తెలిపారు. యూరియా బస్తాల కోసం వచ్చే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ పత్రాలను తమ వెంట తీసుకురావాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో రైతులకు యూరియా కోసం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియా నిల్వలు సరిపడ ఉన్నాయన్నారు. రైతులు ఏమాత్రం అధైర్య పడవద్దని, రైతులకు యూరియా కొరత లేకుండా వ్యవసాయ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కొందరు కావాలని యూరియా నిల్వలు లేవని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, యూరియా కావలసిన రైతులు సహకార సంఘం లో సంప్రదించగలరని కోరారు. యూరియా మంథని నుంచి అక్రమంగా తరలిపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## వర్క్ షాప్‌ను సందర్శించిన విద్యార్థులు



**మంథని టౌన్ ఆగస్టు 23 (నినాదం):** మంథని పట్టణం లోని టీ వర్క్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న డ్రీమ్ స్టార్ట్ రైజ్ వర్క్‌షాప్‌ను శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగావిద్యార్థినులు ఆధునిక పరికరాలు, ప్రోటో టైపింగ్ ప్రక్రియలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రత్యక్షంగా వీక్షించారు. వర్క్‌షాప్ నిర్వాహకులు విద్యార్థినులకు ఆవిష్కరణ, సృజనాత్మకత, సాంకేతిక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ఇలాంటి ఫీల్డ్ విజిట్లు బాలికల్లో ఆత్మవి శ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు ప్రేరణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థినులు కూడా ఈ సందర్శన తమకు కొత్త అనుభవాన్ని కలిగించిందని, సాంకేతిక రంగంపై ఆసక్తి పెరిగిందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలతో పాటు అధ్యాపకులు ఝాన్సీ, శ్రీధర్ రావు, తిరుపతి,నగేష్, ఎల్ ఆర్ కే రెడ్డి,సవిత, మౌనిక, దీపారాణి, సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ , జడ్జి కే స్వప్న




**సుల్తానాబాద్ ఆగస్టు 23(నినాదం):** సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టేందు కు ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవా లని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జ్ స్వప్న రాణి పిలుపునిచ్చారు.శనివారం సుల్తానా బాద్ మండలకేంద్రంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకుఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి స్వప్న రాణి మాట్లాడుతూ, ఉన్నత న్యాయస్థానాలు అందరికీ న్యాయం జరగాలన్న ఉద్దేశంతో అన్ని కోర్టుల్లో లీగ ల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా న్యాయవిజ్ఞాన స దస్సు నిర్వహిస్తూ చట్టాలపై అవగాహన కల్పిస్తు న్నామన్నారు. అన్యాయం జరిగిన వెంటనే లీగల్ సర్వీసెస్అథారిటీని సంప్రదిస్తేఉచితంగాన్యాయం అందిస్తారని తెలిపారు.యువత చెడు వ్యసనాల కు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశ నం చేసుకోవద్దన్నారు, చదువుతూనే ఏదైనా సా ధించవచ్చు నన్నారు.మైనర్లు వాహనాలు నడప రాదని, నడిపి ప్రమాదానికి కారణమైతే వారి తం డ్రులను జైలుకు పంపుతారనితెలిపారు.వాహనా ల చట్టం , సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ చట్టంపై పలువురు న్యాయవాదులు విద్యార్థులకు అవగా హన కల్పించారు.ఈ కార్యక్రమంలో న్యాయవా దులు టి నరేష్ పటేల్ , ఆర్ ఝాన్సీ, శరత్ తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం వి ద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హీమోఫీలియాను భరిస్తూ గణితంలో పిహెచ్‌డి అద్భుతం సాధించిన ఏర్ల శ్రీనివాస్



**క్యాతనపల్లి, (నినాదం) :** రక్తం గడ్డకట్టే లోపంతో బాధపడ్డ ఆ యువకుడు ఏనాడూ కుంగిపోలేదు. చదువులో రాణిస్తూ ఏకంగా గణితంలో ఉస్మానియా యూనివర్సిటీ నుండి పి హెచ్ డి పొందాడు. ఏ చిన్న గాయమైనా తీవ్ర రక్తస్రావం అయ్యే పరిస్థితిలో కూడా ఏండ్ల తరబడి చదువులో ఆయన పడ్డ శ్రమకు అద్భుతమైన గుర్తింపు లభించింది. కాసిపేట గనిలో ట్రామర్ గా పనిచేసిన ఏర్ల కనకయ్య రెండవ కుమారుడు శ్రీనివాస్ పదో తరగతి వరకు మందమర్రి లో చదివి, కాలేజీ విద్యను మంచిర్యాల లో పూర్తి చేసి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉస్మానియా యూనివర్సిటీలో (2012) పూర్తిచేసారు. CSIR-JRF ఉత్తీర్ణత ( 2018) సాధించి దానిద్వారా ఫెలోషిప్ తో పీహెచ్డీ టైటిల్ Numerical Study of a Class of Singularly Formed Differential Equations ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో డిఆర్డిఓ చైర్మన్ నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కుమార్ ల చేతుల మీదుగా పీ హెచ్ డీ పట్టా ను అందుకున్నారు. కాగా శ్రీనివాస్ కు 11 సంవత్సరాల వయస్సులో 2001 హిమోఫిలియా ఉన్నట్లుగా హైద్రాబాద్ లోని నిమ్స్ లో నిరారణ అయింది.దానికి వైద్యులు తగు జాగ్రత్తలు సూచనలు చేశారు, కొన్ని రోజులు వరకు సింగరేణి కూడా ఈ వైద్యానికి సేవలు అందించింది.ఈ వ్యాధి వల్ల తలలో, నడుములో, శరీర అన్ని భాగాల్లో రకరకాల రక్తస్రావాలని కూడా ఎదుర్కొన్నాడు, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైనప్పుడల్లా ట్రీట్మెంట్ తీసుకుంటూ ఫిజియోథెరపీ చేస్తూ జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. జీవిత భాగస్వామి, తల్లిదండ్రులకు,కుటుంబ సభ్యులకు, బంధువులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడ్డ ప్రతి ఒక్కరికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలుపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు23(నినాదం)** ఆగస్టు 29న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి లో ఖాళీగా ఉన్న 2 సివిల్ సర్జన్ స్పెషలిస్ట్,1 గైనకాలజిస్ట్,1 ఆర్థోపెడిక్స్,మంథని సామాజిక ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 1 గైనకాలజిస్ట్ పోస్టు,సుల్తానాబాద్ లో ఖాళీగా ఉన్న 1 పిడియాట్రీషియన్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆగస్టు 29న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు.ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని,సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయల వేతనం ఉంటుందని , ఇతర వివరాల కొరకు 8499061999, 949 1481481 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

### కళాశాల చైర్మన్ డాక్టర్ లయన్ రేకులపల్లి విజయ

### శ్రీవాణి జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే సంబరాలు



**సుల్తానాబాద్, ఆగస్ట్ 23(నినాదం):** చదువుతూనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వి ద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లి తల్లిదండ్రులకు కళా శాలకు పేరు తీసుకురావాలి అని శ్రీవాణి కళాశా ల అధినేత డాక్టర్ లయన్ రేకులపల్లి విజయ పిలుపునిచ్చారు.శనివారంసుల్తానాబాద్ మండలం నర్సయ్య పల్లి గ్రామంలోని విజయ ఏ సి ఫంక్షన్ హాల్లో శ్రీవాణి జూనియర్ కళాశాల ఫ్రె షర్స్ డే సం బరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ లయన్ డాక్టర్ రేకుల పల్లి విజయ మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకుండా శ్రద్ధగా చదివి తల్లి తల్లిదండ్రులకు కళాశాలకు పే రు తీసుకురావాలని కోరారు. అనంతరం శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుపతి మాట్లాడు తూ, విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా కష్టపడి చది వి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ బాలసాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ,కళాశాల విద్యార్థులు సాధించిన మా ర్కులు తెలియజేస్తూ టాపర్లకు ముఖ్య అతిథి డా క్టర్ రేకులపల్లి విజయ మేడం చేతుల మీదుగా బ హుమతులు ప్రధాన చేయించారు. ఈ విద్యా సంవత్సరం వివిధ కళాశాలలో ఇంజనీరింగ్ సీట్లు సా ధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్ర మంలతో ఆహుతులను అలరించాయి.ఈ కార్యక్రమంలోశ్రీవాణి డిగ్రీ పీజీ ప్రిన్సిపల్ బండారి కమలాకర్,అధ్యాపక బృందంవిద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ సమస్యల పై మంత్రి వాకిడి శ్రీహరిని కలిసిన జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి



**మంథని టౌన్ ఆగస్టు 23 (నినాదం):** హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిడి శ్రీహరి ని పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పోతరవేని క్రాంతి కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి మత్స్యశాఖ సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఇప్పటికే ఆలస్యం అయినా ఉచిత చేప పిల్లలను త్వరితగతిన నాణ్యమైన సైజ్ గల చేపపిల్లలను పంపిణీ చేయాలని, అదే విధంగా మత్స్య కార్మికులకు కొత్త పథకాలను పెట్టి వారికి అండగా నిలవాలని మంత్రి ని కోరగ దానికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం రూ. 123 కోట్ల రూపాయలు విడుదల చేస్తుందని, ఈ సంవత్సరం నుండి వీలైనంత త్వరగా నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేస్తామని, అలాగే మత్స్యకార్మికులకు నూతన పథకాలకు రూపకల్పన చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని క్రాంతి కుమార్ తెలిపారు.

## సాంప్రదాయ పద్ధతిలో పొలాల అమావాస్య పండుగ



**ఆసిఫాబాద్ ,ఆగస్టు 23 (నినాదం న్యూస్):** ఐ.టి.డి.ఎ. పరిధిలో సాంప్రదాయ పద్ధతిలో పొలాల అమావాస్య పండుగ జరుపుకోవాలని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం పొలాల అమావాస్య పండుగ సందర్భంగా ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడ గ్రామంలో నిర్వహించిన పండుగ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ పొలాల పండుగ ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వస్తుందని, పండుగను కుల, మత బేధాలు లేకుండా అందరు కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. రైతులు తమ ఎద్దులను అలంకరించి హనుమాన్ మందిరంలో పూజలు జరిపించి, నవధాన్యాలతో వంటకాలను ఎడ్లకు ప్రసాదం రూపంలో తినిపించడం జరిగిందని తెలిపారు.

## వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి






### ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

**ఆసిఫాబాద్ ,ఆగస్టు 23 (నినాదం న్యూస్)** ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ జూనియర్ కళాశాల(గురుకులం)ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, విద్య, వైద్యం, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధులు పట్ల సమయపాలన పాటించాలని, ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 23(నినాదం):** మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ మీట్ లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో సాంఘిక సంక్షేమ బాలుర (మంచిర్యాల) ముల్కాల పాఠశాల మరియు కళాశాల కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్ 14 విభాగంలో ఏ.నీరజ్ 9వ తరగతి(ట్రైయాతలాన్ ఏ)లాంగ్ జంప్ రజతం పథకం, 60 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, హై జంప్ రజతం పథకం, సాయి దినేష్ 9వ తరగతి ట్రైయాతలాన్ (బి)లో60 మీటర్స్ పరుగు పందెంలో రజతం పథకం, లాంగ్ జంప్ రజితం పథకం, షార్ట్ పుట్ బ్యాక్ త్రో కాస్యం పథకం.16 సంవత్సరాల విభాగంలో కే .జస్వంత్ 60 మీటర్స్ పరువు పందెంలో బంగారు పథకం,600 మీటర్స్ పరుగు పందెంలో రజతం పథకం ఏ. అరుణ్ కుమార్ లాంగ్ జంప్ రజితం పథకం, ఎస్ సుజిత్ లాంగ్ జంప్ కాస్యం పథకం క్రీడాకారులు సాధించారని ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్ తెలిపారు. శనివారం విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారులకు క్రీడల పట్ల కేంద్ర రాష్ట్ర స్థాయిలలో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేష్. వ్యాయామ ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీకాంత్, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం తొలగింపు



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 23(నినాదం):** మంచిర్యాల కార్పొరేషన్ నస్పూర్ వార్డు పరిధిలోని నస్పూర్ గేట్ వద్ద రోడ్డుపైన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనెల 4న నినాదంలో రోడ్డుపై స్తంభం.. రాకపోకలకు గండం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందిం చారు. విద్యుత్ స్తంభం తొలగించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

# పల్లెల ప్రగతి కోసమే పనుల జాతర

**గ్రామ గ్రామానికి సిసి రోడ్ల మంజూరు**
**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం**
**ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలి**
**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మారుమూల గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనుల జాతర కార్యక్రమాన్ని చేపట్టిందని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు మండలంలో బండరుపల్లి ఎస్సీ కాలనీ ప్రాంతంలో29 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, జాకరం ఎస్సీ ప్రాంతాలలో అంతర్గత సిసి రోడ్లు %ఽ% కాలువలు 58.50 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల కొరకు 30 లక్షల విలువ గల కొత్త మినీ బస్సు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మల్లంపల్లి మండలంలోని శ్రీనగర్ కొత్త గ్రామ పంచాయతీ భవనంతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సోప్‌పిట్‌లు, 10 లక్షలతో నిర్మించిన స్లాబ్ డ్రైనేజ్ కల్వర్టు, మల్లంపల్లిలో 15 లక్షలతో నిర్మించిన విలేజ్ హాట్‌ను మంత్రి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రధాన రహదారులను విస్తరణ పరచడం జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రంలోని ఇండ్లు లేని నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని, ఇండ్లు మంజూరు కానీ నిరుపేదలు ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. ప్రతి మహిళ మహిళా సంఘాల గ్రూపులో చేరి వడ్డీ లేని రుణాలను పొందడమే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు పొంది పలు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వేల కోట్ల రూపాయలతో పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అన్నారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం, రోడ్లు విస్తరణ పనులు చేపట్టడం ముఖ్యమంత్రి ఆదేశాలతో జరుగుతున్నాయని తెలిపారు. తాము ఇచ్చిన హామీ మేరకు మల్లంపల్లి గ్రామాన్ని జేడి మల్లంపల్లి మండలంగా ఏర్పాటు చేశామని అన్నారు. తాము అధికారికంగా ఆమోదం పొంది ఇచ్చిన హామీలను చూపిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని వివరించారు. ఈ సందర్భంగా 100 రోజుల ఈజీఎస్ పనులు పూర్తిచేసిన కూలీలను మంత్రి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్, డి ఆర్ డి ఓ శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి దేవ్ రాజ్, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అందాలను రూపుదిద్దుకోనున్న వెన్నెల జలపాతం

**రథం గుట్ట ప్రాంతాన్ని పరిశీలించిన**
**జిప్ లైన్ అడ్వెంచర్ బృందం**



**మణుగూరు ఆగస్టు 23 (నినాదం):** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా మణుగూరు మండలంలో వేయించి ఉన్న రథం గుట్ట అందాలు మరికొద్ది రోజుల్లో కమనీయంగా మారనున్నట్లుతెలుస్తుంది. మణుగూరు పట్టణ అందాలను సొగసి చూడ కనువిందు కలిగించే రథం గుట్టపై ఉన్నా వెన్నెల జలపాతం మరికొద్ది రోజుల్లో తమ అందాలను రూపు దిద్దుకోనున్నట్లు తెలుస్తుంది. వానొచ్చిన వరదొచ్చినా ఈ రథం గుట్టపై ప్రజలు తండోపాలుగా కదిలి వెళ్లి ఆ జలపాతాన్ని చూసి కనువిందు పరుచుకొని వెన్నెల జలపాతాన్ని తమ మదిలో స్మరించుకుంటూ తిరిగి వెళ్తారు. మణుగూరు పట్టణ అందాన్ని సౌందర్యాన్ని తమ కౌగిలిలో మలుచుకొని వరుణ్ దేవుడు కరుణించినప్పుడు రంగుల రంగుల జలపాతాన్ని కనువిందు కలిగే అందాలను మణుగూరు పట్టణ వాసులకు కల్పించడం వెన్నెల జలపాతం ముఖ్య కార్యక్రమం. ఈ వెన్నెల జలపాతం మానవ సృష్టి కాకుండా ప్రకృతి సృష్టించిన ఈ అందాల వెన్నెల జలపాతం రెండు కళ్ళ తో చూసిన తనివితీరని అందాలను వెదజల్లుతుంది. ఈ జలపాతాన్ని మరింత అందంగా తీర్చి దిద్దేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనలు మేరకు శనివారం ఉదయం జిప్ లైన్ అడ్వెంచర్ బృందం ఈ ప్రాంతంలోపర్యటించింది. అర కొరకగా వెన్నెల జలపాతానికి అభివృద్ధి పరిచేందుకు ముందుకు వచ్చిన అటవీ శాఖ అధికారులు ప్రధాన రహదారి నుంచి వెన్నెల జలపాతానికి రోడ్ మార్గం కల్పించి సందర్శకుల నుంచి టికెట్ రూపంలో ఆదాయాన్ని సమకూర్చింది. కానీ జలపాతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అక్కడున్న ఆర్థిక సామాజిక భౌగోళిక శాస్త్ర సాంకేతిక పరిస్థితులను అధ్యయనం చేసిన జిప్ లైన్ సంస్థ ఒక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధమైంది. వెన్నెల జల పాతం మణుగూరు కి తూర్పు దిక్కున ఎత్తైన కొండలపై నుంచి జారవిడుస్తున్న జలకలను భూమికి తాకెందుకు సూర్య కిరణాలను తమ కౌగిలిలో ఉంచుకొని రకరకాల రంగులను సందర్శకులను ఆహ్లాద పరిచే తత్వం వెన్నెల జలపాతానికి ఉంది. చుట్టూ కొండ ప్రాంతం దట్టమైన అడవి ప్రాంతాన్ని చుట్టుకొని చిక్కటి అడవుల మధ్య వెన్నెల జలపాతం తన అందాలను ప్రకృతిలో దాచుకుంది. ఈ వెన్నెల జలపాతాన్ని మరింత అభివృద్ధి పరిచి మణుగూరులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కి తలమానికంగా ఉండే విధంగా పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిప్లైన్ సంస్థ సర్వే నిర్వహించి ఒక రూట్ మ్యాప్ ని సిద్ధం చేసినట్లు సమాచారం. చెంతని గోదావరి పడమర దిక్కున ప్రకృతి ప్రసాదించిన కొండ ప్రాంతాలు. వెన్నెల జలపాతం పరిసర ప్రాంతాల్లో పక్షుల రాగాలు కిలకిలలాడే అందమైన పక్షులు సందడితో వెన్నెల జలపాతం నిత్యం అందాలను విరబూచేవిధంగా తన సౌందర్యాన్ని వెదజల్లుతుంది. వెన్నెల జలపాతం అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ కృషి హర్షించదగ్గ విజయమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అద్దంకి నరేష్ ఎంపీడీవో శ్రీనివాసరావు ఎంఈఓ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
**గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబీ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు**
**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఆగస్టు 23(నినాదం) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబీ పండుగ నేపథ్యంలో శాంతి కమిటీ సభ్యులతో, ఏర్పాట్లపై అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో నగరంలో లో-లెవెల్ లో ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్లలో విద్యుత్ తీగల విషయంలో ఆ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రూట్ క్లియరెన్స్ సమర్పించాలని అన్నారు. వేడుకల కోసం లైటింగ్, శానిటేషన్, బ్లీచింగ్ వంటి పనులను మున్సిపల్ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్యాధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో షిఫ్ట్ ల వారీగా ఈతగాళ్లను, బోట్ లను ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక, మైనింగ్, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబి పండుగలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వినాయక నిమజ్జనం రోజున సాధ్యమైనంత త్వరగా విగ్రహాలను నిమజ్జన ఉత్సవానికి తరలించాలని కోరారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే రూట్లలో పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలని అధికారులను కోరారు. ముఖ్యంగా మునిసిపల్, ఎలక్ట్రిసిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆ శాఖల సిబ్బందిని షిఫ్టుల వారీగా విధుల్లో ఉంచాలని అన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఉంటుందని, మిలాన్ ఉల్ నబి వేడుకలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఈసారి నగరంలో సుమారు 3300 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు పోలీస్ వెబ్సైట్లో గణేష్ మండపం పూర్తి వివరాలు నమోదు చేయాలని, తద్వారా వారికి తగిన సేవలు అందుతాయని తెలిపారు. నిమజ్జన ప్రాంతాలైన మనకొండూర్, కొత్తపల్లి, చింతకుంట చెరువుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, డ్రైవర్లు, మెకానిక్, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని అధికారులకు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

NINADAM CINEMA


# రామాయణ అందరికీ నచ్చి తీరుతుంది

**నచ్చలేదంటే నిర్మాణ లోపంగా భావిస్తాం**
**నిర్మాత నమిత్ మల్హోత్రా ఆసక్తికర కామెంట్**




బాలీవుడ్ నుంచిలవస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో 'రామాయణ' (దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్నది. ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటుడు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కైకేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమా విషయంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా. రామాయణ చిత్రం కేవలం భారతీయ ప్రేక్షకులనే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా నిర్మిస్తున్నామని నిర్మాత నమిత్ మల్హోత్రా అన్నారు. హాలీవుడ్ నుంచి వచ్చిన గ్లాడియేటర్, అవతార్ సినిమాల మాదిరిగానే ఈ చిత్రం కూడా భారీ స్థాయిలో ఉండబోతుందని తెలిపాడు. అయితే ఈ సినిమా ఎంత భారీగా తెరకెక్కించిన కూడా హాలీవుడ్ ప్రేక్షకులకు నచ్చుకుంటే ముమ్మాటికి అది మేకర్స్ తప్పేనని నమిత్ మల్హోత్ర తెలిపాడు. అప్పుడు ఈ సినిమా ఇంకా బాగా చేసి ఉండాల్సింది అనుకుంటానని నమిత్ తెలిపాడు.

# కాంతారా ప్రీక్వెల్ ద్వారా వందకోట్లపై దృష్టి




కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చిన 'కాంతార' సినిమా పాన్-ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. నటుడు రిషబ్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రం కేవలం కన్నడలోనే కాకుండా, తెలుగు స్టేట్స్‌లో కూడా భారీ విజయం సాధించింది. ఇప్పుడు ఆ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, మేకర్స్ ప్రీక్వెల్‌ని తో రాబోతున్నారు. ఈ ప్రీక్వెల్ అక్టోబర్ మొదటి వారంలో విడుదల కానుంది. అయితే అసలు హాట్ టాపిక్ ఏమి టంటే.. ఈ సినిమా కోసం మేకర్స్ తెలుగు రాష్ట్రాల్లో భారీ బిజినెస్‌ని ఆశిస్తున్నారట. ఏకంగా 100 కోట్ల మేర డీల్ గా మేకర్స్ క్విట్ చేస్తున్నా రట. ఇది మాత్రం ఒక షాకింగ్ మొ త్తం అని చెప్పాలి. పార్ట్ 1 ఎంత పెద్ద హిట్ అయినప్పటికీ దానికి ప్రీక్వెల్ కూడా అదే రేంజ్ లో హిట్ అవు తుంది అని చెప్పడానికి లేదు. ఇప్పు డు వరకు పాన్ ఇండియా ఆడియెన్స్‌ని చేసే సాలిడ్ కంటెంట్, -ట్రైలర్, ప్రోమోస్ కూడా రాలేదు. అయినప్పటికీ, మేకర్స్ భారీ బిజినెస్ ఆశిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా సినిమాలు బిజినెస్ విషయంలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'కాంతార ప్రీక్వెల్' కోసం ఇంత భారీ మొత్తం పెట్టడానికి డిస్ట్రిబ్యూటర్లు ముందుకు వస్తారా అన్నదే పెద్ద ప్రశ్న. మరి ఈ రూ.100 కోట్ల డీల్ నిజంగా జరుగుతుందా? లేక ఇది కేవలం మార్కెటింగ్ హైప్ మాత్రమేనా అన్నది చూడాలి.

# పోర్న్ మూవీలో తమన్నా..


**తలలు పట్టుకుంటున్న ఫ్యాన్స్**



ఒకప్పుడు సాఫ్ట్ అండ్ క్యూట్ పాత్రలతో ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న తమన్నా భాటియా.. ఇప్పుడు రూట్ మార్చింది. సౌత్‌లో చాన్స్‌లు లేకనో, బాలీవుడ్‌లో ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయో తెలియదు కానీ బోల్డ్ పాత్రలతో ఘాటుగా కనిపించేందుకు ట్రై చేస్తుంది. సాఫ్ట్ క్యారెక్టర్స్ వదిలేసి.. ముద్దులతో హద్దులు చెరిపే పాత్రలనే ఎంచుకుంటుంది. అవే తనకు బోలెడు అవకాశాలను కల్పిస్తున్నాయని ఈ మధ్య స్టేట్మెంట్ ఇచ్చింది కూడా. ఇక తాజాగా మరో బోల్డ్ మూవ్ తీసుకున్నట్లు తెలుస్తోంది. విచ్చలవిడి రొమాంటిక్ సిరీస్‌లు, మూవీలకు కేరాఫ్ అయిన ఏక్తా కపూర్ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినట్లు సమాచారం. ఇంతకు ముందు సన్నీ లియోన్ నటించిన 'రాగిణి ఎమ్ఎమ్ఎస్' సీక్వెల్‌లో తమన్నా నటించబోతుందని న్యూస్ స్ప్రెడ్ అయింది. 'రాగిణి ఎమ్ఎమ్ఎస్ 3'లో లీడ్ రోల్ చేస్తుందని బాలీవుడ్ మీడియా కథనాలను ప్రచురిస్తోంది. దీంతో మిల్కీ బ్యూటీ ఫ్యాన్స్ డిజప్పాయింట్ అవుతున్నారు. ఇలాంటి పోర్న్ మూవీలో తమన్నా? పిచ్చి నిర్ణయాలు ఎందుకు తీసుకుంటుందని బాధపడుతున్నారు.

# కొత్త తరం కథలంటే నాన్నకు ఇష్టం

**తండ్రి కమల్ గురించి శృతిహాసన్**



సెలబ్రిటీలు అంటే అందరికీ ఒకే అభిప్రాయం ఉంటుంది. కోట్ల రూపాయలు సంపాదిస్తారు, లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తారు, ఖరీదైన కార్లు, బంగ్లాలు కొంటారు. నిజానికి చాలా స్టార్‌లు కూడా అలానే ఉంటారు. మార్కెట్లోకి వచ్చిన కొత్త లగ్జరీ కార్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తారు. కోట్ల రూపాయల విల్లాలు, ఫారిన్ ప్రాపర్టీస్, బ్రాండెడ్ వస్తువులు ఇవన్నీ వారి లైఫ్‌లో భాగమే. కానీ అందరికీ ఒకే ఫార్ములా ఉండదు! విశ్వనటుడు కమల్ హాసన్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటారని అసలు విషయం కూతు శృతి హాసన్ బయటపెట్టింది. ఆయన ఖరీదైన కార్లు కొనరు. విల్లాలు, ఫారిన్ ప్రాపర్టీస్ జోలికే వెళ్లరట. ఈ విషయాన్ని ఆయన కుమార్తె శ్రుతి హాసన్ తాజాగా రివీల్ చేసింది. ఆమె చెప్పిన దానీ ప్రకారం.. 'నాన్నకి తెలిసినది ఒకటే - కొత్త కాన్సెప్ట్‌తో వచ్చే సినిమాల్లో పెట్టు-బడి పెట్టడం. టెక్నికల్ క్వాలిటీ ఉన్న కథలు అంటే ఆయనకు చాలా ఇష్టం. వాటికి అవసరమైన డబ్బు ఖర్చు చేయడంలో ఆయన ఎప్పుడూ వెనుకడుగు వేయరు. ఎందుకంటే నాన్నకు డబ్బు శాశ్వతం కాదన్న నమ్మకం ఉంది. సినిమాల ద్వారా సంపాదించిన దానికంటే పోగొట్టు-కున్నదే ఎక్కువ. కానీ ఇంట్లో చాలా సింపుల్ లైఫ్÷-టసైల్ ఇష్టపడతారు. ఖరీదైన వస్తువుల పై ఆయనకు అసలు ఆసక్తి ఉండదు. విల్లాలు, భూములు, ఫారిన్ ప్రాపర్టీస్ ఏవీ ఆకర్షణీయంగా అనిపించవు. బదులుగా, టెక్నాలజీకి సంబంధించిన కొత్త విషయాలు తెలుసుకోవడంలో ఎక్కువ ఆసక్తి చూపుతారు. అలాగే కొత్త ఐడియాస్, సబ్జెక్ట్స్ ఉన్న డైరెక్టర్స్‌ను ప్రోత్సహించడం ఆయనకు ప్యాషన్' అని శ్రుతి హాసన్ తెలిపింది. మాత్రం సినిమాల మీద ప్యాషన్ కోసం సంపాదన అంతా ఖర్చు చేసే వ్యక్తి అని చెప్పవచ్చు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితో శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించా


**తల్లి డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర కామెంట్స్**



ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పై నటి శ్రీలీల తల్లి, డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని తెలిపారు. జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్‌షోలో శ్రీలీల, స్వర్ణలత పాల్గొన్నారు. బాల్యంలో ఎన్టీఆర్ కూచిపూడి నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఫొటోని డిస్‌ప్లే చేయగా.. స్వర్ణలత నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. నాకు అమ్మాయి పుడితే డ్యాన్స్ నేర్పించాలని నిర్ణయించుకున్న క్షణాల్ని గుర్తుచేసే ఫొటో ఇది అని తెలిపారు. అప్పుడు ఎన్టీఆర్‌తో మీరు మాట్లాడారా? అని అడగ్గా.. 1997లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన 'తానా' సభల్లో మాట్లాడా. అనుకున్నట్టే శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించానని స్వర్ణలత తెలిపారు. తాను తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడగలనని, కొత్త భాష నేర్చుకోవడం ఎప్పుడూ ఆసక్తే అని శ్రీలీల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'కెరీర్‌లో దూసుకెళుతున్నావ్. వేరే హీరోయిన్ల అవకాశాలు కూడా తీసుకుంటు-న్నావ్' అని జగపతి బాబు సరదాగా అన్నారు. ఈ ఎపిసోడ్ ఓటీటీ- 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. తొలి ఎపిసోడ్‌లో ప్రముఖ నటు-డు నాగార్జున సందడి చేసిన సంగతి తెలిసిందే.

ఇటీ-వల 'జూనియర్' మూవీతో ప్రేక్షకులను పలకరించిన శ్రీలీల.. 'మాస్ జాతర', 'పరాశక్తి' 'ఉస్తాద్ భగత్‌సింగ్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు. ఎన్టీఆర్ కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన సంగతి తెలిసిందే. 12 ఏళ్ల సాధనలో వందకిపైగా ప్రదర్శనలిచ్చారు.

# కింగ్డమ్ నుంచి అన్నా.. పాట విడుదల




విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కింగ్డమ్. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటించగా.. సత్యదేవ్ కీలక పాత్రలో నటించాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ సినిమా నుంచి ఎమోషనల్ సాంగ్ అన్నా అంటేనే పాట ఫుల్ వీడియోను విడుదల చేశారు. అన్నా అంటేనే.. ఉన్నానంటూనే అంటూ తన సోదరుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్‌గా సాగింది ఈ పాట. ఈ పాటను కృష్ణకాంత్ రచించగా, అనిరుధ్ స్వరపరిచి స్వయంగా ఆలపించారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అన్నదమ్ములుగా నటించారు. ఆ ఇద్దరి నేపథ్యంలో సాగే పాటే ఇది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787